
ఉపనిషత్తులు

# బ్రహ్మవల్లీ



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!


మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# బ్రహ్మవల్లీ

(ఆంధ్ర టీకా తాత్పర్య సహితము.)



గ్రంధకర్త:

**శ్రీ దూర్వాసుల నరసింహమూర్తి**

చుక్కపల్లి అగ్రహారం

గనకవగం పోస్టు (కృష్ణాజిల్లా)

వెల 1-0-0

# పరిచయము

వేదములలో కర్మలను ప్రతిపాదించు భాగములకు కర్మకాండమనిన్నీ, జ్ఞానమును ప్రతిపాదించు భాగమునకు జ్ఞానకాండమనిన్నీ వచింతురు. ఈ జ్ఞానభాగమంతయు నుపనిషత్తులో వివరింపబడినది. అందు తైత్తిరీయోపనిషత్తులలో బ్రహ్మవల్లి మిక్కిలి ముఖ్యమైనది.

ఇందు బ్రహ్మవేత్తకు బ్రహ్మప్రాప్తి రూపఫలము, బ్రహ్మస్వరూప లక్షణము, కోశపంచక నిరూపణము, సృష్టి క్రమము, మానుషానందము మొదలు బ్రహ్మానందము వరకుగల తారతమ్య నిరూపణము అసద్వాద ఖండనము, మున్నగు పెక్కు మహత్తర విషయములు పేర్కొనబడినవి. ముమూర్షువులకు ప్రాణావసానకాలమందు ఈ బ్రహ్మవల్లి యనువాకములను కర్ణములలో జపింతురు. ఇదియే దీని ప్రశస్తిని చాటుచున్నది. ఆదిశంకరులు మున్నగు మతకర్తలందరు ఈబ్రహ్మవల్లికి విపులముగా భాష్యములనురచించిరి. మాధవాచార్యులు వారు దీనికి నొక బృహద్వివరణమును రచించిరి. తమ తమ మాతృభాషలలో పలువురు మహా పండితులు తమ తమ ప్రతిభానుసారముగా వివరణములను వ్రాసిరి. ఇంత విశిష్టవ్యాప్తిగల యుపనిషత్తు మరియొకటి గానరాదు. చుక్కపల్లి యగ్రహార వాస్తవ్యులగు బ్ర॥ శ్రీ దూర్వాసుల నరసింహమూర్తి

గారు తేట తెనుగు భాషలో నీవివరణమును వ్రాసి ప్రచు రించిరి. వీరి వివరణము పరివర్తనముగాని, గతానుగతికము గాని కాదు. తమ యనుభవములో తమ ప్రతిభలో స్ఫురించిన విషయములను సేకరించి వివరణమును వ్రాసిరి.

స్వర్గాది లోకములను ఆయాలోక వాసుల వృత్తాంతము లను, మనుష్యలోకపరముగానే వీరు వివరించిరి. వీరి వివర ణము ప్రాయికముగా సాంఖ్యమతానుయాయిగా స్ఫురించును. చదువరులకభిరుచిని కలిగించు పెక్కువిషయము లిందు గలవు. వీరిట్లె భగవద్గీతకు నొక విపులమగు తెనుగు వివరణమును రచించి ప్రకటింపనున్నారు.

"తంసంతః శ్రోతుమర్హన్తి సదసద్వ్యక్తి హేతవః" అని కాళిదాసు వచించినట్లు ప్రాజ్ఞులే గుణదోష వివరణకు వలంతులు.

ఈ వివరణము బహుళవ్యాప్తిని పొందించి వివరణకర్తల యుద్యమమునకు సర్వసంపూర్ణ సాఫల్యము నొసంగునట్లు భగ వానుని ప్రార్థింతుము.

ఇతిశమ్

నరసన్నపేట
2–3–53

వాసా సూర్యనారాయణ శాస్త్రి

ఓ మ్.

# ని వే ది క.

వేదముల పరమార్థమునననుసరించి మహాత్ములచే రచియింపబడిన ఉపనిషత్తులు నూటయెన్మిదిగలవు. అందు కొన్ని ప్రత్యేకమతములం జెప్పునట్టివియు, మరికొన్ని మహిమయుక్తమంత్రములం జెప్పునట్టివియు (గారుడోపనిషత్ మొదలగునవి) నై యున్నవి. వానియందు ఈశావాస్యాది యుపనిషత్తులు శ్రేష్ఠములని మతత్రయాచార్యులును మరికొందరు విద్వాంసులునుంగూడ వ్యాఖ్యానము లొనర్చియుండిరి. అందీ తైత్తిరీయమనునది యొకటియైయున్నది. దీనిని యజుర్వేదములోకూడ జదివించుచుందురు. దీనియందు శీక్షావల్లియనియు ఆనందవల్లియనియు, భృగువల్లియనియు, నారాయణ వల్లియనియు, నాల్గుభాగములుగా నాలుగుపనిషత్తులుగా జదివించుచున్నారు. అందు దీవ్రాయబడిన యుపనిషత్తు ఆనందవల్లియనునది. దీనిని బ్రహ్మవల్లియనికూడ చెప్పెదరు. దీనియందానంద మీమాంస చేయబడినదగుట నానందవల్లియనియు, "బ్రహ్మవిదాప్నోతిపరమ్"ని యారంభింపబడుట బ్రహ్మవల్లియనియుం జెప్పుదురు.

ఈ ఉపనిషత్తున బ్రహ్మజ్ఞాని మోక్షము నొందునని ప్రారంభింపబడినది. దానంజేసి బాధాప్రదమగు బంధమును బాయుటకు జీవుల కలవియగుననియు, బంధరాహిత్య మోక్ష

రోపాసనవలన మాత్రము కాబడుననియు నిస్సందేహముగ జెప్పబడినది. సత్యజ్ఞానానంతాది లక్షణములం జెప్పబడునట్టి వాడీశుడనియు నాతని నుపాసకుడు అనుభవమున దెలియజాలు ననియు, నాత్మ గుహాయందున్నవాడగుట, నేదిష్టపదార్థమ నియు దానితో కూడి సర్వకోర్కెల నీయుపాసకుడొందుననియుం జెప్పబడినది. దేశకాలాదులకు చిక్కనివాడీశుడగుట ముక్తావస్థ, దేశకాలాది సంబంధరహితమని చెప్పబడును. దేహాద్యభిమానమును వీడిననే ఈశ్వరుం దెలియగలుగుటవలన దేహాది సంబంధ రహితమనియు దేహావశ్యక కామవిరహితమనియుం జెప్పబడును. అకర్మ ఫలమగుటవలనను, కర్మ కారణనాశన మగుటవలనను పునరావృత్తిరహితమును, అనంతమును అని చెప్పబడును,

కపిలమహర్షికృతసాంఖ్యదర్శనమున భౌతికాదితాపములయత్యంతనివృత్తి యత్యంతపురుషార్థమని మొదలిడి మోక్షమునుగూర్చి చక్కనివిమర్శ చేయబడినది. దానియందును ఈశ్వరుని యభ్యంతరప్రత్యక్షమున నెరుంగవచ్చుననియు దానినే ప్రమయనియుం జెప్పెను. "అసన్నికృష్టార్థపరిచ్ఛిత్తిః ప్రమా", యని చెప్పబడినది. దానికిసాధనముగమూడు ప్రమాణములం జెప్పెను. (సిద్ధరూపబోద్ధృత్వాద్వాక్యార్థోపదేశః) అని శబ్దమున నీశ్వరుం దెలియజాలుట చెప్పబడియుండెను. అట్లు దెలసినదాని నభ్యసించి దానిబలమున నీశ్వరు నెరుంగవచ్చునని చెప్పబడెను.

ఈఉపనిషద్వాక్యముల యందుగూడ "యోవేదనిహితంగుహాయాం" అని స్పష్టముగ చెప్పబడినది. ఇట్లది స్పష్టముగను, సంగ్రహముగను, సంశయనివారకమగునట్లు యుక్తియుక్తముగను చెప్పబడినది. బ్రహ్మమును దానిం దెలసి దానితో కూడి మోక్షమందజాలు జీవులును కలరనిచెప్పి యాజీవులకు బంధస్వరూపమును మోక్షమునకు సాధనమగుచున్న పంచకోశవివరణ మొనర్చెను. దానికై సూక్ష్మభూతోత్పత్తి గ్రాహ్యముగానిడి, స్థూలభూతవర్ణన మొనర్చెను. ఆస్థూలభూతముల వలన మొదల నీయన్నమయకోశము గలిగినదని చెప్పబడినది.

రెండవయనువాకమున సర్వజీవులునుఅన్నమయకోశము వలన ప్రకటింపబడుచున్నవనియు, దానికి అన్నమాధారమనియు, దానివలననే పుట్టుటయు, పెరుగుటయు, నశించుటయు, కాఁబడుచున్నదనియు, అట్టి సర్వాన్నరచయిత యాయీశ్వరుడనియు నాతని నక్లెరిగి యుపాసించువా రాతనినే బొందుదురనియు విశ్వరూపోపాసనము చెప్పబడినది. పిమ్మట ఈయన్నరసమయమునునిండి యదేపరిమితికలిగి దీనితోనవినాభావసంబంధముకలిగి యన్నమయమునకు బలమొసంగునట్టి ప్రాణమయకోశము గలదని చెప్పబడెను.

మూడవయనువాకమున ప్రాణమువలననె సర్వజీవులును బ్రతుకుచున్నారనియు, నిదియే యాయువనియు, సర్వాయుః కారణు డీశుడనియు, నక్లెరిగి యుపాసించువా రాయీశునే బొందుదురనియు, మరల విశ్వరూపోపాసనమే చెప్పబడినది.

పిమ్మట దీనినినిండి దీనితో నవినాభావసంబంధము కలిగి యున్న మనోమయకోశము గలదనిచెప్పబడినది. దీనికిఋగ్యజుస్సామములు శిరోదక్షిణోత్తర పక్షములుగా వర్ణింపబడెను. మనసువలననే సర్వలోకవిషయికజ్ఞానమలవడజాలుట నట్లు వర్ణింపబడెను. ఈమనసు సర్వేంద్రియాధిష్ఠానమై జాగ్రదవస్థా కారణమై యున్నది. అందుచే పవిత్రములును, సత్యార్థప్రతిపాదకములును, ఈశ్వరజీవప్రకృతి మోక్షాదిజ్ఞానహేతువులును అగువేదము నీమనోమయమువలన నొందజాలుదురని యిట్లు వర్ణింపబడినది.

నాల్గవయనువాకమున మనోమయకోశముం జెప్పుచు వాఙ్మానసముల కీశుడు తెలియబడరానివాడనియు అట్టిబ్రహ్మము యొక్క యానందమెరిగినవాడెట్లును భయము నొందడనియు చెప్పబడెను. జీవులకు మనసె సర్వవిషయ గ్రహణసాధనమై యుండ దానివలన దెలియరాదని సాధనవైకల్య మూపాదింపబడెను. ఆనంద మెరుగవలెననెడి విధివాక్యము దోచుచున్నది. ఇదెట్లునరిబడుసన అన్నమయప్రాణమయమనోమయములులోకవిషయములనుమాత్రమెరిగి యనుభవింప సమర్థములు. విజ్ఞానమయకోశమగు బుద్ధిచేమాత్ర మీశ్వరు నానంద మెరుకవడ గలదు. అప్పట్ల మనఇంద్రియాదులు కార్యాసక్తములై యుండుసేని ధ్యానమే కుదరదు, అందుచే నింద్రియాదుల నరికట్టి మనసును బుద్ధియందుజేర్చి యానందమయకోశమున జెప్పబడు చిత్స్వరూపగు నాత్మ, తనయుందలి యీశ్వరునెరిగి యానంద

మనుభవింపజాలును. అందుచే మనసునరికట్టుటమాత్రి మిందు చెప్పబడినదనియెంచవలెను. దేహి యన్నమయప్రాణమయ మనోమయములం గూడెనేని లోకవిషయములనుమాత్రము దెలియగాంచును. వానినివశమందొనర్చి విజ్ఞానానందమయము లను వికసింపశేయగలిగెనేని యీశ్వరునానంద మెఱుగజాలును. ఈ రెండుకోశములును ఈశ్వరోపాసనమునమాత్రమే విని యోగములు. అన్నమయ ప్రాణమయములకును విజ్ఞానానంద మయములకును మధ్యమమగు నీమనోమయము ఈ ఉభయ పక్షములకును ముఖ్యమైనదియని చెప్పబడుచున్నది. అనగా అన్న ప్రాణమయములం గూడెనేని లోకవిషయములు నన్నిటిం గ్రహింపజాలును. ఆ సంస్కారమున బుద్ధియు విమర్శనాపటి ష్ఠమై మనసు తనవశమగునేని యీశ్వరోపాసనమున ధన్యత గాంచును. మనస్సహాయములేని బుద్ధి పనిచేయజాలదు. అట్టి మనోమయమును నిండినదై విజ్ఞానమయము కలదనియు శ్రద్ధాఋతసత్యయోగాదులు రూపముగాగలదియనియు వర్ణింప బడెను. తైజసోపాసన మిందు వర్ణింపబడెను.

5 వ యనువాకమున బుద్ధి అకర్మత్వమును బొంద జాలును. సర్వకర్మములును జేయింపజాలును. అభిమానమున చేయబడునట్టిది కర్మయనబడును. ధర్మయుక్తమై విధియగు దాని నాచరించుచు ఫలాశయందలి మోహామునువీడి యీశ్వ రార్పితచిత్తుడగు నాతనిని కర్మము లంటజాలవు. అందుచే నకర్మమనంబడును. వైరాగ్యజ్ఞానేశ్వరోపాసనము లలవడని

వానిచే నకర్మత్వసిద్ధి గాంచబడదు. అట్టివానికిగూడ ప్రమాద ములు కలుగవచ్చును. ఈశ్వరోపాసన మొనర్పనివాని కెట్లును కలుగజాలదు. తాను ప్రకృతినిమాత్రమే, రమించుటవలన అందుచే ననంతజ్ఞానియు ను విస్తారరూపుడును మొదటివాడు నగు ఈశ్వరునెఱింగి ధ్యానించునేని దానియందు ప్రమాద మొందడేని దేహసంబంధములగు సర్వపాపములుపోగా నా యీశ్వరు నొందునని చెప్పబడినది. ఇదియే ప్రాజ్ఞరూపో పాసనము. ఇట్లు ఓంకారార్ధ మెరిగి యుపాసించు నా దేవో త్తముడు మోక్షానంద మొందగలుగునని చెప్పబడినది. అట్టి యీవిజ్ఞానమయమును నిండి దానితో నవినాభావసంబంధము గలదియగు నానందమయకోశము కలదు. ప్రతికోశవివరణము నందును అన్యోన్యావినాభావసంబంధమును చెప్పదలచియే "తస్యైషఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య" యని చెప్పుచుండెను. ఆనందమయమునకు మోదప్రమోదానందములును బ్రహ్మాను భవమును కలుగ గలవని రూపముగ వర్ణింపబడెను.

6 వ యనువాకమున ఈ ఆనందమయమును చెప్పుచు ఈశ్వరునెరిగి యుపాసింపకున్న నాత డస త్తగుచున్నాడనియు ఈశ్వరునెరిగి యుపాసించిన నాతనిని సత్పురుషుడని బుద్ధిమం తులు నిశ్చయించుచున్నారనియు పై జెప్పినదాని దార్ఢ్యార్థమై స్పష్టముగ జెప్పబడెను. ఎరుగనివా రీశ్వరుని బొందజాలు దురా? ఎరిగినవారైన బొందజాలుదురా? యనుప్రశ్నములు చేయబడినవి. వీనికి 7 వ యనువాకముచివరను సమాధాన

వాక్యములుగలవు. ఇంతవరకు బ్రహ్మజ్ఞాని ఎట్టివాడో? ఉపాసనావిధమెట్టిదియో? వర్ణింపబడెను. బ్రహ్మమున్నదని యెట్లు చెప్పవలయునో? యిటుపై వర్ణింపబడుచున్నది. సృష్ట్యాదులంగాంచి దీని రచించినవాడుండితీరవలయుననెడి సిద్ధాంతమువలన కలడని చెప్పబడును. చేతనవిరహితమగు సృష్టికలుగజాలదు. అదియే ప్రమాణముగాగొని యీసృష్టినొనర్ప సంకల్పించినవాడీశుడనిచెప్పి పిమ్మట విరోధాలంకారముల నాతని సంగ్రహముగజెప్పెను.

7వ యనువాకమున ప్రకృతి సత్వరజస్తమములసామ్యావస్థయందుండ దానిని జీవుల భోగార్థమై యీశుడు రచించినాడని మొదలిడి జీవులకు సర్వసుఖముల నొసంగజాలువాడీశుడనియు నాతని విడచిన జీవులకు జీవనమేలేదనియు నట్టి యీశుని నెవ్వడెరిగి యుపాసించుచున్నాడో ఆతడుభయస్థితిని పొందును. ఇదిఉత్తమాధికారి లక్షణము. ఆతని నెరుగజాలనియట్టి వాడు భయమునే పొందును. ఆతని ధ్యానింపని పండితుడుకూడ అట్టి భయమునే పొందునని జెప్పబడినది.

8 వ. యనువాకమున సర్వమును శాసించువాడీశ్వరుడని చెప్పబడినది. అట్టియాతనిదియగు యానందమునుగూరి విమర్శింపబడినది. అది 11యంతరవులుగాగల్పింపబడినది. అవి యొకదానికంటె నొకటి శతగుణాధిక్యమున చెప్పబడెను. అది శ్రోత్రియత్వాకామహతత్వములు గల యుపాసకునియందు చెప్పబడినది. ఇయ్యవి సమమగు కొలత్తయా? యన కొలత

గాకున్నను ఉపాసకులయందలి భేదములంబట్టి యీ యంతరవులు సత్యవిషయములన వచ్చును. అట్టి నిష్కళంకోపాసకుని యానందమును ఆయీశ్వరుని యానందమును ఒక్కటియే యని చెప్పబడుచున్నది. ఇది యనుభవమున లేని వానికి మరలజన్మము చెప్పబడినది.

9 వ యనువాకమున అవాఙ్మానస గోచరుడగు నాయీశుని యానంద మెరిగినవాడు ఎట్లును, భయమందడని మరల చెప్పబడినది. అట్టి యానందానుభవము కలవాడు పాపమేలచేసితిని? పుణ్యమేల చేయకపోతినని పరితాపమునొందడు. అట్టి యకర్మత్వసిద్ధి నొందిన ఆ యుపాసకుడు ఈశ్వరసాన్నిధ్యము నొందజాలునని చెప్పబడెను. ఇట్లు బ్రహ్మజీవ ప్రకృతుల విషయమును మోక్షమునుగూర్చి చెప్పబడినది. ఏమతముల యందైన నభిమానింపక నా యెరిగినంతవరకు సత్యమె యనువదించితిని. బుద్ధిమంతులింకను వివరింపదగిన నిగూఢ సత్యములున్న వివరించి కృతార్థులయ్యెదరుకాక. సత్యమునే దెలియుచు బలుకుచు, అట్లాచరించుచు పాఠకులు కృతార్థులయ్యెదరుగాక!

ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః—

ఓమ్.

# బ్రహ్మవల్లీ

## ఆంధ్రటీకాతాత్పర్యసహితము

## శాంతిపాఠము.

సహ నావవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవా
వహై తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై ।

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః॥

టీ. సః-పరమేశ్వరుడు, నౌ - (శిష్యాచార్యులమగు) మమ్మిరువురను అవతు-రక్షించుగాక సః-పరమేశ్వరుడు నౌ-మమ్మిరువురను భునక్తు-పరిపాలించునుగాక, వీర్యం-(బ్రహ్మ విద్యాప్రాప్తి నిమిత్తమగు) బలమును సహ-కూడ కరవావహై-చేసెదముగాక, నౌ-మాయొక్క అధీతం-అధ్యయనము చేయబడినది తేజస్వి - తేజోవంతమైనది అస్తు-అగుగాక మావిద్విషావహై-ద్వేషింపకుండెదముగాక, ఓం శాంతిః శాంతిః శాంతిః-ఆత్మిక, భౌతిక, దైవిక తాపములు శాంతించును గాక.

తా. శాంతియందు గురుశిష్యులిరువురంగూర్చి చెప్ప బడినది. గురువునకొకడేశిష్యుడుండునని కాదు. ఆమంత్రరచ యితలంగూర్చియే గాదు. విద్య గురు శిష్య పరంపరాక్రమ మున విస్తరిల్లునట్టిదియగుటచే ఎల్లకాలములం గలుగు గురు శిష్యులంగూర్చి చెప్పబడినదని తెలియవలెను. లోకమునవిద్యయే

సమస్తపురుషార్థసాధనమగుటనట్లు చెప్పబడినది. విద్యలలో బ్రహ్మవిద్య అత్యుత్తమము. బ్రహ్మమింద్రియాదులకు తెలియబడరానిది యగుటను, దానిం దెలియుటబహుకష్టసాధ్యమనియు, ఆయావట్ల దోచు సంశయములు గురువువలనమాత్రము నివారింపబడదగినవి యగుటవలన, విద్యా నిస్తారకముగ నిందీశ్వరప్రార్థన మంగీకరింపబడినది. పరమేశ్వరుడు రక్షించుగాక, పరిపాలించుగాక, యని చెప్పబడినది. పరమేశ్వరుడు తనయపారవిద్యాబలమున సర్వలోకములను, సర్వజీవులనురచించి, యాయా దేహములకనువగు జ్ఞానసాధనముల గల్పించినవాడగుటను, ఆతని రచనాదులం దెలియుటవలననే జ్ఞానము వృద్ధియగుటవలనను, ఆతనినుపాసించి, యితరమును మరచుటవలననే సంపూర్ణవిద్వాంసుడనబడజాలుటవలనను, తాము పొందదగిన ఉత్తమవిద్యలకై పరమేశ్వరరక్ష యావశ్యకమని యట్లు చెప్పబడినది. విద్యావిషయమున అలసతయు, మందతయు, లేకుండ శ్రద్ధయు, ఆసక్తియు మొదలగు సద్గుణములు గావలెనని వీర్యవంతులము గావలెనని చెప్పబడినది. తమవిద్య ఉత్తమమై ప్రకాశించునట్టిదియగుటం గోరి తేజస్వంతమగుగాకయని చెప్పబడినది. గురుశిష్యుల యందు మతాదిభేదములును, ఈర్ష్యాసూయాదులునుంగలిగి సత్యగ్రహణదూరులగుదురని ద్వేషింపకుండెదము గాకయని కోరబడినది. ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక తాపములే బంధమనియు, వానియత్యంత నివృత్తియే మోక్షమనియు ముమ్మారు శాంతియని చెప్పబడినది. ఇట్టిది బ్రహ్మవిద్యాప్రాప్తినిగూర్చి చెప్పబడినశాంతిపాఠము.

# బ్రహ్మవల్లీ

## ప్రథమానువాకము

బ్రహ్మవిదాప్నోతి పరమ్। తదేషాభ్యుక్తా। సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ। యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్। సోఽశ్నుతే సర్వాన్కామాన్సహ। బ్రహ్మణా విపశ్చితేతి।

టీ. బ్రహ్మవిత్-బ్రహ్మమునెరిగినవాడు పరం-మోక్షమును ఆప్నోతి - పొందుచున్నాడు, తత్ - ఆవిషయమును గూర్చి ఏషా-ఇది అభ్యుక్తా-చెప్పబడినది. బ్రహ్మ-బ్రహ్మము సత్యం-సత్యమును జ్ఞానం-జ్ఞానమును అనంతం-అంతములేనిది యును (అనిచెప్పబడుచున్నది) యః - ఎవడు పరమేవ్యోమన్ గుహాయాం- పరమాకాశమను గుహాయందు నిహితం-ఉన్న వానినిగ వేద-తెలియుచున్నాడో,సః-వాడు విపశ్చితా-బ్రహ్మణా సహ - విజ్ఞానఘనుడగు నా బ్రహ్మముతో గూడి సర్వాన్ కామాన్-సమస్తమైన కోర్కెలను అశ్నుతే - అనుభవించుచున్నాడు ఇతి-ఇది అని మంత్రము సమాప్తము.

తా. ఇది మోక్షమును జెప్పుట కుద్దేశింపబడిన యుపనిషత్తు. ఆవిషయము మొదటనే ప్రతిజ్ఞచేయబడినది. బంధము సర్వదుఃఖమూలముగుట దానియత్యంతోచ్ఛిత్తి యత్యంతసుఖద

మగు మోక్షమనంబడును. జీవులొందదగిన - ఉత్తమసుఖము వేరొండు గలుగదు. అందుచే నుత్తమసుఖము గోరువారందరు మోక్షమభిలషింతురు. బ్రహ్మజ్ఞాని మోక్షమును పొందునని చెప్పబడెను. అనగా మన్యజ్ఞానమును మోక్షసాధనము కాదని నిర్ణయింపబడుచున్నది. ఏలన? బ్రహ్మముదక్క తక్కు పదార్థములు జీవులును, ప్రకృతియును మిగిలియున్నవి. వానిలో జీవులల్పజ్ఞులగును, ఇంద్రియములచే దెలియబడునట్టివారును, బంధ దుఃఖమును విడువగోరి శ్రీకులాడునట్టివారును. సర్వదోషసంబంధము గలిగి దానివలన నాత్రిముత్తమ గుణముల నెరుగునట్టివారు. అట్టివారి నారాధించిన నేమి ఫలము? ఇకప్రకృతి ఘోరమూఢాది ధర్మములు గలిగి పరమేశ్వరనియంతృత్వమున జీవులకు బంధరూపమై యొప్పారుచున్నది. దానిసంబంధమును విడచుటయే జీవులకు మోక్షమగుచుండ దాని నారాధించిన నేమిఫలము? కాన సర్వసద్గుణరాశియు, గుణదోషసంబంధ విరహితుడును, విజ్ఞానానందాది గుణయుక్తుడును, మోక్షప్రదాతయు నగుట నాతని ననుభవమున దెలియగాంచుట మోక్షమని చెప్పబడినది. అట్టిబ్రహ్మము- ఇంద్రియముల కతీతుడును వాఙ్మానసముల కందనియట్టివాడును, అగుట నీప్రకృతి జీవులను దెలియజాలునట్లు, దెలియరానివాడనియును, సూక్ష్మత్వ, విభుత్వానంతత్వాదులు అల్పపరిమితులగు మానవులచే సులభముగ నెరుంగ నలవిగానివి యగుటను బ్రహ్మముం దెలియునట్టి విధమిందు చెప్పబడెను.

ఇంతియగాక యెన్నడు నెవ్వరిచేత నెచ్చటను దెలియబడరానిది యగుట నదికలదో? లేదో? యనుసంశయముననె మానవులు ప్రవర్తిల్లుచుందురు. అందుచే బ్రహ్మపదార్థము నిశ్చయముగ గలదనియును, దానిం దెలియుట కలవియగుననియును దానిం దెలియుటవలనమాత్రమె విజ్ఞానవైరాగ్యము లలవడి మోక్షమంద గలరనియును, మోక్ష మాబ్రహ్మపదార్థ సాహచర్యమునమాత్ర మొందదగినదియనియును గలది బ్రహ్మజ్ఞానమును మానవు లొంద నర్హులనియే మొదలు "బ్రహ్మవిదాప్నోతిపరమ్" అనియుపదేశ ప్రారంభము.

బ్రహ్మజ్ఞాని మోక్షమందునని చెప్పుటలో బ్రహ్మమును, దానిం దెలియువాడును, మోక్షమును, అనుమూడువిషయము లుం గలవు. వానినిచ్చట సంగ్రహముగ, స్పష్టముగ జెప్పి, యావిషయములనె చివరవరకును చెప్పును. అందు బ్రహ్మము— సత్యము, జ్ఞానము, అనంతమునని చెప్పబడెను. సత్యము—ఎల్ల కాలములయందునుగలిగి, పరిణామము, వ్యయము, నాశము, అపచయోపచయములు, వ్యవహారావ్యవహారములు ననునీ మొదలగుదోషములు లేనిదియై ఒకేరీతిని ప్రకాశించునట్టిది సత్యపదార్థ మనబడును. ఇట్టిపదార్థ సత్యమైనను జ్ఞానములేక విభుత్వప్రభుత్వములు చెప్పబడజాలవు. కాన జ్ఞానమనియుం జెప్పబడెను.

జ్ఞానము—కలతలేనిదియును, చెడిపోరానిదియును, సాధన విరహితమును, సృష్టిస్థితిలయములనొనర్చి, యన్నియెడల్ల సర్వము

'వకును జ్ఞానమును బ్రసాదించుచు, క్షతిలేని యసంతజ్ఞాని యగుట జ్ఞానపదార్థమని చెప్పబడెను. అనంతం—దేశపరిమిత మున, కాలపరిమితమున, అంతములేనిదియు, జ్ఞానమున, శక్తిని సర్వవిధముల నంతములేనిదియగుట ననంతపదార్థమని చెప్ప బడెను.

అనంతము జ్ఞానవంతమునగునది నిత్యమును సూక్ష్మ మును వ్యాపకమును అనిచెప్పబడవలెను. ఇట్టిది కలదనుట యెట్లనిన? జడమగు ప్రకృతియందలి రచనాదులంగాంచి యట్టి పదార్థము కలదనిచెప్పవలెను. అనాద్యనంతమగు కాలమున గలుగుచున్నట్టి యుత్పత్తిస్థితిప్రలయములు స్వయంకర్తృకము లనుట, యుక్తప్రమాణ విరోధము. అంతియగాక ప్రకృతి జడ మును, పరిణామవంతమును, జ్ఞానరహితమునగుట దానిచే సృష్ట్యాదులొనర్పబడుననుట యసమంజసము. జీవులు ప్రకృతి బంధమున చిక్కినవారగుట నల్పజ్ఞులగుటను, సృష్ట్యాదిమహత్తర కార్యములొనర్ప నసమర్థులు. అందుచే విశుద్ధానంతజ్ఞానశక్తి వంతమగు పదార్థమొండుగలదని సామాన్యదృష్టానుమానమున నిర్ణయింపకుచున్నది. ఇది సిద్ధరూపబోధకశ్రుతివలనదృష్టాంత పూర్వకముగ చెప్పబడుచున్నది. దేహమున దేహియున్నపుడు జ్ఞానయుక్తమగు ననేకచేష్టలు కలుగుచుండును. అదిలేకున్న దేహమట్లేయున్నను చేష్టావిరహితమగును. అందుచే దేహము నందుగల చేతనపదార్థమునకుమాత్రమె జ్ఞానసంకల్పాదిశక్తులు గలవనియు, దానివలననే దేహేంద్రియాదులన్నియు స్వకార్య

నిర్వహణ సమర్థములు కాగలుగుచున్నవనియు, నంద రెరుంగుదురు. కాని యాచేతనపదార్థము, పరమసూక్ష్మమగుట నెట్టియింద్రియములచేనైన నెవ్వరిచేనైన నెరుంగనలవిగాదు. కాని కలదని చెప్పకతప్పదు. అందుచే సిద్ధరూపమను జ్ఞానమును కలిగించునట్టిదియై యున్నదీయాత్మ. అట్లే జడమగుప్రకృతియందు నియమపూర్వకమును పరంపరాక్రమమును, జ్ఞానయుక్తమును, అగుచేష్టలతోఁకూడిన సృష్ట్యాదులు గలుగుచుండుటచే ప్రకృతికన్యములగు జ్ఞానశక్తులు గలపదార్థముండి తీరవలెనని నిశ్చయింపబడుచున్నది. ఇదిగాక జీవులనుభవమునఁగూడ దెలియజాలుదురని మఱియొకప్రమాణ మిందు చెప్పబడినది.

ఏ ఉపాసకుఁడు, బుద్ధితోఁకూడిన ఆత్మాసహాయందున్నవానినిగ నీశ్వరుం దెలియుచున్నాఁడో, ఆతఁడే బ్రహ్మజ్ఞానియని చెప్పబడినది. ఇందు పరమాకాశమనునది మహత్తత్వమనియు, దానికార్యమగు బుద్ధియనియుం దెలియవలయును. గుహాయామ్మనుపట్లు నాత్మ గుహాయని యభిప్రాయము. సర్వవ్యాపకుడన్నిటంగలిగియుండ నాత్మగుహాయందు మాత్రము దెలియవలయు ననుటేల? యన ఆత్మయు చేతనము, ఈశ్వరుఁడును చేతనమె. అందుచే దెలియఁజాలుట ఆత్మయందుమాత్రి మన్వయించును. ఆత్మేతరపదార్థములు జడములగుటవలన దెలియగలుగుట కవకాశ మేర్పడదు. బుద్ధ్యాదులుసైత మా యాత్మతోఁకూడి యాత్మకు సాధనములనిమాత్రమే చెప్పబడుటవలన జ్ఞా మాత్మధర్మమనిమాత్రమే చెప్పబడుచున్నది.

అయినచో సర్వవ్యాపకుఁడొకప్పుడును దూరస్థుడగుట కలుగజాలదుగదా! దానింగూర్చి మిక్కిలి ప్రయత్న మేల? యన—

ఆత్మ అల్పజ్ఞుడగుట నాతనిజ్ఞానము సాధనసాధ్యము. ఆత డందువలన బ్రకృతిసాధనములంబడసి వానితో నవినాభావసంబంధముగలవాఁడై దేహేంద్రియాదులవాంఛలవెంబడిని జాగ్రదవస్థయందెల్లను ప్రవర్తించుచుండును. కొందువ యవస్థల యందును, విదేహస్థితియందును అజ్ఞానావృతమైయుండును. బంధమున్నంతవరకిట్లేచరించుచుండును. కాన నా యీశ్వరుని దెలియజాలుట జాగ్రదవస్థయందు మాత్రమె వీలగును. జాగ్రదవస్థయన? ఆత్మమనసునగూడి యా మనసింద్రియములతోగూడి యా యింద్రియములు లోకవిషయములందు దగిలియుండుట జాగ్రత్తనబడును. ఆయవస్థయందు సుఖదుఃఖాది ద్వంద్వములంబడి యీసర్వమును దానేయనుభవించుచున్నటు లాత్మభావించుచుండును. అందుచే తానిట్టివాడని నైన దెలియజాలని దురవస్థ యందాత్మ జిక్కియుండ నాపరమేశ్వరుందెలియుట యసంభవముగదా. ఇందువలననే ఈశావాస్యోపనిషత్తునందు ఆపరమేశ్వరుడు జీవులకు చాలదూరమును తమయందే కలిగియుంట నత్యంతసమీపమునని యుక్తియుక్తముగ వర్ణింపబడినది. ("తద్దూరే, తద్వదంతికే) దేహేంద్రియాదులవశమైన యాత్మకు చాలదూరస్థుడై యున్నాడని యీశ్వరుడు చెప్పబడును. దేహేంద్రియాదులు తనవశమైన

యాత్మ కీశ్వరుడత్యంత సమీపస్థుడనబడును. అందుచే నాత్మచే మాత్రమీశ్వరుడు దెలియబడగలుగును. ఈశ్వరుడుశబ్దస్పర్శరూప రసగంధములను విషయముల వలన దెలియబడజాలడు. అట్టి విషయగ్రహణ మాత్రములగు నింద్రియముల కతీతుడని చెప్ప బడినది. అందుచే నింద్రియములను విషయములనుండి మరల్చి యింద్రియములనుండి మనసును మరల్చి యేకాగ్ర ధ్యానమున కలవరించి బుద్ధియందు సూక్ష్మ సర్వవ్యాపకానంతానందాది ధర్మముల సవిమర్శముగ నెరిగి భావనోపచయమున పవి త్రాంతః కరణుడగు నాత్మచే నెరుంగనగునని మహా తపశ్శీలు రగు మహర్షుల యభిమతము. కామక్రోధాది మలినములచే నావరింపబడిన, ఆత్మయందీశ్వరుడు దెలియబడ జాలడు. అట్లు విషయములనుండి మరల్చబడిన యింద్రియములు గలవాడును, కామక్రోధాదుల జయించిన నిర్మలమనస్కుడును, భావించుట వలన పవిత్రీభూతమగు బుద్ధితో కూడిన వాడును నగువాని యాత్మగుహాయందనుభవింపబడునని యట్లు చెప్పబడెను. ఈ ఉపనిషత్తు నాల్గవ యనువాకమున ("ఆనందంబ్రహ్మణో విద్వాన్") అని తెలియబడుట చెప్పబడెను. ఈశ్వరుని నను భవమున దెలియ జాలుదురని కపిలాది మహర్షులు కూడ సంపూర్ణ విశ్వాసము కలిగి స్పష్ట పరచి యుండిరి.

"ముక్తాత్మనః ప్రశంసావా సా సిద్ధస్యవా," సాంఖ్యదర్శనం ప్రథమాధ్యాయము 95 సూత్రము. ముక్తాత్ముని ప్రశంస యనుగాక సిద్ధుని ఉపాసనయును, ఈశ్వర ప్రత్యక్షముంగూర్చి

చెప్పుననని యభిప్రాయము. ఇది ప్రమేయముం జెప్ప వల్లఁ జెప్ప బడెను. ఈ ప్రమేయమునకు ప్రమాణములు సాధనములవి యీ శాస్త్రమున వర్ణింపబడెను. ద్రవ్యగుణ కర్మసామాన్య విశేషములు ప్రత్యక్షమున దెలియబడగా ప్రత్యక్షమున నెరిగిన దానివలన మూడు విధముల ననుమానము దెలియఁబడును. పూర్వముం దెలసి శేషము నూహించుటయు శేషముం గాంచి పూర్వము నూహించుటయు కార్యముంగాంచి కారణము నూహించుటయు ననునవి. ఇందు కార్యముంగాంచి కారణ మూహించువట్ల నాకారణ మందరకును దెలియు నట్టిదియును, అది కలదని యందరిచేతను నిర్ణయింపబడు నట్టిదియును, నగుట దానిని సామాన్యతో దృష్టానుమానమందురు. దీనియందు కారణద్రవ్యము సూక్ష్మమగుట, యప్రత్యక్షమగుట, యను మతభేదములు కలుగుచుండును. కానియస్తిత్వ, మంద ఱంగీకరింపవలసి యుండును. ప్రత్యక్షానుమానములంబట్టి కార్యకారణ సంబంధముల నిర్వచనముం జేయు నట్టిదియు, హేతూదాహరణములం జెప్పునట్టిదియు, కాలాంతర దేశాంతర విషయములం జెప్పునట్టిదియు అన్వయమున నెరిగిన దానివలన వ్యతిరేకమున నిట్లు కలుగునని చెప్పజాలునట్టిదియు, విజ్ఞాన నైతికాది సాధనమును, అగునట్టిది శబ్దప్రమాణము. ఈ ప్రమాణములవలన కలిగిన జ్ఞానమున, సూక్ష్మవస్తు నిర్ణయ మొనర్చి యనన్య మనస్కుఁడై భావించుటవలన బుద్ధితో కూడిన నాత్మయందనుభవింప బడునట్టిది (ప్రమ) యనబడును. అస్తీశ్వరు

జాత్మచే ననుభవింపబడునని యీకపిలమహర్షి యభిప్రాయము. ఇతడు మహాతపస్వియనియు, గొప్పసిద్ధుడనియు, నీతనించెప్పు చరిత్రలన్నియుం జెప్పుచుండును. కాన నీతడట్లు నిశ్శంకముగ జెప్పనవచ్చును. కాక యీాత్మేశ్వరులు నిత్యులును, చేత నులునగుట దెలియజాలుట సాధ్యమనియే చెప్ప వలెను. "ఆనంద మయోాభ్యాసా" త్తని బ్రహ్మసూత్రముల యందును, ఉపనిషత్తుల యందనేక చోట్లను, వేదముల యందనేక ప్రక రణముల యందును, చెప్పబడి యుండుటవలన, కూడ నుపా సకుడు నిర్దిష్ట విధానమున నీశ్వరు ననుభవమున దెలియ జాలునని యెంచవచ్చును. ఇదిగాక జీవాత్మ యల్పజ్ఞుడగుట నొక యన్యపదార్థ సాహాయ్యమున బ్రవర్తింప వలసినవాడు. కావున ప్రకృతి సాహాయ్యమున బంధమును, దానిని రోసి యీశ్వర సాహాయ్యమున మోాక్షమును బొందజాలుననుట యుక్తియుక్తముగదా! దానంజేసి బంధబాధ నెరిగి లోక విష యములగు దేహాది సర్వము నందును విరక్తులగు వారా యీశ్వరుంజేరియే తీరవలెను. అందువలన నాత్మగుహాయం దీశ్వరు నెరుంగజాలుట చెప్పబడెను. దానివలనకలిగెడి ఫలము మోాక్షమని చెపఁబడుచున్నది. అందుచే వేదాది సచ్ఛాస్త్ర ముల వలన దెలియబడ జాలుటయేకాక యీశ్వరుడు నిర్మలో పాసకునకు ప్రత్యక్షముగ నెరుంగ నలవి యగునని స్పష్టము.

అనంతవిజ్ఞానఘనుడగు బ్రహ్మమునాశ్రయించిన యుపాసకుడా బ్రహ్మముతోకూడి సర్వకోర్కెలనొందునని చెప్పబడెను. దీనినే

మోక్షమందురు. బ్రహ్మముతో కూడి సర్వకోర్కెల నొందుట ఏమి? బ్రహ్మమునకుగల కోర్కెలెట్టివి? యను సందియము సామాన్యముగ నందరకుండోచును. ఈశ్వరునకు దేహములేదు. అందుచేఅన్యపదార్థ సంయోగమున పొందనగు లాభములేదు. ఇంద్రియార్థములు సంబంధములేదు. రోగ మృత్యుజరాదులసంపర్కములేదు. కామాదిదోషముల పరితాపములేదు. త్రివిధ దుఃఖములేదు. అవివేకమున నొందదగు ప్రమాదము లేదు. స్థలకాలాదిభేదమున నొందదగు సంకటములేదు. ఆతనివిజ్ఞానమునకు కళంకములేదు. సర్వవ్యాపకత్వమున వేరై యున్న పదార్థమొకటిలేదు. పరమసూక్ష్మమగుట కలసియున్న పదార్థమొకటిలేదు. అలేపక, సర్వగత, వరేణ్య, నిత్యశుద్ధ, బుద్ధ, అనంతానందాదులం జెప్పబడునట్టి పరబ్రహ్మమునందు కోర్కెలుగలవనుట, నిరాధారవిషయము. దుఃఖసంబంధములేకునికి, నానందస్వరూపుడని చెప్పబడును. ఉపాసకుడును, బ్రకృతిబంధమును విడిచినవాడగుట దుఃఖసంబంధమును బాసి యాబ్రహ్మముం జేరినవాడగుట నట్టియానంద మనుభవింపగలడని యభిప్రాయము. సర్వకోర్కెలం బాసిన యుపాసకుడు మాత్రమె బ్రహ్మము నెరుంగగలడనిన బ్రహ్మముతో కూడి మరల కోర్కెలుగలిగి వానింబొందుట యనునర్థమే లేకుండును. కోర్కెలన్నియుం దీరినను మరలకోర్కెలు గల్గుచునేయుండును గదా! వానిననుభవింప సాధనములుగలంతవరకు వానింబాయుటెట్లు? అట్టి సాధనసంపర్కముం బాసిననే యీశ్వరుంజేరు

చున్నవాడగుట ముముక్షువునందును కోర్కెలుగాన రాఘు. పొందుటఎట్లు? అనగా కోర్కెలన్నియుందీరినను కోర్కెలే, లేకున్నను సమానమే యగును. అదిగాక మానవోచితములగు సర్వకోర్కెల నొకేసారి బొందినదానికంటె మిన్నయగునది యీయానందమని చెప్పుటకట్లు చెప్పబడెను. ఇట్టియానందము స్థలకాలాదులవలన కలుగునట్టిదికాదు. కాన మతమతాంతరుల స్వర్గకైలాస శ్వేతదీపాదులవంటి మోక్షస్థానము లహైతుక ములు. స్థలవిశేషమున మూర్త పరిచ్ఛిన్న జరాయుజాది సమన్వితమగుపదార్థముమాత్రమె సుఖదుఃఖాదులంచెలియజాలును. అది మోక్షము గాజాలదు.

మోక్షమెట్టిదియో? ఎట్లుచెప్పనగునన- బంధమిట్టిది యని యనుభవమున దెలియనగుచున్నది. కాన దానినివీడిన నిట్లుండగలదని చెప్పకయ చెప్పుచున్నది. బంధముకానిది మోక్షమగును. కాన బంధవ్యతిరేకమును శబ్దప్రమాణమున చెప్పబడును. ఎట్లన? (బంధము) ఆత్మయొక్క అల్పజ్ఞానమున ప్రకృతియందు రమించుటవలన మహదాది ప్రకృతికార్యముల వలన సూక్ష్మశరీరమును, ఆకాశాదిస్థూల భూతములవలన, స్థూల శరీరమునుబొంది దేహాభిమానముకలిగి, లోకవిషయములం గోరుచు ననుభవించుచు వానివలని సుఖదుఃఖముల నొందుచుం డుట బంధ మనబడును. ఆదేహవియోగమున నజ్ఞానావృతమై ప్రారబ్ధమునననుసరించిన యీశ్వరశాసనమున, పునర్దేహము నొందుచు మరల దానినభిమానించి కర్మములనొనర్చుచు,వాని

వలని సంకటములనొందుచు, మోక్షపర్యంతమును మరణయుక్త
సంసారమునబడి దేహి పరితపించుచుండును. ఇదిస్వభావ మన
రాదా? యన స్వభావమునకు అపాయమురాదు. మార్పునొం
దదు. అట్లేనిలచియుండును. అట్లుకాలేదు. దేహమొండె
న్నినొక్క మార్పులుకలుగగా నాయాజాతులయందు గలవ్యక్తు
లన్నిటియందును విచిత్రభోగములు కలుగగా ననేకజాతుల
యందలి జన్మలుకలుగగా, సుఖదుఃఖాజ్ఞాన విజ్ఞానాదిభేదములు
దెలియబడుచు రాగా, స్వభావమనబడజాలదు. ఈశ్వరశాసన
మున బంధమువచ్చునన అట్లైనన్నదును కాజాలదు. ఒకరియుద్దే
శమున నింకొకరికి బంధమోక్షములుగలుగుట అన్యాయము.
స్వకర్తృకమైనవి, బంధమోక్షములు. అన్యకర్తృకములు కా
జాలవు. అవి నిత్యచేతనపదార్థముచే నెరిగి యనుభవింపబడ వల
సినవై యున్నవి. కర్తకు సుఖదుఃఖానుభవము గలదనుట నంద
రెరింగినదియె. దానివలన నీశ్వరోద్దేశమున గలవనిన నవి
యీశ్వరునికే చెందగలవు. అదిగాక పరేచ్ఛవలన నొందబడి
నది మరల నట్లొందబడవలసి వచ్చును. నియమమే యేర్పడ
జాలదు. కాలవశమున కలుగవచ్చునన అదియు నసంభవము.
కాలమువస్తువు. సూర్యచంద్రాదుల గతివలనను, కడకుపర
మాణు సంచలనమువలనను తెలియబడునట్టిది. కాన ప్రత్యేక
వ్యక్తిత్వముకలది కాజాలదు. కలదానియైనను అంతట గల
దియు అందరకు సమానముగా దెలియబడగలదియునగు కాల
మొకరికి బంధమును వేరొకరికి మోక్షమును జననమరణ సుఖ

దుఃఖాదిభేదముల నాయావ్యక్తులయందు కలిగింపజాలదు. అది గాక యొకదానివలన వేరొకటికి బంధము కలుగజాలదుగదా. దేశముననునిట్లే కలుగజాలదు. ప్రకృతి జడమగుట, చేతనమును తాను బంధింపజాలదు.

కర్మమువలన బంధమన కర్మము దేహమునొందినపిదప కలుగునట్టిది. అదినిత్యచేతనుని బంధింపజాలదు. అన్యధర్మమగుట

ఆత్మ అనిత్యమనిన బంధమోక్షముల ప్రసక్తియే కలుగజాలదు. ఆత్మనిత్యమని జ్ఞానమువలన నెఱుంగనగుచున్నది.

భ్రాంతివలన బంధముదోచుచున్న దీశ్వరునకు మించి వేరేమియులేదనిన భ్రాంతియు బంధమును, ఈశ్వరునియందే చెప్పబడునట్టి దోషమేర్పడును; కాన నసమంజసము.

అందుచేనవివేకమునతానై బంధమునొందుచున్నాడు. కాన దేహివివేకమున మోక్షమందగలడు. అల్పజ్ఞానము నైజమగువానికి వివేకమెట్లు కలుగగలదు?

ఆత్మచేతన వస్తువగుట జ్ఞానమేకలదు. సరిగ తెలియకున్న నవివేకమందురు. సత్యవిషయమెరిగిన జ్ఞానమందురు. ఆత్మదేహాదిసాధనముల నరికట్టబడి వాని నభిమానించుటవలన బ్రకృతివిషయజ్ఞాన మొందుదక్క నాత్మేశ్వరపరిధానముల నిజస్థితి నెరుంగజాలక, యవివేకియనంబడును. గురూపదిష్ట సచ్ఛాస్త్రవిధానమున నెరిగి యభ్యసించునేని సత్యమెరుంగ

గలదు. అదియె వివేకము. వెలుతురువలన చీకటిపోగొట్టబడు నట్లు వివేకమున నవివేకము పోగొట్టబడును. స్పష్టముగ నెరిగినవిషయమున మరల సంశయమునకు తావుండదు. కాన జ్ఞానమున నజ్ఞానము నశింపబడునని చెప్పబడినది. అట్లనుభవ జ్ఞానముగలవారు బంధదుఃఖమును బాసి మోక్షానందమును పొందగలరు.

మోక్ష మానందమని యెట్లు చెప్పనగును?

బంధమును, దానివలని దుఃఖమును, తెలియబడు చున్నందున బంధముపోగా దానివలని దుఃఖమును పోగొట్ట బడి యీశ్వర సాహచర్యమున నానందమును పొందును.

దుఃఖము పోగొట్టబడిన నానందమే పొందవలెనుగదా, ఈశ్వర సాహచర్యమేల?

ఆనందమెరుగక దుఃఖమెట్లు పోగొట్టబడును? దుఃఖము నిద్రయందు తెలియబడదు. ఆనందమును తెలియబడజాలదు. అందువలననె ఆయవస్థయందాత్మ యజ్ఞానావృతమని చెప్ప బడును. దేహాదిసర్వలోకవిషయములందును అభిమానమును విడిచి యీశ్వరోపాసనముచే కృతకృత్యుడైనవాడుమాత్రమే ఆనందమిట్టిదని తెలియగాంచును. పరిమితమున దేహి; యాధేయవస్తువగుట, నీశ్వరు నాధారమున మాత్రమానంద మొందజాలును. జీవుడు సచ్చిన్మాత్రుడు. ఈశ్వరు డానంద మయుడు. ప్రకృతిదుఃఖస్వరూపము. అందుచే దేహి ప్రకృతి నాశ్రయించి దుఃఖమును, ఈశ్వరు నాశ్రయించి యానంద

ము బొందగలుగును. కాన నీశ్వరు నాశ్రయించిననే దుఃఖముతోఁ గూడిన ప్రకృతిసంబంధమునుబాసి శాశ్వతానందరూపమగు మోక్షము నొందును.

అల్పకాలజ్ఞానేశ్వరోపాసనలవలన నత్యంత సుఖదమగు ననంతమగు ముక్తిం బొందు టెట్లు? అల్పకర్మకనంతఫలమెట్లు వచ్చును?

కర్మఫలము కాలపరిమితమున చెప్పబడును. మోక్షము అకర్మఫలము. అనగా నాత్మ, కర్మరహితుడు. దేహాదులు కర్మస్వరూపములు. వానినభిమానించుటచేతనే ఆత్మ, కర్మబద్ధుడగుచున్నాడు. వానియందభిమానమువిడిచిననాత్మయందు కర్మమే దోపదు. కాన కర్మమువలన బంధమును, అకర్మము వలన మోక్షమును కలుగగలదు. అకర్మస్థితి, దేశకాలముల పరిమితము కాబడజాలదు. అందుచే నల్పాధికశబ్దములందన్వయింపబడజాలవు. చాలకాల మొకవస్తువును దెలియకున్నను, ఒకముహూర్తమాత్రమున దానియాదార్థ్య మెఱిఁగినేని యా యెరుక యావజ్జీవ మస్ఖలితమై యుండును. అల్పకాలజ్ఞాన మత్యంత ఫలదమగుచున్నది. అనాదికాలమువలన నీశ్వరు నెరుగనేరి నను తెలియజాలకపోవచ్చును. సరియగువిధానమున దెలియ గాంచిన మరల మరువవలసిన యావశ్యకతయే కలుగజాలదు. అది యట్లుండ, అనాద్యనంతమగు కాలమున నొకానొకడు ముక్తిని బడయజాలకయె పోవచ్చును. అప్పట్ల బంధము నిత్యమగుచున్నదిగదా? మోక్షమేల నిత్యము గారాదు.

జన్మమువలన కర్మమును దానివలన జన్మమును అనుపరంపరాక్రమమున బంధమట్లు దోచవచ్చును. కాని మోక్షమున నట్లు సంభవింపదుగదా? ఎట్లునిత్యమగును?

జన్మకర్మల సంబంధము లేకపోవుటవలన కారణమే నశించుచున్నది. అదిగాక యొక మారీశ్వరుని యనుభవము నొందజాలిన యతడు మోక్షము నొందజాలునన నిరంతరేశ్వర సాహచర్యము గలవానికి మరల బంధమెట్లు దోచును.

మోక్షమట్లు నిత్యమగునేని కాలక్రమమున జీవులసంఖ్య తగ్గుచురాగా కొంతకాలమునకు సంసారమాగవలసివచ్చునేమో?

మోక్షమంత సులభసాధ్యము కాదుగదా? సృష్ట్యాదినుండి మోక్షమందగలిగిన యోగ్యులచరిత్రలనుబట్టి నిర్దుష్టవిధానమున నీశ్వరునెరిగినవారు వందలలో లెక్కింపబడుదురో? లేక పదులలో లెక్కింపబడుదురో? అసంఖ్యాకులగు జీవులసంఖ్య దీనినలన తగ్గుననరాదు. లోకమున మోక్షమునకై ప్రయత్నించువారే యరుదు. వారియందు మతదేశభాష దేహాద్యభిమానముల దర్పముజూపువారు మోక్షమునందజాలరుకదా. విధానమునువదలి తెలిసితినని భ్రమజెందువారు పొందజాలరు కదా. సరియగువిధానమున సాధనసంపత్తిగలిగి కృషిచేయునట్టి వారియందుగూడ మందమధ్యమాధికారు లుండనేరరుగదా. తదితరజీవులమాట దడవనేల. ఇకనెచ్చటనో యెక్కాలముననో, అనేకజన్మముల సంస్కారబలమున నెవ్వడో యుత్తమాధికారి గలిగినగదా మోక్షము. కాన మోక్షమందుటవలన తరి

గడి జీవసంఖ్య లెక్కింపవలెసినంత యల్పాల్పతరమని చెప్ప వచ్చును. అందుచే మోక్షము నిత్యముగాదనుట కదియొక హేతువు కాజాలదు.

ముక్తియందు శరీరము కలిగియుండునా? లేక ఇంద్రియముల శక్తులైనను కలిగియుండునా? లేకున్న సుఖమెఱుంగుట కాత్మ కలవికాదుగదా.

శరీరసంబంధమును బాయుటయె ముక్తియనెదరు. దానిసంబంధము గలంతవరకు క్షుత్తృట్సుఖదుఃఖనిద్రాదిసర్వము వాంఛనీయమై యుండును. స్థలాశ్రయమై కాలబద్ధమై స్థలకాలముల పరిమితమై వానివలన కలిగెడి సంకటములకు గురియగుచుండును. ఇంద్రియశక్తులు కలిగియున్న శబ్దస్పర్శాది విషయజ్ఞానమును వానివలని సుఖదుఃఖములును మాత్రము పొందగలుగును. అందువలన నీశ్వరజ్ఞానమలవడదు. సరికదా ఆత్మజ్ఞానముకూడ నలవడదు. వానియందలి సుఖేచ్ఛవలన నిరంతరబాధాజ్ఞాన మొక్కటి యలవడగలదు. అదియకదా బంధమనబడుచున్నది. దానివలనకదా ఆత్మజ్ఞానము సంకోచింపబడి యీశ్వరు నెఱుంగ నలవికాకున్నది. అందుచే జ్ఞానమును పరిమితమొనర్పజాలు దేహేంద్రియాది సంబంధము మోక్షమున కలుగుననరాదు.

ఆపరిమితమగు జ్ఞానమీశ్వరునియందుదక్క జీవునియం దెట్లు కలుగగలదు?

మనసుతో కూడియున్న జీవాత్మకే ఖగోళభూగోళముల నొకేసారి ధ్యానింపగల శక్తి కలిగియుండును. ఇంద్రియములచే పరిమితమొనర్పబడిన శక్తులతో మరల సంకుచితమొనర్పబడు చుండును. అట్టియింద్రియమనస్సు నరికట్టుటవలననే అఖండా నంద మనుభవింపగాంచును. అందుచే నింద్రియాదులాత్మజ్ఞాన మును పరిమితమొనర్చుటకే పనికివచ్చును. వానిసంబంధము లేకున్న ననంతత్వాదుల ధారణమొనర్చును. కాన ననంతత్వా దుల నొప్పారు నీశ్వరునినెరిగి, అడ్డులేని యంతరాయములేని యానంద మనుభవింపజాలును. దానివలన నీశ్వరుని పెద్దరిక మెటకునుం బారిపోదు. సృష్ట్యాదుల నొనర్పగల సామర్థ్యము జీవుని కలవడజాలదు. కాని నిత్యముక్తుడగు నీశ్వరునెరుగుటకు అపరిమితమగు జ్ఞానమే కలిగియుండుననవచ్చును.

అయిన జీవేశ్వరులకుభేదమేలేదనవచ్చును. జీవేశ్వరులకుభేద ములేకున్న శబ్దభేదమును, వ్యవస్థాభేదమును, అనుభవభేదమును, అవస్థాభేదమును కలుగజాలవు. బంధమోక్షముల నొందువాడు జీవుడు. శాసించువాడీశ్వరుడు. బంధమునదుఃఖమును, మోక్షమున నీశ్వరసాహచర్యముననానందము నొందువాడు జీవుడు. నిరంతర నిరంతరాయానందమయుడీశ్వరుడు. పరిమితమగు దేహాదుల నభి నించి సుఖదుఃఖాదిద్వంద్వముల నొందువాడు జీవుడు. దేనినైన నభిమానింపక యంతట గలవాడై దేనిచేనైన ననంటబడక సన్ని టిని ధరించువాడై దేనివలననైన మేల్కీడుల గాశింపక సృష్టి ప్రళయములం జేయువాడై జీవుల బంధమోక్షములకైన

ప్రకృతిరచనం జేయుచున్నవాఁడై జ్ఞానపరిదాతయై నిత్యానంతాదిలక్షణయుక్తుడగువాడు ఈశ్వరుఁడు. రాగద్వేషాది దోషయుక్తుఁడు జీవుఁడు. సర్వదోషరహితుఁ డీశ్వరుఁడు. అందుచే జీవేశ్వరు లొకటి యనరాదు. పైకారణములచే పరమేశ్వరునియందుబంధము ఎన్నఁటను ఘటింపఁజాలదు. అల్పజ్ఞులగుజీవులయందే బంధమోక్షములుఘటిల్లును కాన జీవేశ్వరు లొకటి గారాదు.

ఉపాధిభేధమున నీశ్వరుని యుండట్లు దోఁచునే గాని జీవేశ్వరు లొకే పదార్థ మనవచ్చును.

ఉపాధిభేదమున నీశ్వరునకు బంధ మోక్షములు గలవన్న నంతకంటె విచారింపఁదగిన యంశ మొండు గలుగదు. ఉపాధియె యీశ్వరుని శాసించుచు నీశ్వరుని నిరంతరబంధ యుక్తుని జేయుచున్నదనవలెను. లేక యుపాధికే బంధ మోక్షములు గలనన్న నచేతన పదార్థము నందవిఘటింప బడఁజాలవు; కాన జీవేశ్వరులు వేరనక తప్పదు.

భ్రాంతివలన బంధమోక్షములు దోఁచునేగాని సర్వమును మిథ్యయై యున్నది.

బంధము ప్రత్యక్షమున దోఁచుచున్నది. దానిని మిథ్య యనరాదు. మిథ్యకు ప్రమాణ ముండదు. దానిం దెలియు వారుండరు. దానిం జెప్ప నవకాశ మేర్పడదు. అట్టి దాని యందీ నీశుఁడు భ్రాంతి నొందెనని చెప్పునన్యుఁ డెవఁడు? పదార్థ మేసిలేని భ్రాంతి యెంతటి యవివేకి నైనను బొందునా? భ్రాంతి యీశునకు కలిగినదని మీ కెట్లు దెలసినది? తనంత

కాను నిర్హేతుక భ్రాంతినొంది సంసారమునబడి యీశుడు బంధయుక్తుడగుచున్నాడనెడి వా రిదిమాత్రము భ్రాంతియును, మిథ్యాజ్ఞానమనందగును. అంతియగాని యిది మిథ్యయును గాదు. ఈశ్వరునికి భ్రాంతియును లేదు.

పోనిండు. ఈశ్వరునిచే కల్పితమైన యుపాధి కలిగిన మీద దాని సంబంధమున నజ్ఞానోపాధికుడు జీవుడును, మాయోపాధికుడీశుడును, ఉపాధివిలయమైనచో నఖండ బ్రహ్మపదార్థమును నగుచున్నదన వచ్చును.

అది యంతకంటెను నసమంజసము. ప్రతిజ్ఞాంతర స్వీకారమొక ప్రమాణము కాజాలదు. పదార్థము కలిగిన దానియందు మాత్రమె కల్పింప వీలగును. పదార్థములేని కల్పన మహైతుకము. సహేతుకమును విడిచి యహైతుకము నాశ్రయించిన నేమిఫలము? ఇక నట్టి కల్పితోపాధి యీశ్వరు నాశ్రయించి యఖండుని ఖండునిగా నొనర్చినదనుట యప్రమాణమును, అయుక్తికమును, జ్ఞానరహితమును, అగుకల్పన మాత్రమేయైయున్నది. తన్నుకట్ట త్రాళ్లు దాదెచ్చెనన్నటు నీయవివేక కల్పనమీశ్వరుడొనర్చినాడనెడి కల్పన మవివేకము కాకపోదు. ఇట్టి, స్వకల్పనమున నవివేకియైన యీశ్వరు నెవ్వరుద్ధరింతురు?

స్వస్వరూపజ్ఞానమున ముక్తుడగుచున్నాడు. స్వస్వరూప జ్ఞానము మొదల పోవుట యెట్లు? మరల కలుగుట యెట్లు? కలిగినమీదకూడ మరల నిట్టిపొరపాటొనర్చుడనుటెట్లు? అవివే.

కర్తయై బంధమునబడిన వాడీశ్వరుడగు టెట్లు. కాన నీశ్వరునియందిట్టి దోషములు కలవని భావించుట యనియెడి యవివేకమును విడిచి తరించుటకైన యుపాయ మాలోచించుట వివేకము.

ఉపాధియును, ఈశ్వరుడును కలుగగా నీశ్వర ప్రతిబింబ మీసంసారము నొందుచుండును. జ్ఞానము కలిగిన మీదనుపాధి విలయమై యీశ్వరుడగుచున్నాడనిన నేమి దోషము?

ఉపాధియు, బింబమును కలిగియున్నంతకాలము ప్రతిబింబము నశింపదు. స్థూలపదార్థమున సూక్ష్మవస్తువునకు ప్రతిబింబమే కలుగదు. కలిగినను ప్రతిబింబమవస్తువు. దానికి మొదలనజ్ఞానము మాత్ర మెట్లుకలుగగలదు? పిమ్మట జ్ఞాన మెట్లుకలుగును? ఆవస్తువునందు నిత్యవిషయములగు బంధమోక్షము లెట్లుచెప్పబడును? అవస్తువునకును, అనిత్యవస్తువునకును, బంధమోక్షములు కలవనుటెట్లు? కాననిది యంతయు నొక మిథ్యాకల్పనము.

అట్లగునేని యీశుడీజీవులను సృజించి దనయిచ్ఛచొప్పున బంధమోక్షముల నొసంగుననవచ్చునా? జీవులు నిత్యులు చేతనులు కాన సృజింపబడుట యుండజాలదు. కారణములేని రచనయు, బంధమును, కలుగునన్న, నయుక్తికము. చేతనముల సృజింపవలెనన్న కారణద్రవ్యము చేతనమై యుండవలెనుగదా. రూపాంతరము నొందునట్టిది చేతనమనియే చెప్పబడదు. దానిని సృజించుట ఎట్లు? సృజింపబడినది నశింపబడవలెనుగదా. దానంజేసి జీవుల నిత్యులనబడవలెను. వారి

బంధమోక్షము లెట్లువచ్చును? కాక యొకరివలన సృజింపబడిన దానికి బంధముక్తులుగరాదు. సృజించినవారే దాని ఫలాఫలముల ననుభవింపవలసియుండును. పరేచ్ఛవలన పొందబడునట్టివి బంధమోక్షము లనబడజాలవు. కాన నదియంతకంటెను అనమంజసము. జీవుడు నిత్యుడును, స్వాతంత్ర్యము కలవాడును, అనియనే బంధమోక్షము లాతనియం దన్వయించును. కావుననే యీశ్వరునితో కూడి, సర్వకోర్కెల ననుభవించునని, జీవుని ప్రత్యేకిత్వమును, స్వాతంత్ర్యమును అసందిగ్ధార్థవాక్యములచే నీ ఋషి చెప్పియుండెను.

తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూ
తః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః।
అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓష
ధయః। ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః।
స వా ఏష పురుషోఽన్నరసమయః। తస్యేద
మేవ శిరః। అయం దక్షిణః పక్షః। అయము
త్తరః పక్షః॥ అయమాత్మా। ఇదం పుచ్ఛం ప్ర
తిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి॥

తస్మాత్ = అకారణప్రకృతివలన, వా = కాకయును; ఏతస్మాత్ ఆత్మనః = ఈపరమేశ్వరునివలన, ఆకాశః = ఆకాశము

సంభూతః - పుట్టెను. ఆకాశాత్ - ఆకసము వలన. వాయుః = వాయువు(పుట్టెను) వాయోః - గాలివలన. అగ్నిః - అగ్ని (పుట్టెను) అగ్నేః - అగ్నివలన, ఆపః-నీరు(పుట్టెను) అద్భ్యః-నీటివల్లన, పృథివీ - భూమి (పుట్టెను) పృథివ్యాః - భూమివలన ఓషధయః - ఓషధులు (పుట్టెను) ఓషధీభ్యః - ఓషధుల వలన అన్నం - అన్నము (పుట్టెను) అన్నాత్ = అన్నము వలన పురుషః = పురుషుడు (పుట్టెను) సఃఏషః = ఆపుట్టిన యితడు. అన్నరసమయః = అన్నరసమయుడు. తస్య=వానికి ఇదంఏవ= ఇదియే, శిరః = శిరస్సు. అయం దక్షిణఃపక్షః = ఇదికుడి చేయి, అయముత్తరః పక్షః = ఇదియ ఎడమచేయి, అయం ఆత్మా = ఇదియ ఆత్మ. ఇదం = ఇది, పుచ్ఛం=పుచ్ఛముగ, ప్రతిష్ఠా = ప్రతిష్ఠింపబడినది. తత్ అపి=ఆవిషయముకుగూర్చి ఏషః=ఇది, శ్లోకః = మంత్రము. భవతి=అగుచున్నది.

తస్మాద్వా అను వాక్యమున ఆకసము పుట్టెనని చెప్ప బడియున్నది. ఏపదార్థమైనను పుట్టుటకు ఉపాదాన కారణ మును నిమిత్తకారణమును ఉండితీరవలెను.ఉపాదానకారణము చెప్పుటవల్ల తస్మాత్తని చెప్పబడినది. దేనివలననో చెప్పక మె దాని వలన ననుప్రయోగము సామాన్యముగ నుండజాలదనుకొన వచ్చును. కాని సుప్రసిద్ధ విషయములంగూర్చి యట్లు చెప్ప వచ్చును. దాని మూలకారణ మందరును సామాన్యముగ నొప్పికొనునట్టిది యగుటవలన తస్మాత్తని చెప్పబడినది. అందుచే

నాకసము పుట్టుటకు ముఖ్యకారణమగు ప్రకృతియని చెప్ప బడవలెను. లేకున్న తస్మాత్ వా అనెడి శబ్దములు వ్యర్థము లగును. ఆకసము సంభవించుటకు తగిన కారణము చెప్పబడ కయె పోయియుండును.అందుచే తస్మాత్తనుచోట సర్వభూతముల యుత్పత్తికిని ప్రధానకారణమగు ప్రకృతియని చెప్పవలెను. ఆప్రకృతి తనంత రూపాంతరముల నొందజాలునట్టిది కాదు. కాన ఏతస్మాదాత్మనః అని చెప్పియుండెను. ఈ పరమేశ్వరుని వలన నని చెప్పెను. ఈతడవి పేర్కొనుటలో పై జెప్పిన మోక్షపుదాతయగు నీశ్వరుడని యభిప్రాయము. ప్రకృతి ఘోరమూఢాది ధర్మములుగలది యగుట తనంత రచనాదుల నొనర్పజాలదు. కాన జ్ఞాన అనంత సర్వవ్యాపక సర్వశక్తియు తాద్యనేక గుణయుక్తమగు పదార్థమొండు గలిగిననే దీని రచనాదులు కలుగగలవనునది సుప్రసిద్ధ విషయమగుట మిక్కి లిగ చెప్పనక్కరలేదు. ఈవిషయమిదివరకే చెప్పబడి యున్నది కూడ. అందుచే ప్రకృతి పదార్థమును ఈశ్వరుని జ్ఞానబలక్రియ లును కలసిన రచనాదులు కలుగుచున్నవి. దానివలన నాకా శము కలిగెనని స్థూలభూతోత్పత్తిని చెప్పదొడగెను. వీనికి పూర్వము త్పన్నమైయున్న సూక్ష్మభూతములను వివరించి నటులేననియనుకొనవలెను. ఆసూక్ష్మభూతములెవ్వియన సత్వ రజస్తమోగుణముల సమానత్వము కలిగి స్వస్థితియందుప్రకృతి యనంబడును. దానివలన మహత్తత్వమునుదానివలన నహంకా

రమును దానివలన మనసును త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణము
లను జ్ఞానేంద్రియము లైదును వాక్పాణి పాదపాయూపస్థలను
కర్మేంద్రియము లైదును శబ్దస్పర్శ రూపరస గంధములను
తన్మాత్ర లైదును కలుగగా వీనిని సూక్ష్మభూతములని చెప్పె
దరు. ఈ భూతములుకలవని సూక్ష్మశరీరము వలన తెలియ
నగును. ఎటులన శబ్దస్పర్శరూప రసగంధములను జ్ఞానేంద్రియ
ములచే తెలియుటయు కర్మేంద్రియముల వలన తెలియజేయు
టయు కలుగుచున్నందున తన్మాత్రలు పరిగణింపబడుచున్నవి.
ఇవియైదును పది యింద్రియములును వీనివలన విషయగ్రహణ
మొనర్చుచు వానిని కర్మయందు నియమించునట్టిది మనసు
గలదు. దానివలన గ్రహింపబడిన విషయములను విమర్శించు
నట్టిది బుద్ధియందురు. అభిమానమే యహంకార మందురు.
ఈ పదునెన్మిదియును సూక్ష్మ శరీరమందురు. ఈ భూతము
లును, ఈ శరీరమును, కూడ నింద్రియములచే తెలియబడ
రానివి యగుటవలన దీనిని సూక్ష్మ శరీరమందురు. దానిలక్ష
ణములంబట్టి తెలియదగినది యగుట లింగ శరీరమని కూడ
చెప్పుదురు. ఇది మోక్షపర్యంతముండునట్టిదియై యనేక స్థూల
శరీరముల ధరించుచు విడుచునట్టిది యగుట నాతివాహికమని
కూడ నందురు. ఇవియన్నియు వ్యవహారాగా వ్యవహారములు
కలవియగుటను, ప్రకృతి సంబంధ విషయములగుటను, ప్రకృతి
విషయముల గ్రహింప నాత్మకు సాధనములగుటవలనను వీనిని

కూడ ప్రికృతికార్యములనక తప్పదు. ఈపదునెన్మిదిటిని ప్రకాశా
ప్రికాశముల నొనర్చునట్టిది చిత్తమందురు. ఇదియె కారణ
శరీరమనంబడును. ఇదిసత్వ రజ స్తమోగుణయుక్తమైన ప్రికృతి
వలన కలిగి అగుణములతో కూడిన సూక్ష్మశరీరమును కలిగి,
యట్టిగుణములు గల స్థూలశరీరముల నెన్నిటినేని ధరించుచు
విడుచుచుండును. అట్టి యీ ప్రికృతిని, రమించుటయె యాత్మ
నకు బంధమందురు. వీని నిట్లు తెలియగలుగుట వలన నిట్టి
సూక్ష్మభూతములు గలవని చెప్పుచున్నారు. మరికొన్ని సూక్ష్మ
భూతములు కూడ కలవనెదమన్నను, వానిని ధృవపరచు
కార్యము తెలుంగ బడక పోవుటవలనను, ఎన్ని యంతరముల
గల్పించినను కారణ ద్రివ్యమొకటి యొప్పికొన వలయుటను,
వీని నిట్లే నిర్వాదించి యున్నారు. ఇక నీసూక్ష్మకారణ దేహ
ములు మోక్ష పర్యంత ముండునట్టివి యగుట నీసూక్ష్మభూత
ములకు ప్రళయము వర్ణింపబడి యుండలేదు. సంయోగము
గల దానికి వియోగము చెప్పదగియున్నను, అత్యంత కాల
పరిమితి గలుగుటనో, సూక్ష్మములగుట ననావశ్యకములగు
టనో ప్రలయము వర్ణింపబడి యుండలేదు. ఇక నీస్థూల శరీర
ములు తరుచు పుట్టుచు గిట్టుచుండు స్థూలభూతములకు ప్రల
యము వర్ణింపబడుచున్నది. అందాకాశానిలములు సూక్ష్మత్వ
వ్యాపకత్వములు గలవగుట వానికిమాత్రిము ప్రలయముండ
జాలదనియును, మూడుభూతములకే ప్రలయము గలదని

యును కొందరు ఋషులు నిర్ణయించి వర్ణించి యుండిరి. ఎట్లన శబ్దగుణ విశిష్టమైన యాకసము దానివలన కలిగె నని చెప్పెను.

ఆకసము ఈ స్థూలభూతములయందు సూక్ష్మమై వ్యాపకత్వముఁ కలిగి శబ్దగుణమున చెప్పబడుచుండెను. దానివలన శబ్దస్పర్శములు గుణములుగా గలిగి, సర్వత్ర నిరంతరగతి గల వాయువు కలిగెను. దానివలన శబ్దస్పర్శరూపములు గుణములుగాగల అగ్ని సంభవించెను. దానివలన శబ్దస్పర్శ రూపరసములుగల జలము ప్రభవించెను. దానివలన శబ్దస్పర్శ రూపరసగంధములుగల పృథ్వి కలిగెనని చెప్పబడెను. ఈయైదు గుణములుంగల పృథ్వి కలిగియున్నది. కాన కొదువ నాల్గు భూతములను దీనియంతర్భాగము లనవచ్చునేమో? ఐదుగా నేల వర్ణింపబడవలెనన?

వానివాని ప్రత్యేకస్థితియు, ప్రత్యేకవ్యాపారమును, ప్రత్యేకగుణప్రధానమునుబట్టి యట్లు చెప్పబడును. వాయ్వగ్ని జలభూములయందా కాశము నిండియుండుటవలన నెచ్చట శబ్దము కలిగినను ఆకాశగుణమనియే చెప్పబడును. పృథ్వీజలాగ్నులయందుకూడ స్పర్శగుణము కలిగియున్నను అందు మనప్రయత్నముకూడ కలిగియున్ననే స్పర్శము కలుగగలదు. వాయువునందట్లుగాక యన్ని వస్తువులకును అన్నిప్రక్కల వంత టను అన్ని వేళలను ఆయావస్తువుల ప్రయత్న మక్కరలేకయే

స్పర్శము కలిగియుండును. అగ్ని తనంతప్రకాశించుచు నితర మునుకూడ బ్రకాశపరచునట్టిదియగుట రూపమందు చెప్పబడు చున్నది. జలభాగము కలిగియున్నే రసమేర్పడును. పృథ్వీ భాగమున గంధమును అట్లే. కావ నీ భూతములకు ప్రత్యేక స్థితిచెప్పబడినది. ఇట్లు కలిగిన నీభూతములయందు ఓష ధులు కలిగెనని చెప్పబడినది. ఇది జీవసృష్టి. ఈజీవులు పృథ్వీజలముల సన్నముగా గైకొని వృద్ధినొందుచుండును. వీనియందును సూక్ష్మశరీరములు కలిగియున్నను స్థూలశరీరము లందలిభేదమున జ్ఞానకర్మలయందలి తారతమ్యములు దోచు చుండును. ఓషధుల సన్నముగాగొని జంగమసృష్టి దోచు చున్నది. ఆయన్నముపలన పురుషుడు కలిగెనన నీ స్థూలశరీర ముకలుగుచున్నది. ఇదియె అన్నరసమయమగు పురుషాకా రము (అనగా కోశము). ఈ అన్నమయపురుషునకు దృగ్గో చరమగు నిదియె శిరస్సు, ఈచూడబడునట్టివే దక్షిణోత్తర పక్షములు, త్వగింద్రియపర్యంతమగు నిదియ ఆత్మచూడబడు నట్టి యీ యధఃకాయముచే ప్రతిష్ఠితమై యున్నది.

పాంచభౌతికమై మూర్తపరిచ్ఛిన్నపదార్థమై ఉత్పత్తి నాశవంతమై అపచయోపచయములు కలిగి సర్వవిషయసంబం ధమున విషయాసక్తిని విషయావశ్యకమున బరగునట్టిదీస్థూల శరీరము. ఇదిమొదలు దీనితోకూడిన పంచకోశవర్ణన మొనర్ప బడును.

పంచకోశములన అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయము లనునవి. వీనినే శరీర త్రియమని కొందరు చెప్పెదరు. అన్నమయ ప్రాణమయ కోశములు స్థూలశరీరముగాను, మనోమయ విజ్ఞానమయకోశములు సూక్ష్మశరీరముగాను, ఆనందమయకోశము కారణ శరీరమునుగాను జెప్పుదురు. అన్నమయకోశము కలిగినమీద కొదువనాల్గుకోశములును వ్యవహారముగలవి యగుచుండును. స్థూలశరీరవియోగమున మరల స్థూలశరీరము కలుగువరకును సూక్ష్మశరీరముతోకూడిన యాత్మకు లోకవిషయసంబంధమును, తత్సంబంధజ్ఞానమునుం దోచక యీశ్వర నియంతృత్వమున కర్మానుగుణమగు పునర్దేహసంబంధము నొందును. అందుచే నాయవస్థయం దజ్ఞానాస్పదమై ఆత్మ యుండగలదని చెప్పెదరు. మోక్షస్థితియందు స్థూలదేహముండదుగదా! జ్ఞానమెట్లు కలుగగలదన!

బంధరూపమగు సూక్ష్మశరీరసంబంధముకూడ విడచుటచే బరమేశ్వరు నెఱిగి యానందింపగలుగును.

బంధమున్నంతవరకెట్లే మరల మరల స్థూలశరీరసంబంధము నొందుచు పీడచుచుండును. దానివలననే బంధము మృత్యుసంయుక్తమనియు, మోక్షమమృతమనియుం బలుకుదురు.

అట్లుకలిగిన స్థూలశరీరముతో సూక్ష్మశరీరవ్యాపియగు నాత్మ యభిమానమున మరణపర్యంతమును, అవినా

భావసంబంధము కలదియై యుండును. అనగా దేహమునందు జ్ఞానసంబంధమగు వ్యవహారము దోచును. ఆత్మయందు నీ దేహమునకుగల పరిమితియును, దాని పుష్టి యపుష్టియును, రోగారోగములును, సుఖదుఃఖములును, వాంఛాసంతుష్టులును, విషయసంపర్కసంభోగవియోగములును, జాగ్రత్స్వప్న సుషుప్తులను నవస్థలను, కలయటుల దోచుచుండును. ఎట్లన!

ఆత్మ చిత్తముతోకూడి దానివృత్తియగు నానాకరణవ్యాపనముం జేయించును. మానసాదిచిత్తవృత్తులనుపరమింప నిద్రం జేయును. మనసుశక్తి కొదువబుద్ధ్యహంకారేంద్రియాదులు అవ్యవహారస్థితియందుండ దోచునట్టిది స్వప్నము. ఆత్మ మనసునుగూడి, మనసు ఇంద్రియములతోగూడి, గోళకసహితమై త్వగింద్రియ పరివ్యాప్తమగు స్థూలశరీరముతోకూడి దానివలన సర్వలోకవిషయముల నెరుంగుచు నాశించుచు నంతరాయ విధ్వంసకాదులవలన దుఃఖించుచు క్రోధించుచు ననుభవకాలమున సుఖించుచు వియోగదుఃఖమునొందుచు పునర్వాంఛాప్రియత్నాదికష్టముల కోర్చి ఫలాశవలన దుఃఖస్వరూపసంసారము నెరుగునట్టిది జాగ్రదవస్థ. ఇట్లీయవస్థాత్రయముం జేయించుచు, నెరుగుచు, ననుభవించుచు నుండువా డాత్మ. ఇదియె, బంధమందురు.

నిజమున కాత్మ యసంగుడు అపచయోపచయరహితుడు, జన్మనాశాదివర్జితుడు, సుఖదుఃఖాదిద్వంద్వసంబంధ

విరహితుడు. అల్పాధికవిభేదమున, జ్ఞానయుక్తుడు, నిత్యుడు, అమూర్తసూక్ష్మచేతనస్వభావుడు. దేహాదుల నభిమానించుట వలన, దుఃఖపరిపూరితమగు బంధమును, ఈశ్వరు నుపాసించుట వలన నానందయుక్తమగు మోక్షమును పొందజాలునట్టివాడు. ఇట్టివానికి భోగాపవర్గసాధనమై దనర్చు పంచకోశముల వివరణమును, అపవర్గహేతువులగు వానియందలి శక్తులును, ముందు క్రమముగా వర్ణింపబడును. ఈ యనువాకమున చివర, నన్నమయకోశముం జెప్ప మొదలిడెను. ముందనువాకమున కొంత యీ విషయము వివరింపబడుచు దానిసంబంధముగల ప్రాణమయకోశమును చెప్పనారంభించును. ఇట్లే యనుబంధవిషయసంబంధమున నీయనువాకములు చెప్పబడియుండుటవలన "తదప్యేష శ్లోకో భవతి" యనుటలో నపిశబ్దము చెప్పబడియుండెనని చెప్పుకొనవచ్చును.

ఇది నరసింహమూర్తికృత ఆంధ్రానువాదయుక్తమగు

బ్రహ్మవల్లీ ప్రథమానువాకము

సమాప్తము.

# బ్రహ్మవల్లి - ద్వితీయోఽనువాకః

అన్నాద్వై ప్రజాఃప్రజాయన్తే। యాః కాశ్చపృథివీగ్ం శ్రితాః
అథో అన్నేనైవ జీవన్తి। అథైనదపి యన్త్యన్తతః। అన్నగ్ం
హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సర్వౌషధముచ్యతే। సర్వం
వై తేఽన్నమాప్నువన్తి। యేఽన్నం బ్రహ్మోపాసతే। అన్నగ్ం
హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సర్వౌషధముచ్యతే
అన్నాద్భూతాని జాయన్తే। జాతాన్యన్నేన వర్ధన్తే। అద్యతే
ఽత్తి చ భూతాని। తస్మాదన్నం తదుచ్యత ఇతి

యాః కాః చ=ఏ వ పృథివీం శ్రితాః=భూమిని ఆశ్రయించియున్న, ప్రజాః=జీవులు (కలరో వారందరు), అన్నాత్= అన్నము వలన, ప్రజాయంతేవై=పుట్టుచున్నారుగదా, అథో= పిమ్మట, అన్నేనఏవ = అన్నముచేతనే, జీవంతి = బ్రతుకుచున్నారు, అథ = పిమ్మట, ఏనత్ = ఈయన్నమును, అంతతః = చివరను, అపియంతి = లయమును పొందుచున్నారు, అన్నం = అన్నము, భూతానాం జ్యేష్ఠమ్ = భూతములలో శ్రేష్ఠమైనది. తస్మాత్ —సర్వౌషధం = సర్వౌషధము (అని)

ఉచ్యతే = చెప్పబడుచున్నది. యే = ఎవరు, అన్నం = అన్నమును, బ్రహ్మఉపాసతే=బ్రహ్మమునుగా ఉపాసించుచున్నారో తే = వారు, సర్వంఅన్నం = సర్వమగు అన్నమును, ఆప్నువంతివై = పొందుచున్నారుగదా! అన్నం=అన్నము, భూతానాం = భూతములలో జ్యేష్ఠం హి=మొదటిదిగదా! తస్మాత్ = అందువలన, సర్వౌషధం ఉచ్యతే = సర్వౌషధమని చెప్పబడు చున్నది. అన్నాత్ = అన్నమువలన, భూతానిజాయంతే = భూతములు పుట్టుచున్నవి జాతాని = పుట్టినవి, అన్నేన = అన్నముచే, వర్ధంతే = వృద్ధినొందుచున్నవి, భూతాని=భూతములు, అత్తిచ = తినుచున్నవి, మరియును అద్యతే = తినబడుచున్నవి. తస్మాత్ = అందువలన, తత్ = అది, అన్నంఇతి= అన్నమని, ఉచ్యతే=చెప్పబడుచున్నది. ఇతి=మంత్రిసమాప్తి సూచకము.

పృథివ్యాశ్రయములైన సర్వజీవులు నన్నమువలన పుట్టుచున్నవనియు నన్నమువలననే వృద్ధినొంది యన్నమునసే లయించుననియుం జెప్పబడెను. భూమియందును నీటియందును గాలియందునుగూడ జీవులుకలిగియే యున్నారు. భూమ్యాశ్రయములగు జీవులనిమాత్రమేల చెప్పబడెనన పృథ్వీతత్వము ననే భూతోత్పత్తి కాబడగలదు. అదిగాక వాయుజలాగ్నులు పృథ్వినాశ్రయించియే బ్రికాశించును. కనులచే చూడబడరాని జీవులుగూడ పృథ్వీతత్వమువలననే ఉత్పత్తికాబడును. కాన

సర్వజీవులును పృథివ్యాశ్రయములని చెప్పబడినవి. జీవులయందు స్థావరములు మొదలకలుగును. పిమ్మటజంగమసృష్టి కలుగును. స్థావరములకు నీరు మన్ను ఆహారమగును. ఈస్థావరరూపములు జంగముల కన్నమగును. పాంచభౌతికమగు నీస్థూలదేహము పాంచభౌతికమగు నీయన్న సాహాయ్యమునగాని వృద్ధినొందదు. తత్సాహాయ్య విరహితమగునేని కృశించి నశించును. అందుచే పుట్టుటయు వృద్ధినొందుటయు అన్నమువలననే కాబడుచున్నది. అన్నమునందే లయమునొందునన నాశముకారణలయమన బడును. కాన పంచభూతముల యందీయన్నమయము లయిం చును. సర్వాన్నస్వరూపుడని యీశ్వరుడిందు చెప్పబడెను. అట్టి కాలస్వరూపునిచేనాశముశాసించబడును. అదియునుంగాక యుత్పత్తియె నాశహేతువు. ఉత్పత్తియందె నాశబీజ మిమిడి యుండును. అందుచే నన్నమేలయకారణమని చెప్పవచ్చును. ఇట్లుత్పత్తి స్థితిలయముల కన్నమే కారణమని చెప్పబడెను. అన్నమే భూతములలో మొదటిది. అందునలన నందరకు ఔషధమని చెప్పబడుచున్నది. మొదట నన్నముకలిగినచో భూతముల యుత్పత్తి కాబడును. లేకున్న యుత్పత్తి కాబడ జాలదు. అన్నరస మయూత్మునకుఅన్నమే కారణమగుటవలన నందరకు నౌషధమని చెప్పబడినది. అనగా బ్రతుకునకు హేతు వనబడుచున్నది.

ఎవరు బ్రహ్మమును అన్నముగా నుపాసించుచున్నారో వారు అనన్యాన్నస్వరూపుడగు బ్రహ్మమునే పొందుచున్నారు.

నిర్లేపుడును, నిస్సంగుడునగు నీశ్వరు డన్నస్వరూపుడగు టెట్లు? అట్లుపాసింపగలుగుట యెట్లన?

సర్వవ్యాపక శర్వశక్తియుతుడగు నీశ్వరుడు ఘోర మూఢాదిధర్మములతో తనయందే కలిగియున్న ప్రకృతిపదార్థమును తనయనంత దివ్యజ్ఞానశక్తులవలన, జీవభోగార్థమగు నట్లు రచించును. రచన యందీశ్వరుని జ్ఞానశక్తు లిమిడియున్నందున సర్వ-అన్నమును సర్వ-అన్నరసమయాత్మలను ఆతడని వర్ణింతురు. ఇదిగాక నీశ్వరుడు కలడని తెలియుటకిదియే విధానమైయున్నది. ఇదియె విశ్వరూపము. దీనియందంతటను వెలుపల లోపల యనక నిండియుండి వీనియన్నిటికిని కారణమై యున్నాడని ధ్యానించుటవలన నీదేహము తానను భ్రమ కృశించుటయును, స్వార్థమునువీడి సర్వజీవుల సమముగా జూచుటయును, దానివలన సర్వమును ధారణచేయగా దానియందంతర్యామిత్వముగల నీశ్వరు నెఱుంగజాలుటయును, అన్యవిధమున నీశ్వరుని యనంతదివ్యజ్ఞాన శక్తులుగల జీవుడు గ్రహింపజాలనివాడై యుండుటయును, ఉపాసన యందిది ప్రథమమని యుపదేశింపబడినది. ఓంకారార్థము విశ్వతైజస ప్రాజ్ఞులని చెప్పబడినది. అట్లు విశ్వరూపునిగ నుపాసించువా రావిశ్వరూప బ్రహ్మమునే పొందుదురని యభిప్రాయము. అంతియగాని లోకవిషయమగు సర్వసంపదలని చెప్పరాదు. పరమేశ్వరు నారాధించుటయు ప్రకృతియందు ఫలముగాంచుటయు ననమంజసము.

బీజమునందును, కర్మమునందును, విపరీతఫలనిష్పత్తి యనంభవముగదా! కాన పరమేశ్వరునెరిగి యారాధించువా డాతనినే పొందునని చెప్పవలెను.

అన్నము భూతములలో మొదటిదియగుట సర్వౌషధమ్మని చెప్పబడుచున్నది. అని మరల చెప్పబడినది. పునరుక్తి యత్యాదరమును సూచించును. ఈ దేహము కారణములేక కలిగినదనిగాని, కామహైతుకమనిగాని, నాశియని భ్రమయుట గాని, కూడదనుటకై మరల చెప్పబడెననవచ్చును. అన్నము వలన భూతములు పుట్టుచున్నవి. పుట్టినవి. అన్నముచేతనే వృద్ధినొందుచున్నవి. భూతములచే దినబడుచు భూతములందినుచుండుట దీనికి అన్నముపేరు. ఇది యన్నమను పేరునకు నిర్వచనము. భూతముల ఉత్పత్తి వృద్ధులకు కారణమగుటతో భూతములచే దినబడు నట్టిదీయన్నమనియు కారణలయముంజేసి భూతనాశనమున భూతములం దినుచున్నదనియు, ఎట్లయినను దినుటయే చెప్పబడుచున్నది యగుట దీనికి అన్నమను పేరు సార్థకమని చెప్పబడెను. ఇట్లన్నరసమయకోశము చెప్పబడెను. ఓంకారమున అ-ఉ-మ్ కలవు. వీనికి విశ్వతైజసప్రాజ్ఞులను నర్థమువచింతురు. అందకారమున చెప్పబడు విశ్వరూపోపాసన మిందు వర్ణింపబడెను.

తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాత్ । అన్యోఽన్తర ఆత్మా ప్రాణమయః - తేనైష పూర్ణః సవా ఏష పురుషవిధ ఏవ

తస్యపురుష విధతామ్ - అన్వయం పురుషవిధః - తస్య ప్రాణ ఏవశ్శిరః - వ్యానోదక్షిణః పక్షః - అపాన ఉత్తరః పక్షః - ఆకాశ ఆత్మా - పృథివీపుచ్ఛం ప్రతిష్ఠా - తదప్యేషశ్లోకో భవతి॥

తస్మాత్ వా=ఆపృథివ్యాదులవలన (కలిగిన)ఏతస్మాత్= ఈచెప్పబడిన, అన్నరసమయాత్=అన్నరసమయమగు నాత్మ కంటె, అన్యః = ఇతరుడగు, ప్రాణమయః = ప్రాణవికారుడగు అంతరః ఆత్మా = అభ్యంతరుడగు నాత్మ (కలడు) తేన=ఆప్రాణ మయాత్మచే, ఏషః=ఈఅన్నరసమయాత్మ, పూర్ణః=పూర్ణుడు, సః ఏషః = అట్టిదగు నీప్రాణమయాత్మ, పురుషవిధః ఏవవై= పురుషాకారుడేగదా, తస్య=ఆఅన్నరసమయునియొక్క, పురు షవిధతామ్=పురుషవిధత్వమును, అను=అనుసరించి, అయం= ఈప్రాణమయాత్మ పురుషవిధః = పురుషవిధుడగుచున్నాడు, తస్య = ఆప్రాణమయాత్మునకు, ప్రాణఏవ = ప్రాణవాయువే శిరః=శిరస్సు, వ్యానః=వ్యానవాయువు దక్షిణఃపక్షః=కుడిభుజము అపానఃఉత్తరఃపక్షః = అపానవాయువు, ఉత్తరపక్షము. ఆకాశ ఆత్మా=ఆకాశము ఆత్మ. పృథివీపుచ్ఛం=భూమిపుచ్ఛముగా ప్రతిష్ఠా=ప్రతిష్ఠింపబడినది, తత్ అపి=ఆవిషయమును గూర్చి, ఏషః=ఇది. శ్లోకః=మంత్రము, భవతి=అగుచున్నది.

అట్లుకలిగిన యీఅన్నరసమయాత్మునికంటె అన్యుడై దానియందుకలిగిన ప్రాణమయాత్మ కలడు. అతనిచే ఈప్రాణ మయుడు నిండియుండును.

అన్నమయకోశముకంటె వ్యతిరేకలక్షణములు కలిగి యన్నమయములో సంపూర్ణసంబంధముగలదియై యునికి వేరుగను దీనిని నిండియుండునట్టిదిగను, వర్ణింపబడెను

అట్టి యీప్రాణమయాత్మ, పురుషాకారుడేగదా! అనగా ప్రాణమయకోశము ప్రత్యేకశక్తులు కలదియు దీనికంటె సూక్ష్మమును దీనిని నడిపింప సమర్థమైనదియు నగుట ప్రత్యేకముగ జెప్పబడవలెనని యభిప్రాయము. ఇట్లే ఈకోశములన్నియు నుత్తరోత్తర సూక్ష్మత్వమును విభుత్వమును కలవిగా చెప్పబడును. ఉత్తరోత్తర శక్త్యతిశయ వంతములును, ఎడతెగనిసంబంధము గలవిగాను దోచుచుండును.

ఆయన్నమయకోశము ననుసరించి యీప్రాణమయుడు పురుషాకారము గలవాడగుచున్నాడన ప్రాణమయకోశము అన్నమయకోశము కలిగినమీదనావశ్యకమగునట్టిదియు దాని వలన బ్రకాశించునట్టిదియు, దానియాధారమున నుండజాలునట్టిదియు నగుటవలన, నట్లుచెప్పబడెను. అదిగాక అన్నమయశరీర మెట్టి పొడవు వెడల్పులు కలిగియుండునో కొదువకోశములన్నియు నంతియు పొడవువెడల్పులతో నాపాదమస్తకవ్యాప్తి నొందియుండును. చిన్నదియగు చీమయందుగల కోశము లాశరీరమున నిమిడి దానిని నడిపింప సమర్థములైయుండును. హస్తిశరీరమున దానిని నిండి దానినినడిపింప సమర్థములై యుండును. ఇట్లే సర్వజీవులయందును కలిగియుండును. కాన నట్లు చెప్పబడెను.

ఇక నీకోశమున శిరోదక్షిణోత్తరపక్ష-ఆత్మాధఃకాయ ములంబోల్చి వర్ణింపఁబడెను. ప్రాణమయకోశమున కీయవయవ ములు లేకయున్నను అన్నమయకోశమునుబట్టి వర్ణించుట యనబడును. అదిగాక రూపకాలంకారమున నా యా యవ యవవిశేషము లిక ముందన్నికోశములయందును చెప్ప బడును.

దీనికి ప్రాణము శిరస్సన, ఇదియె హృదయమును స్పడ పించుచు రక్తమును ప్రవహింపజేయ సమర్థమై, సర్వశరీరమును పారిశుద్ధ్యమొనర్చి బలముగలిగించునట్టిదియగుట, శిరస్సుగ వర్ణింపబడెను.

వ్యానాపానవాయువులు దక్షిణోత్తర పక్షములుగా నిందు చెప్పబడెను. వ్యానము శరీరమునంతను నిండియుండును. ప్రాణమువలన కలిగి శరీరమున కంతకును బలమొనంగునట్టిది యై యుండును. అపానము; కలుషమైన దానిని విడుచుట యును, మరల పీల్చుట కవకాశమేర్పరచునట్టిదియును, అపాన మనంబడును. ఆకసమాత్మయన, వాయువునకు సహాగామిత్వ మాకసమున కలిగియుండును. అదిగాక నాకసమునగలిగిన దీవాయువగుట నట్లు చెప్పబడెను.

పృథ్విపుచ్ఛము గాగలదని చెప్పబడెను. అనగా వాయు జలాగ్నులు పృథ్వీతత్వమగు మండలాశ్రియములు. భూమి

యందు దట్టముగనుండి క్రమముగ పల్చనై కొంతదవ్వేసిన పిదప వాయువునకుస్థితియే చెప్పబడదు. ఇట్టి యసంఖ్యాకము లగు నీమండలముల యందని యూహింపబడును. అందుచే నిట్లు చెప్పబడెను. శరీరమునగల వాయువు లైదుగా జెప్పెదరు. ఈ మాటనిం జెప్పుటలో వానిసిద్ధిగలదని యుందు మాటనిగా జెప్పినవలెను. ముందనువాకమునకూడ నీప్రాణమయకోశమునుంగూర్చి కొంత చెప్పబడును.



# బ్రహ్మవల్లీ - తృతీయానువాకము

ప్రాణం దేవా అనుప్రాణన్తి । మనుష్యాః పశవశ్చ యే। ప్రాణో హి భూతానామాయుః । తస్మాత్సర్వాయుషము చ్యతే । సర్వమేవత ఆయుర్యన్తి । యే ప్రాణం బ్రహ్మోపాసతే । ప్రాణో హి భూతానామాయుః । తస్మాత్సర్వాయుష ముచ్యత ఇతి।

దేవాః=దేవతలు, యే మనుష్యాః చ పశవః=ఏ మనుజులును, మరియును పశువులును గలరో (వారందరు) ప్రాణం=ప్రాణమును, అను=అనుసరించి, ప్రాణంతి=బ్రతుకుచున్నారు. ప్రాణః=ప్రాణము, భూతానాం=భూతములకు, ఆయుః = ఆయువు, తస్మాత్=అందువలన సర్వాయుషం = సర్వలోకజీవనము (అని) ఉచ్యతే = చెప్పబడుచున్నది. యే = ఎవరు, ప్రాణం = ప్రాణమును, బ్రహ్మోపాసతే = బ్రహ్మమునుగా నుపాసించుచున్నారో, తే=వారు, సర్వఆయుః ఏవ=సర్వాయురూపబ్రహ్మమునే, యంతి=పొందుచున్నారు. ప్రాణః=ప్రాణము, భూతానాం=భూతములకు, ఆయుఃహి = జీవనముగదా! తస్మాత్ = దానివలన, సర్వాయుషం ఇతి = సర్వభూతజీవనమని, ఉచ్యతే = చెప్పబడుచున్నది. ఇతి=యని మంత్రిసమాప్తి చెప్పబడినది.

దేవతలు ప్రాణము ననుసరించియే జీవించుచున్నారు. ఏమనుజులును, పశువులును, గలరో వారందరీ ప్రాణమువలననే బ్రతుకుచున్నారు.

సర్వజీవులకును ప్రాణమె ఆయువని చెప్పబడుచున్నది. ప్రాణసంచలన మూగిన మరణమనియె చెప్పబడును. ప్రాణము వలననే మనసును, ఇంద్రియములును, కూడ స్వకార్యప్రవర్త మానములు కాగలుగుచున్నవి. ప్రాణసంబంధ మున్నంత వరకే స్థూల దేహ సంబంధమాత్మకు కలిగియుండును. ఇందు దేవ మనుష్యాదులనుటలో దేవతలని పురాణములంబల్కు నాకలోకవాసులని యనుకొనదగదు. వారికి చావుకలుగదనియు ఎల్లపుడును ముప్పదిఏండ్ల వయసు గలిగియుందురనియు నహైతుక కల్పనలుగలవు. కాలము ఒకనిమేషమైన నాగక సదా చెప్పబడుచుండును. అట్టికాలము దేవలోకమున ముప్పదిఏండ్లు కలిగి పిమ్మట నెట్లాగును. అదియు నందరును సమకాలికులు కాజాలరు. అందొక్కరికి ముప్పదియై యాగి కొదువవారిలో మరికొందరకు కాలమాగక నడచుచుండునా? కాలమంతటం గలిగి యన్నిటిసంబంధముగలిగి ఎడతెగక చెప్పబడునట్టిది. ఇక ముదిమియు, చావును, దేహధర్మమునై యుండ దేహమున నట్టివి దోచవనుట దేహధర్మమైనను చక్కగ నెరుంగనివారిచే చెప్పబడును. అట్లయ్యేనేని పుట్టినవారిసంఖ్య యత్యధికమై పరిమితమగు నాదేశమున నిలచుటకై నతావులేక నొకరినొకరు కొంసించుచు నశింపజూచుచుందురు. జనాకీర్ణములగు ప్రదేశ

ములు రోగభయ విస్తారత్వము నొందును. కార్యదోషహానమ న్వితములగును. ఇక వీరి దేహములు కారణములేకయే కలిగిన వనుట మరియును చిత్రము. దేహము పాంచభౌతికము అన్నము వలన రేతోరక్త సంయోగమునమాత్రము దేహముకలుగు చుండును. అట్టిదాని యందింద్రప్రాణమయాదికోశ సంబంధము కలిగి జీవనమనిపించుకొనగలుగును. అంతియగాని బీజమేలేని దేహములట్లు కలుగుటయు, వానియందియాత్మలు సూక్ష్మ శరీరసమన్వితములై ప్రవేశించుటయు, వానిసభిమానింప గను టయు నహైతుకము, అప్రమాణము గడ్డిపులివలె నా దేహము లం దొడిగికొనిన నభిమాన మెట్లుకలుగును? ఇకనా దేహములు భోగపుడొక్కలని చెప్పుదురు. ఇది మరియునం జోద్యము. భోగమున కొరకు దేహము, రోగమున కొరకు దేహముం గలుగునా? భౌతికముగాకున్న భోగము లెట్లుకలుగును? భోగమేప్రధాన మని యెంచువారికి సర్వదోషములును సంక్రమింపగా వారిం దేవతలనుటయెట్లు? ఇట్టి యహైతుక కల్పనలనమ్మి యట్టివి గలవనుకొనుట వెర్రితనము. అట్లే పిశాచరాక్షసాది కల్పన లును అని యెరుంగవలెను. మరేమన మానవులయందే వారి యర్హతలనుబట్టి దేవరాక్షస పైశాచాది భేదములం జెప్ప బడుదురని యెరుంగవలెను. ఇక నీ దేవశబ్దమున నింద్రియము లును, పృథివ్యాదిభూతములును, సూర్యచంద్రాదులును, చెప్ప బడుదురు. ఈ దేవతలుకూడ గాలివలననే సంచలనము కలిగి

యున్నవనినను నశిపోవును. ప్రతిమండలము నాశ్రయించినగాలి దానికి రక్షయగుచున్నది. అగ్నిని జ్వలింపజేయును. జలమును ఘోషరూపమున పైకెగచి వర్షరూపమును కలుగజేయును. మహాబలుడను సార్థకనామమున తదితర స్థూలభూతములకు సాహాయ్యకుడై సంచరించును. కాని యిచ్చట దేహశబ్దము జీవులయందైనదగా దోచుచున్నందున మానవులయందలి తపశ్శీలురును సన్మార్గవర్తులు నగువారని యెంచవలెను అట్టి వారలకుకూడ నాయూరూపమై ప్రాణాయామాది సాధనములకు సాధనమై తనరారుచున్నదనియు, సర్వజీవులకును జీవనమై యొప్పారుచున్నదనియు, నట్లుచెప్పబడెను.

ఎవరీప్రాణమును బ్రహ్మముగా నుపాసించుచున్నారో వారు సర్వాయూరూపమగు నాబ్రహ్మమునే బొందెదరనిచెప్పబడినది. సర్వప్రాణహేతువై అనగా ప్రాణమునకు ప్రాణమై సర్వజీవనహేతువగు నాపరమేశునెరిగి యుపాసింతురేని వారా పరమేశ్వరునే బొందుదురని దీనియందునుఆవిశ్వరూపోపాసనమే చెప్పబడినది. జీవులకు సాధనములగు సర్వమును నా యీశుడే ప్రసాదించె నని యెడి విశ్వాసమును నిర్మమత్వమును సర్వమునం దీశ్వరుం దెలియజాలుటయునుం గలిగి యీ యీశ్వరు నొందెదరు.

సర్వజీవులకును గాలియే ఆయువగుట దీనిని సర్వాయువనెదరు. అని దార్ఢ్యార్థ్యమై మరల చెప్పబడినది.

తస్యైష ఏవ శారీర ఆత్మా । యః పూర్వస్య । తస్మాద్వా ఏతస్మాత్ప్రాణమయాత్ । అన్యోఽన్తర ఆత్మా మనోమయః । తేనైష పూర్ణః । స వా ఏష పురుషవిధ ఏవ । తస్య పురుషవిధతామ్ । అన్వయం పురుషవిధః । తస్య యజురేవ శిరః । ఋగ్దక్షిణః పక్షః । సామోత్తరః పక్షః । ఆదేశ ఆత్మా । అథర్వాంగిరసః పుచ్ఛం ప్రతిష్ఠా । తదప్యేష శ్లోకో భవతి ।

పూర్వస్య = పూర్వముగ చెప్పబడిన, తస్య = అన్నమయాత్మునకు, శారీరః=శరీరమునందు కలిగిన, యః=ఎవడు, (సః) ఏషఆత్మా=(వాడు) ఈ ప్రాణమయాత్మ (అని చెప్పబడును) ఆ అన్నరసమయాత్మునివలన (కలిగిన) తస్మాత్= అట్లు కలిగినదానివలన ఏతస్మాత్ ప్రాణమయాత్=ఈ ప్రాణమయాత్మునికంటె అన్యః=ఇతరుడగు, అంతరఆత్మా=అభ్యంతరుడగు ఆత్మ. మనోమయః=మనోమయుడు (కలడు) తేన= ఆమనోమయాత్మచే, ఏషః=ఈ ప్రాణమయాత్మ పూర్ణః=నిండియున్నవాడు. సః ఏషః=ఆ, యీ ప్రాణమయాత్మ పురుషవిధ ఏవ=పురుషాకారము గలవాడే, తస్య = వానియొక్క, పురుషవిధతామ్ = పురుషవిధత్వమును, అను = అనుసరించి,అయం= ఈ మనోమయాత్మ, పురుషవిధ = పురుషవిధముకలవాడు, తస్య = వానికి, యజుః = యజుర్వేదము, శిరఃఏవ = శిరస్సు,

ఋక్ దక్షిణః పక్షః = ఋగ్వేదము కుడిభుజము, సామఉత్తరః పక్షః = సామవేదము ఎడమ భుజము, ఆదేశఆత్మా = ఉపదేశము ఆత్మ, అధర్వాంగిరసః పుచ్ఛం, ప్రతిష్ఠా = అధర్వాంగిరసుడను మహర్షి ప్రతిష్ఠావహమగు పుచ్ఛము, తత్ అపి = ఆవిషయమునుగూర్చియు, ఏషః = ఈ చెప్పబడుచున్నది. శ్లోకః = మంత్రము, భవతి = అగుచున్నది.

పూర్వము చెప్పబడిన అన్నమయకోశమునందు కలిగిన ప్రాణమయకోశము ఇదియె. అట్లుకలిగిన యీప్రాణమయకోశముకంటె దానియంతరమున, నన్యమగు మనోమయకోశము కలదు. దానిచే ప్రాణమయము నిండియుండును. ఆప్రాణమయము పురుషాకారము కలవాడుకాగా, వానియాకారము ననుసరించి మనోమయకోశ మాకృతిని గాంచును. దానికియజుర్వేదము శిరఃప్రాయము, ఋక్సామములు దక్షిణోత్తరపక్షములు. ఆదేశమే ఆత్మ; అధర్వాంగిరసుడను ఋషి ఆధారరూపముగను ప్రతిష్ఠింపబడెను.

అనగా అన్నమయమునుబట్టి దానిలోపలనిండి దానిని చలింపజేయునట్టిది ప్రాణమయకోశము. దానికంటె సూక్ష్మమై దానినినిండి యీపరిమితి నాక్రమించి వానిని నడిపింప సమర్థమైనది మనోమయకోశము. దీనిలక్షణము నిందు ఋగ్యజుస్సామములను గురుముఖమున నేర్వగల్గుటయని చెప్పబడినది. వీనిలోకొన్ని భాగములరచించినవాడగునధర్వాంగిరసుడనుఋషి దీనికాధారముగా నుండుననియుం జెప్పబడెను.

మనసునగలుగు వ్యాపారములలో పారమార్థికమగు దానిని మాత్రము చేర్కొనెను.

మనసునకు వ్యాపారములు ధారణ ప్రేరణాదులును, సంకల్ప వికల్పములును, జ్ఞానేంద్రియములవలన విషయగ్రహణమును, కర్మేంద్రియముల ప్రేరేపణమును, వానివలనిసుఖదుఃఖములు మొదలగు ద్వంద్వముల నెరుగుచుండుటయు ననంబడును. ఈమనసు వ్యాపారము కలిగియున్నపుడు జాగ్రదవస్థ యనంబడును. ఆయవస్థయందిది పరమాణుకాలము సైతమాగక యింద్రియములతోఁగూడి పనిచేయుచుండును. ఇది యింద్రియములతోఁ కూడి లోకవిషయములం దెలియుట ప్రత్యక్షమనబడును. దానిసంస్కారబలమున దోఁచు సంబంధమున చెప్పబడునట్టిది అనుమానము. కార్యకారణ సంబంధమున, పరమసూక్ష్మమగువానిని జెప్పజాలునట్టియు ప్రస్తుతమునెరిగి పూర్వాపూర్వేతర విషయములం జెప్పఁజాలునట్టియు అన్యోన్యబోధవలన మహాత్తరవిషయజ్ఞానమును కలుగజేయునట్టియు అన్వయమున నొకదానినెరిగి, వ్యతిరేకమున దెలియజాలనివిషయమునుగూడ జెప్పజాలినట్టియు, తర్కమున నెంత నిగూఢసత్యములనేని జెప్పజాలినట్టిదియు, ఉదాహరణమున ననాజ్ఞాతపదార్థజ్ఞానమును కలుగజేయజాలినట్టిదియు, నగుదానిని శబ్దప్రమాణమందురు. ఈప్రమాణముల సాహాయ్యమున మన సతి సూక్ష్మవిషయగ్రహణ మొనర్పజాలును. ఈశబ్దప్రమాణ మార్యులయందు వేదములవలననని నమ్ముచున్నారు. నిజమునకు వేదము

లనేక నిగూఢసత్యములం బ్రకటింప సమర్థములై యున్నవి అందుచే నవ్వానిని గురువులవలన నేర్వదగియున్నవి. ఇట్టివి యగుట వాని నార్యు లతి పూజ్యభావమున జూచుచుండిరి. అట్లుచూడబడదగిన వనుటకు సందియమునులేదు. అట్టివియగుట వీనినీశ్వరుడు రచించెనని కొందరందురు. అది యీపూజ్యభావ మున ననెడిమాటయేగాని నిక్కవముగాజాలదు. ఏలనన?

అనిత్యమగు శబ్దమున జెప్పబడుచు శ్రవణేంద్రియమున మననుచే గ్రహింపబడుచు మానవజ్ఞానోచిత విధానమున బరగునట్టిదియగుట నీశ్వరవిరచితమనరాదు! ఈశ్వరవిరచిత మగునది సర్వజీవసామాన్యమై దనరారగలదు. అంతియగాక మానవులయందైనను నొకానొక భాషాజ్ఞానము గలవారికి మాత్రముపకరించును. లోకమున కొదువ భాషలయందు మాత్రము సత్యవిషయజ్ఞానములేదా? అన్నిటియందును గలదు. అది శబ్దమాత్రమున కలుగుశక్తికాదు. మానవునిమనోబుద్ధుల యందలి శక్తియని చెప్పబడును. ఆశక్తి శబ్దార్థజ్ఞాన సంస్కార బలమున వేగముగ విస్తారత్వమునొంది ప్రమాణయుక్తమై దార్ఢ్యముగలదియగును. ఇది వాగింద్రియవిశేషమున మానవ జాతియందంతటంగలిగి యాయాభిన్న భాషాజ్ఞానమునగూడ వారందరును కృతార్థులగుచున్నారు. కాన నర్థభావనమందే కృతార్థులగుచున్నారు. కాని వేర్వేరగు భాషలయందలి శబ్ద ములవలన కాజాలదు. శబ్దము సంజ్ఞామాత్రమై యగును. గాని దానికి అర్థసంపర్కముండజాలదు. ఒకేశబ్దమున ననేకార్థము

లును ఒకేయర్థమున ననేకశబ్దములునుం గలుగును. ఇదిగాక యొకయర్థమున ననేకభాషల ననేకశబ్దములు చెప్పబడును. ఒకశబ్దమునగల నక్షరములలో పూర్వాక్షరోచ్చారణ మన్యాక్షరోచ్చారణము సరికి విలీనమగుచుండును. ఉచ్చారణానంతరము శబ్దమంతయునువిలీనమగుచుండును. మరలచెప్పవలసినచో నాశబ్దమునేమరల యుచ్చరింపవలయును. అందుచేశబ్దము నిత్యమును గాదు. అట్టిది యగుట నీశ్వరవిరచితమునుగాదు. ఇట్టిదయైనను మానవులకు జ్ఞానసాధనమై నిగూఢ సత్యవిషయ ప్రకటనమున నిర్దిష్టవిధానము గలదియగుట వేదరచనయం దట్టివిశ్వాసమును కలిగియున్నారనుకొనవచ్చును. ఎట్లయినను దీనివలననే బంధమోక్షము లిట్టివని యెరింగి కృతార్థులు కాగలుగుచున్నారు. అని వాఙ్మానసములు ప్రశంసింపబడెను.

# బ్రహ్మవల్లీ - చతుర్థానువాకము

యతో వాచో నివర్తన్తే । అప్రాప్య మనసాసహ । ఆనందం బ్రహ్మణో విద్వాన్ । నబిభేతి కదాచనేతి ।

యతః = ఏ ఆనందమయబ్రహ్మమువల్లనుండి, వాచః= వాక్కులు, మనసాసహ = మనసుతో కూడినవై, అప్రాప్య= పొందజాలక, నివర్తన్తే = మరలుచున్నవో (అట్టి) బ్రహ్మణః= బ్రహ్మముయొక్క, ఆనందం=ఆనందమును, విద్వాన్= తెలియుచున్నవాడు- కదాచన = ఒకప్పుడును- న బిభేతి = భయమును పొందడు, ఇతి = యనునది మనోమయకోశ వివరణ సమాప్తిసూచకము.

ఏపరమేశ్వరుని తెలియగోరి మనసుతో కూడినవాక్కులు ఆగుచున్నవో ఆ యీశునియొక్క ఆనంద మెరింగినవా డొక ప్పుడును భయము నొందడని చెప్పబడెను.

ఇందు ఆనంద మెరుగవలె ననెడి విధివాక్యము దోచుచున్నది. ఎరుగుటకైన సాధనములగు మనోవాక్కుల నసమర్థములని చెప్పబడుచున్నవి. ఇ దెట్లు సరిపడునన?

ఆత్మ మనసుతో కూడినపుడుమాత్రమె జాగ్రదవస్థ యనంబడును. దీనియందే సర్వమును దెలియుట కవకాశ మేర్పడును. కొదువ రెండవస్థలయందునుం దెలియుట యనునది

కొంచమైనను గలుగజాలదు. అందుచే జాగ్రదవస్థయె సమస్త
పురుషార్థమూలమని చెప్పబడును.

స్వప్నమన మనసుయొక్క వృత్తి సంపూర్ణముగ గలుగకయుండుటచే పూర్వసంస్కారములయందలి విషయములేవియేవియో దోచి యాగుచుండును. సంపూర్ణముగ, మనఃప్రవృత్తి కలిగెనేని నింద్రియము లన్నియుం గార్యోన్ముఖములై యొప్పారును. అప్పట్ల పదార్థములయొక్క యథార్థమెఱుంగనగును. అట్లు లేకుండుటంజేసి స్వప్నమున యథార్థమెఱుంగ నలవిగాదు. ఇట్టిది స్వప్నమనంబడును.

సుషుప్తియన మనఃప్రవృత్తి యించుకేనియుం దోపదు. చిత్తవృత్తియగు శ్వాసనమొక్కటియెగాగల కర్మమొనర్పబడుచుండును. గ్రహణధారణ స్మృతులనెడి జ్ఞానవిషయములందేమాత్రమును దోపజాలవు. అందుచేనాయవస్థ నజ్ఞానావృతమని చెప్పెదరు. అదయె సుషుప్తి.

జాగ్రదవస్థయన ఆత్మ మనసునగూడి దానివలన నింద్రియములంగూడి నింద్రియములవలన సర్వసన్నిహితవిషయములం దెలియుచు తనతోకూడిన బుద్ధియందలి పూర్వసంస్కారములవలని స్మృతికూడ కలిగియుండును. ఇట్లుగ్రహణధారణాస్మృతులుగల యది జాగ్రదవస్థ యనంబడును. ఇట్టిదియగు మనసు నిషేధింపబడుటేల? యన మనసింద్రియములతోకూడి వాని పరిమితశక్తులవలన విషయగ్రహణ మొనర్పజాలి యుండును. త్వగింద్రియము సంయోగింపబడినదాని స్పర్శ మెఱుంగ

గలదు.సంయోగింపబడక యున్నచో సమీపస్థ మగుదాని యొక్క శీతోష్ణమంజుల కఠినత్వాదులనుసైతమెరుంగజాలదు.

రసనేంద్రియముగూడ సంయోగింపబడిన పదార్థము యొక్క రుచినిమాత్రమె గ్రహింపగలదు ఘ్రాణేంద్రియము వాయ్వాశ్రయమునై స్పృశించు గంధములనుమాత్రి మెరుంగ గలదు.

శ్రవణేంద్రియముగూడ వాయువుకంటెనన్యమై వాయువు నందు ప్రయాణ మొసర్చుచు వచ్చినశబ్దము సోకుటవలననే గ్రిహింపగలుగును.

చక్షురింద్రియము వెలుగునదోచు పదార్థములను ఆటంకములేకయున్న దృక్పరిధి (Hor!zen) యందలి వానిని గ్రహించును. అదియును దూరమగుకొలది యస్పష్టముగను చాలచిన్నవిగను గ్రహింపజాలును. స్వయంప్రకాశములగు పెద్ద వస్తువులను చాలదూరమువరకును గ్రిహింపగలుగును. చక్షు రిండ్రియవృత్తి వెల్గున బర్వెడునట్టిదియగుట దానివృత్తి యం దదియు స్పర్శమనియే చెప్పబడవచ్చును. ఇట్లు ఇంద్రియములం గూడి వానిచేష్టలయందిమిడి యొకేసారి కొకటిమాత్రిము గ్రిహింపగలదియై యున్నదీమనను. అణుకాలమున చలింప దగినదియగుట నన్ని యింద్రియవిషయము లొకేసారి గ్రహింప గలిగినట్లు దోచుచుండును. కర్మేంద్రియములచే పనులం జేయించుచు, జ్ఞానేంద్రియములచే విషయములం గ్రిహించు టయుం గలుగుచుండును, అదియింద్రియములకుకూడ కొంత

శక్తి కలిగియున్నందున సంకల్పించిన కార్యములయందు విడు వక పనిచేయకలిగినవగుట నట్లు కావింపబడవచ్చును. చక్షురా దీంద్రియముల కంకని జీవజాలమును ప్రకృతిపరమాణువులను సైతమీమనసు గ్రహింపజాలదు.

ఇట్టి జాగ్రదవస్థయం దీమనసుతోకూడిసదై సదాబుద్ధి పనిచేయుచుండును. ఇది యింద్రియములవలన మనసునకలిగెడి జ్ఞానమవధారణ మొనర్చి ప్రతివిషయమునందలి లాభనష్టము లను విమర్శించుచు మనస్సునుగూడి కార్యములను శాసించుచుం డును. పాంథుడు మార్గమునగల కంటకముగాంచినంతనె దాని సంయోగమున గలుగగల బాధ సంస్కారబలమున సంతత్వరలో నిర్ణయించి దానినంటకుండ దాటిపోగలట్లు లుపదేశించును. ఇట్లన్ని విషయములందును మనసునకుదోడై మనసుతోడిదియై ప్రకాశించునట్టిది బుద్ధియనునదొకటికలదు. దానిశక్తియెట్టి దనిన:—

ఇంద్రియములతో గూడక మనసు బుద్ధితో కూడినచో పూర్వసంస్కారబలమున నాకాశమునగల భూమ్యాదిసర్వమం డలముల నొకేసారి ధారణచేయగలదు. వానికి కారణము లగు సూక్ష్మభూతములను ఆత్మేశ్వరులనుంగూడ నూహించి నిర్ణయించగలదు. ఇట్టిదియైనను, బుద్ధి మనసున గూడెనేని బరిమితవిషయజ్ఞానమున బరిఢవిల్లును.

ఆత్మ యింద్రియములనుండియు, విషయములనుండియు మరలింపబడిన మనసును, బుద్ధియందు జేర్చుస్థితి మానవుల

యందు మిక్కిలి యరుదుగ దోచుచుండును. దేశకాల రాజకీయాదులవలనను ఈ యీతిబాధలవలనను కుటుంబదేహాభరణములు భరమై యీ జాగ్రదవస్థయొక్క కాలపరిమితి చాలదని పరితపించువా రెట్లట్టియవకాశమును బొందజాలుదురు? కావుననె వాఙ్మానసములవలన నానంద మెరుంగబడజాలదని చెప్పబడెను. ఎట్లన?

మనసు సదా దుఃఖగ్రస్తములగు సుఖములను మాత్రమె పొందదలచుటయు పొందగాంచుటయు చేయజాలును. దుఃఖగ్రస్తములనగా.

మొదల కోరిక యొకదుఃఖము. లేనిదానికదా కోరవలయును. అందుచే లేదనెడి దుఃఖము కోర్కెయందిమిడియే యున్నది. తత్ప్రియత్న మొకదుఃఖము. అంతరాయాదుల వలని దుఃఖము. ఫలప్రాప్తిలేకున్న నదేదుఃఖము. పొందెనన్న ఫలమనుభవక్షీణమగుటవలన వియోగదుఃఖము. మరల యథాపూర్వము వాంఛాదికము. అందువలననే బంధము దుఃఖమందురు. వాంఛలను వీడుదమన్న నిద్రా భోజనపానాదులనికము దేహమున కావశ్యకములు. వానిని వీడజాలుటెట్లు? అవి యెల్లవేళలను దేహిని బాధించుచునే యుండును. దినమున కొకసారి భుజించిన రాత్రి యాకలియగుచునే యున్నది. రాత్రిదినిన మరుచటిదినమున నట్లే కలుగుచున్నది. ఎంతసుఖతరమగు భోజనము చేసితిననుకొనినను క్షున్నివారణమనియే చెప్పబడును. ఆకలిబాధ నిత్యముకాగా తన్నివారణము

తాత్కాలికసుఖమై దోచుచున్నది. ఇట్లే సర్వవిషయములు నగుట బంధము తాపత్రయ సమన్వితమని చెప్పబడినది. అట్టి బంధముగలవాడగుట దేహి సచ్చిన్మాత్రుడయ్యు నానందము లేనివాడనియుం జెప్పబడును.

ఇట్టిదియని, బంధబాధ నెరిగి విషయములనుండి మర లించిన యింద్రియములను మనసునజేర్చి, మనసునుబుద్ధియందు జేర్చి యాబుద్ధితో కూడిననాత్మ వేదాది సచ్ఛాస్త్రోపదేశమున కలిగినజ్ఞానమున నీశ్వరు నిర్ణయమొనరించి, యారీతినుపాసించు నేని యాయీశ్వరునియానంద మిట్టిదియని యెరుకపడగలదు. ఇట్టిదయగుట, మనసున కానందవిషయానుభవము గలుగజాల దని చెప్పబడినది. వాక్కులం జెప్పుటయందుగూడ అననుభవ విషయమగుట నలవిగానిదియని చెప్పబడినది. ఇంద్రియమాన సాదుల నరికట్టినమీద విషయసంబంధబాధల విస్మృతికలుగ గలదు. దానంజేసి నిర్మలమగుబుద్ధి యందీశ్వరుని యనంతత్వా నందత్వాదుల నుపాసించునేని యానందమిట్టిదియని తెలియబడ గలదు. అందుచే మనసుతో కూడిన జాగ్రదవస్థయుం దొంద దగిన దీయానందమైనను మనఃప్రవృత్తివలనమాత్రము కాద నియు, మనసును బుద్ధివశమొనర్చుట వలనమాత్రము కలుగ గలదనియు నభిప్రాయము. మనోవ్యాపారము మూడువిషయ ములయం దాగునని చెప్పెదరు. నిద్రయందును, సమాధియం దును, మోక్షమునందును అనిచెప్పెదరు. అందు మోక్షము

నందు దేహముండదుగాన మనసుకూడ లేనిదియగుట మరల దోపదు. కొదువ రెంటియందును మరలమనఃప్రవృత్తి దోచ గలదు. ఈమనసు ఆత్మవశమగునేని యానందమునొందగలదు. ఆత్మ మనోవశమగునేని దుఃఖముమాత్రమె పొందగలదు. అందుచే వాఙ్మానసముల దెలియరాని యానందమీరీతి దెలియనగును. తెలసినమీద నొందనగుఫలము ఎల్లపుడును భయరహితమగునదియని చెప్పబడెను. అనగా—

దేహమున నభిమానమున్నంతవరకు మోహమువలన నన్నియెడలను, భయమేదోచును. ఈశ్వరోపాసనమున దేహాభిమానము కృశించి దేహముపోగా, మరల దేహసంబంధము గలుగజాలదు. కాన నిరంతరభయరహితమగుస్థితి, మోక్షమని యందురు. అదియె, దీనికిఫలమని చెప్పబడెను.

ఇది ఓంకారమునందలి 'ఉ'కారమునచెప్పబడు తైజసోపాసన మనవచ్చును. అకారము విశ్వరూపము. 'ఉ' కారము విశ్వసంబంధమును సంకల్పించునట్టిదియును, విశ్వమునకు బ్రసాదింపదలచి నట్టిదియునగు నానందమని యెంచవలెను. అట్టివరమేశ్వ రారాధనము లేకున్న బంధదుఃఖమునువిడచి యానందమెరుగరాదు.

తస్యైష ఏవశారీర ఆత్మా । యః పూర్వస్య । తస్మాద్వా ఏతస్మాన్మనోమయాత్ । అన్యోఽన్తర ఆత్మా విజ్ఞాన

మయః । తేనైష పూర్ణః । సవా ఏష పురుషవిధ ఏవ । తస్య పురుషవిధతామ్ । అన్వయం పురుషవిధః । తస్యశ్రద్ధైవశిరః । ఋతం దక్షిణః పక్షః । సత్యముత్తరః పక్షః । యోగ ఆత్మా । మహః పుచ్ఛం ప్రతిష్ఠా । తదప్యేషశ్లోకో భవతి ।

పూర్వస్య = పూర్వమున చెప్పబడిన, తస్య = ఆప్రాణ మయాత్మునకు, శారీరః = ప్రాణమయమునందు పుట్టిన, యః= ఎవడో, (సః = వాడు) ఆత్మాఏష ఏవ = మనోమయాత్మ ఇతడే తస్మాద్వా ఏతస్మాత్ =అట్లు కలిగిన యీ మనోమయాత్ = మనోమయాత్మునికంటె, అన్యః = ఇతరుడగు, అంతర ఆత్మా= అభ్యంతరఆత్మ, విజ్ఞానమయః = విజ్ఞానమయుడు, తేన = వానిచే, ఏషః = ఈ మనోమయాత్మ, పూర్ణః = నిండియున్న వాడు, సః=అట్లు పూర్ణుడుకాబడిన ఏషః=ఈ మనోమయాత్మ పురుషవిధః ఏవ = పురుషవిధము గలవాడే తస్య = వాని యొక్క, పురుషవిధతామ్ అను=పురుషవిధత్వము ననుసరించి, అయం=ఈ విజ్ఞానమయాత్మ, పురుషవిధః= పురుషవిధము గల వాడగుచున్నాడు. తస్య=ఆవిజ్ఞానమయాత్మునకు శ్రద్ధాఏవ శిరః=శ్రద్ధయే శిరస్సు, ఋతం = ఋజుమార్గము, దక్షిణః పక్షః=కుడిభుజము, సత్యం ఉత్తరః పక్షః = సత్యము ఎడమ భుజము, యోగః=యోగము, ఆత్మా=ఆత్మ, మహః=మహ

త్త్వము, పుచ్ఛం ప్రతిష్ఠా=ప్రతిష్ఠావహమగు పుచ్ఛము (అనంబడును) తత్ అపి=ఆ విషయమునుగూర్చియు ఏషః = ఇది శ్లోకః = మంత్రము, భవతి = అగుచున్నది.

పూర్వము చెప్పబడిన అప్రాణమయకోశమున కలిగిన మనోమయాత్మ ఇతడే. అట్లుకలిగిన మనోమయాత్మునికంటె నన్యమగునట్టియు దానిలోపల గలయట్టియు విజ్ఞానమయుడు కలడు. అతనిచే మనోమయాత్మ నిండియుండును. అనగా నొక కోశమున సింకొకకోశమున కవినాభావసంబంధముండుట నట్లు చెప్పబడెను.

ఆ మనోమయాత్మ పురుషాకారముగలవాడే అతనిననుస రించి యీవిజ్ఞానమయుడును పురుషాకారు డగుచున్నాడు. అనగా మనోమయకోశము ననుసరించి శక్తిసంపన్నమై దాని నెడబాయకుండ విజ్ఞానమయకోశము కలిగియుండును. మనః ప్రవృత్తికలిగిననే విజ్ఞానమయకోశముకూడ పనిచేయును. దీనిని బుద్ధియందురు. ఈవిజ్ఞానమయ ఆనందమయకోశము లీశ్వరో పాసనయందు మాత్రము వినియోగము లగుచుండును. అది లేదేని మనోమయముతోకూడి సదాపనిచేయుచుండును. అన్న ప్రాణ మనోమయకోశములు పనిచేయుచుండుపట్ల విజ్ఞానానంద మయకోశములు వానింగలసియే యుండును. వానినాగు పట్ల వీనివ్యక్తిత్వము దోచుచుండును. ఆవిజ్ఞానమయకోశము

ఇట్లు వర్ణింపబడును. వానికి శ్రద్ధయే శిరస్సు. ఈశ్వరుడనుభవ విషయమును, అనావశ్యకమును, తెలియుటకు కష్టతరమును నగుట జిజ్ఞాసులకు విసుగుదోచుచుండును. ఇదిగాక దేహావశ్యకముల, ననుసరించుట తప్పనిసరియైయుండును. వీనియందలి సుఖము లనాయాసముగ దెలియబడుటవలన మధురములై మనోజ్ఞములై రుచిప్పారుచుండును. కాన వీనియందలి ధ్యాన మీశ్వరధ్యానమున కాటంకమైయుండును. దానంజేసి వైరాగ్య యుక్తమగు శ్రద్ధ లేక యీశ్వరధ్యాన మలవడదు. అందుచే శ్రద్ధ శిరసుగా చెప్పబడినది.

ఋతము కుడిభుజము. అనగా సద్ధర్మరతిగలిగియుండుట దీనివలన నిరభిమానమును, త్యాగమును, లోకవిషయములం జిక్కువడకుండుటయును గలుగగలదు. దేహమున్నంతకాలము లోకవిషయములం బ్రవర్తించుట తప్పనిసరియగును. వాని యందభిమానముకూడ కలుగుట నైజమగును. కానవానివలని దోషములం జిక్కకుండ ఋజుమార్గగామి గావలెనని చెప్ప బడినది.

సత్య ముత్తరపక్షము. సత్యముడిగిన మానవునకు జ్ఞానముకలుగదు. ఇహ పర సుఖములును గలుగజాలవు. అందుచే సత్యమును పలుకుటయు, సంకల్పించుటయు, నాచరించుటయు, ననుసరించుటయు ననువదించుటయు, దెలియుటయు కర్తవ్యము.

యోగమాత్మయని చెప్పబడినది. యోగమన్న కూడుట పొందుట, ఉపాసించుట యనబడును. ఇదియము, నియమ ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులను ఎనిమిదంగములతో కూడినదని చెప్పుదురు.

అహింస, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము యమములన బడును.


శౌచము, సంతోషము, తపము, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము నియమములనంబడును. ఇవి లోకఖ్యాణమునకును నిరహంకారతకును తోడ్పడును. రాగాదిదోషములం బోగొట్టుటంజేసి నిర్మలమగు బుద్ధియందు ఈశ్వరుని భావింప గాంచును. ఆసనము స్థిరసుఖమును కలుగజేయును. కూర్చుండుటయందుపీడకలుగకుండుటకును దేహారోగ్యమునకును బనికివచ్చును. ప్రాణాయామము రేచకపూరక కుంభకవిధానముల బ్రాణమును స్వాధీనమొనర్చుట. దీనివలన నిందియమనములు చలియింపకుండనాగును.

ప్రత్యాహారము అప్పటికి మనసునదగులొ్కనియుండి మధురమై సాగుచుండెడి విషయచింతనమునుండి మనసును మరల్చుట ధ్యానము. ఈశ్వరనామములో నుత్తమమగు నోంకారమునుగాని మరియొక పవిత్రమగుదానినిగాని యుచ్చరించుచు దాని యర్థభావనమొనర్చుట దీనివలనమనసునిర్విషయమగును. బ్రహ్మభావనము కలుగును -

ధారణము అట్లుభావనయందలి పటిష్ఠతవలన అనంత, ఆస్పంద, అఖండ పరిజ్ఞానాదివిశేషముల జెప్పబడు నీశ్వరుననుభవమున నెరిగి యానందియగుట.

సమాధి అచంచలమును, అస్ఖలితమునగు ధారణావస్థ ఈఎనిమిదియును యోగమనబడును. ఇదియె ముఖ్యమగుట విజ్ఞానమునకు నాత్మయని చెప్పబడినది.

మహత్తత్త్వము స్వచ్ఛముగా పరిశిష్ఠింపబడినదన బుద్ధ్యుత్పత్తి హేతువగుట, మహత్తత్త్వముదీనికాధారమనిచెప్ప బడినది. ఈవిషయముంగూర్చిన ఇది మంత్రమగుచున్నది.



# బ్రహ్మవల్లీ - పంచమానువాకము

విజ్ఞానం యజ్ఞం తనుతే । కర్మాణితనుతేపిచ। విజ్ఞానం దేవాః సర్వే। బ్రహ్మజ్యేష్ఠముపాసతే ।విజ్ఞానంబ్రహ్మచేద్వేద । తస్మాచ్చేన్నప్రమాద్యతి । శరీరేపాప్మనోహిత్వా। సర్వాన్కామాన్సమశ్నుత ఇతి ।

విజ్ఞానం=విజ్ఞానము, యజ్ఞం = యజ్ఞమును, తనుతే= చేయుచున్నది. అపిచ=ఇంతియగాక, కర్మాణి = కర్మములను తనుతే=చేయుచున్నది. సర్వే దేవాః=దేవతలందరును, జ్యేష్ఠం-అన్నిటికంటె మొదటిదియును, విజ్ఞానం = విశేషజ్ఞానయుక్తమును అగు బ్రహ్మఉపాసతే=బ్రహ్మమును ఉపాసించుచున్నారు. బ్రహ్మవిజ్ఞానం (ఇతి) బ్రహ్మము అనంతజ్ఞాని (అని) వేదచేత్ = తెలిసినచో తస్మాత్ =ఆజ్ఞానమునుండి నప్రమాద్యతిచేత్ = ప్రమాదమును పొందకుండినచో శరీరే = శరీరమునందలి పాప్మనః = పాపములను హిత్వా = పోగొట్టుకొని సర్వాన్ = కామాన్ = సర్వకోర్కెలను సమశ్నుతే = పొందుచున్నాడు.

బుద్ధియజ్ఞమును చేయుచున్నది, అదిగాక కర్మములను కూడ చేయుచున్నది. అన-

యజ్ఞమునుగాక కర్మలం జేయుచున్నది యనుటలో యజ్ఞము అకర్మస్వరూపమని చెప్పకతప్పదు. యజ్ఞమన విష్ణువు

సత్కర్మము బ్రహ్మయజ్ఞము మొదలగు పంచయజ్ఞములు జ్ఞాన యజ్ఞము పశువిశసనాది యజ్ఞములు అని చెప్పుచున్నారు. ఇందు పశువిశసనముతో కూడిన యజ్ఞము దూష్యమనక తప్పదు, అది క్రూరకర్మయుక్తమైనది యగుట నట్లు చెప్పబడవలెను. క్రూరకర్మమైనను సత్ఫలదాయకమే యనెడి విపరీతవాదము నిజమని యొప్పికొనినను యజ్ఞశబ్దముచే పలువిధములగు సత్కర్మలు విధింపబడుచునుండ స్పష్టమగు దోషముతో కూడిన దానినే ఏల కోరవలెను? భగవద్గీత నాల్గవ యధ్యాయమున జ్ఞానయజ్ఞ ముత్తమమని చెప్పబడినది. తైత్తరీయ నారాయణ వల్లీ చివరఖండమున నాత్మయజ్ఞ మనుపేర నీజ్ఞానయజ్ఞమె చెప్ప బడినది. అందుచే విజ్ఞానము కల్మిని చేయబడు యజ్ఞము అక ర్మసిద్ధికైన యీశ్వరోపాసనరూపమగు నదియె యని చెప్ప బడవలెను. దీని పూర్వపు టనువాకమున మనోమయ వివరణ మున వాఙ్మానసములకు తెలియరానివా డీశ్వరుడని చెప్పబడెను. కాన దేహాదిసాధనములతో లోకవిషయములం బ్రవర్తించు చుట్టివాని యందీశ్వరుం దెలియగాంచుటమెట్లు? శబ్దమాత్ర జ్ఞానమున నీశ్వరు నెరింగినట్లెట్లగును? విజ్ఞానమున(నిశ్చయాత్మక బుద్ధివలన) మానసాదుల సంయమనం బొనర్చినమీాద తెలియ బడజాలువా డీశుడని చెప్పబడెను, దేహాదిలోకవిషయముల నిరభిమానియై నిర్దుష్టవిధమున నీశ్వరోపాసన మొనర్చునేని యకర్మసిద్ధికాబడును. దేహము కర్మస్వరూపము, నిరంతరకర్మ కారణము. దీనియం దకర్మత్వ మెట్లుకలుగునన - ఆత్మ కర్మ

రహితుడు అసంగుడు, అయ్యున్నను, దేహాదులయం దభిమానమున కర్మబద్ధుడగుచున్నాడు. నశ్వరములగు కర్మఫలముల నాశించి వానివలని సుఖదుఃఖములను తానే యనుభవించుచు దుఃఖియగుచున్నాడు. ఇట్లు తనయజ్ఞానమునమాత్రమె బంధ దుఃఖము నొందుచున్నాడని దెలసి ఫలాశావిరహితములగు స్వాశ్రమోచితకర్మములం జేయుచు నిర్మలమగు బుద్ధితోకూడి యీశ్వరోపాసన మొనర్చునేని యాతని సాహచర్య సానుభూతి సానందానుభవములవలన నిరహంకారి కాగలడు. అంతియగాని మాటమాత్రమున నకర్మరుడనగు నాత్మను నేననెడి యభిమానమున నకర్మసిద్ధి నొందజాలడు. దేహమున, నవినాభావసంబంధము గలవాడగుట సక్రమపద్ధతులవలనమాత్రమె విముక్తుడగును. దేహమున జేయబడు కర్మములన్నియును ఆత్మప్రేరణముననే జరుగుచుండును. ఆత్మవియోగమున దేహము నందునుకర్మముదోపజాలదు, దేహాత్మలుకలసియున్నంతకాలము కర్మల నాచరింపకతప్పదు. కాన ఫలాశావిరహితమగు సత్కర్మాచరణమున నకర్మ మనంబడును. లోకమున ఫలాపేక్షలేక కర్మమొనర్చు కార్మికుడు వాని ఫలాఫలములంగూర్చి సుఖదుఃఖముల నొందడు. ఫలాశగల యజమాని కర్మ మొనర్పకయు ఫలాఫలములయందలి సుఖదుఃఖముల నొందుచుండును. లోకమున నభిమాన మున్నంతవరకా యా విషయములంగూర్చిన సుఖదుఃఖముల నొందుచుండును. అభిమానము లేని విషయములయం దెట్టిఫలములు కలిగినను వానింగూర్చి విమ

ర్శింపబూనడుకూడ. అట్లగుట కామ్యములయందభిమానముడిగి ఫలాశను విడచినచో నకర్మమనబడును. ఫలాశలేని యారంభ మెవ్వడేనిం జేయునా? యనవచ్చును.

దేహమున సంఘమున జెప్పబడు స్వాశ్రమోచితకర్మ ములొనర్చుచు రాగద్వేషాదులవలన జేయబడవలసిన కర్మలను విడచినచో విధియందీ నహంకారిత్వముగలదు. ఫలాశను విడ చుటవలన సుఖకాగలుగును. కర్మఫలము జేపడుట కనేక కారణములుండుటవలన, నెట్టిసత్కర్మలయందును, మరెట్టి దుష్కర్మలయందునుంగూడ, ఫలమొందవచ్చును. ఫలరహితము కావచ్చును. విపరీతఫలమొందవచ్చును. అట్టియెడ ఫలవాంఛ వలన తానొందునట్టిది దుఃఖమేగాని, ఫలముకాదుగదా. అట్లె రిగి ఫలాశావిరహితమగు కర్మమొనర్చుచుండవలెను. అది యును లోకవిషయములనుడిగి యీశ్వరోపాసన మొనర్చుట వలన అడ్డులేని యానందము నొకసారియేని మచ్చుచూచిన వారు మాత్రి మీలోకసుఖములు తుచ్ఛమని యెంచజాలు దురు. దానివలన కర్మరహితస్థితి నొందగాంతురు. అందుచే నట్టిసుఖదాయకమగు జ్ఞానయజ్ఞ మాచరించిననే విజ్ఞానము సార్థకమగును. కాన దీనికి జ్ఞానయజ్ఞమనుసరమే యుచితమై యున్నది. ఇకనీబుద్ధికర్మములంగూడ జేయుచున్నది. అనదేహ మునగలుగు కామ్యాకామ్యనిషిద్ధకర్మములన్నియుసని యభిప్రా యము. కామ్యములన దేహమునకు ఆవశ్యకములగునట్టివియు,

తనభోగమునకై యుపకరించు పశుపుత్ర మిత్రకళత్రబాంధవా దుల క్షేమమున కలుగునట్టివియు, స్వలాభసిద్ధికై యవిధాన మున ధర్మాధర్మముల దేనినైన యాశ్రయించి వానిని లెక్క-చేయకుండ నాచరించునట్టివియు, ఫలములం జెప్పు శ్రౌతస్మా ర్తాది కర్మములును కామ్యకర్మలనబడును. ఇది రాజసగుణ యుక్తమనఁ డును. అందుచే దంభము, దర్పము, అతిమాని త్వము, క్రోధము, పరుషము, ఆత్మస్తుతి, పరనింద మొదలగు దోషములంగూడి యుండును.

అకామ్యములు:— అహంకారము సాత్వికగుణయుక్తమై పరోపకారము, ధర్మరతి, వినయము, అక్రోధము, నాతిమా నిత్వము, అవికత్థనము, సర్వజీవులయందలి ప్రేమ, అహింస, ఆర్జవము, ఈశ్వరభక్తి, పరిశుద్ధాంతఃకరణము మొదలగునవి కలిగి తనకును లోకమునకును బాధకలుగని విధమున నోసర్ప బడు అస్తేయము, అవ్యభిచారము, అమిథ్యావాదిత్వము, ఆపదలయం దితరులకు సాహాయ్యమొనర్చుట, దానము, జ్ఞానోపదేశము, నీతి, ప్రచారము మున్నగునవి.

నిషిద్ధములు అహంకారము తాను సగుణయుక్తమై రాగము, ద్వేషము, అసహనము, క్రౌర్యము మొదలగుదోష ములతోకూడిన యంతఃకరణము కలవాడై తనకును ఎదిరికిని ప్రమాదకరము సంభవించునట్టివియగు హింస, స్తేయము, వ్యభిచారము మొదలగు సంఘవిద్రోహకరములగు కర్మముల

నొనర్చుచు విచారయుక్తమగు మనసున తనసంబంధముగల యంతవరకు సంఘమునకు దుఃఖమేకలుగఁజేయునట్టివి నిషిద్ధకర్మలనంబడును. ఈమూఁడింట నెద్దానినభిమానించినను బంధహేతువే యగును. కాన నభిమానముడిగి సాత్త్వికముగఁ జెప్పబడు కర్మాచరణమున మేలొందఁగలఁడు.

ఇట్లు సత్త్వరజస్తమో గుణయుక్తములగు కర్మములన్నిటికిని బుద్ధిహేతువనియుం జెప్పఁబడినది. దేవతలందరును విజ్ఞానవంతమును, అన్నిటంబెద్దయగునదియునగు బ్రహ్మమునుపాసించుచున్నారు. అన —

దేవతలన సాత్త్విక ప్రవృత్తికలిగి విజ్ఞానమునొందినవారు. అట్టివారాయీశుని సర్వమునకును జ్ఞానప్రదాతయగు ననంతజ్ఞానియనియు జన్మాదులవలన ఆదిగల జీవప్రకృతులకంటె తనకు జన్మాదులు లేకుండుటంబట్టియు వానిజన్మలకు తానేహేతువగుటంబట్టియు అన్నిట జ్యేష్ఠుడనియు అన్నిటికంటె విస్తారరూపమున బ్రహ్మమనియుం దెలిసి యుపాసింతురు. తదితరవిధముల నుపాసించినను, ఈశ్వరోపాసనమే యొనర్పకయున్నను, వారు దేవతలనబడరు. ధన్యులునుం గాజాలరనియు జెప్పబడినది. ఈవిషయ మీముందువాక్యముల స్పష్టపడుచున్నది.

బ్రహ్మమున ననంతజ్ఞానియని తెలిసినచో మరలనావిశ్వాసమునుండి ప్రమాదము నొందకుండినచో దేహసంబంధమున దోఁచు సర్వదోషములను బోద్రోలి సర్వోత్కర్షల నొందునని

చెప్పబడెను. అనగా బ్రహ్మము ననంతజ్ఞానియని దెలియక అల్ప జ్ఞానియనియు రాగద్వేషాది దోషయుక్తుడనియు పరిచ్ఛిన్న సంసారిత్వములు గలవాడనియుం దెలసి యుపాసించునేని యట్టి రాగద్వేషాదులతో కూడిన ఫలమునే గోరును. అట్టివానినే పొందును. ఈదోషములు లేనివాడని యీశ్వరు నెరిగి యుపాసించిన గదా! తనబుద్ధియందలి యీదోషములు తొలగి విశాలభావము గలవాడగును. అందుచే నీశ్వరు ననంతజ్ఞాని గాని యుపాసింప వలయునని చెప్పబడినది. అట్టిదానివలన ప్రమాదము నొంద కూడదని చెప్పబడినది. అనగా కామ క్రోధములకు సాధనముగా నీశ్వరు నుపాసించుటగాని యనంతజ్ఞానయుక్తమగు దానిం దెలియజాలక విసుగుచెంది విరమించుటగాని చేయరాదని యభిప్రాయము. ఇంద్రియములు బలవత్తరమైనవి యగుట వానిలో నే దేని యొకయింద్రియము తద్విషయమునకు లాగగా దానివెంబడి దిరిగెనేని జ్ఞానమంతర్థానమగును. ఇక నాయొక్క ధర్మయుక్తమగునీకోర్కె దీర్చజాలవా యనియు నాశత్రులను శిక్షింపుమా యనియు నీమొదలగువానితో నీశ్వరుని తనకు రాగద్వేషములకు సాధనముగా నుపాసించునేని యది వ్యర్థము. ఈశ్వరుడు రాగద్వేషాదిదోషయుక్తుచే తెలియబడువాడు కాజాలడు. ఇక రాగద్వేషములచే నారాధించిన వారికట్టిఫలమె కలుగగలదు. ఉపాసనకు రాగద్వేషములు కలిగియున్నను ఈశ్వరునియందవి గలుగజాలవు. కానట్టి ప్రమాధములం బొందకుండునేని దేహసంబంధమున గలుగు

సర్వదోషములు పోగొట్టబడగలవని చెప్పెను. అనగా బంధము వలన కలిగెడిఅల్పజ్ఞానరాగద్వేషాదిదోషములన్నియుపోగలవు. నిరహంకారియైన యీశ్వరోపాసకుడు జీవన్ముక్తుడని చెప్ప బడును. అట్టివానికి ఫలము ఈశ్వరునితోకూడి బంధసంబంధములేని యానంద మొందుటయని చెప్పబడినది.

ఇది ఓంకారమునగల మకారమున చెప్పబడు ప్రాజ్ఞ రూపోపాసనము. దీనికిఫలము మోక్షమనియుం జెప్పబడినది. ఇది విజ్ఞానమయకోశవివరణము.

తస్యైష ఏవ శారీర ఆత్మా । యః పూర్వస్య । తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయాత్ । అన్యోఽన్తర ఆత్మాఽఽనందమయః । తేనైష పూర్ణః । సవా ఏష పురుషవిధ ఏవ । తస్య పురుషవిధతామ్। అన్వయం పురుషవిధః । తస్య ప్రియమేవ శిరః । మోదో దక్షిణః పక్షః । ప్రమోద ఉత్తరః పక్షః । ఆనంద ఆత్మా । బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా ॥ తదప్యేష శ్లోకో భవతి ॥

పూర్వస్య = పూర్వముచెప్పబడిన, తస్య = ఆమనోమయాత్మునకు, శారీరః=తనయందు కలిగిన, యః=ఎవడో (సః= వాడు) ఏషః = ఈవిజ్ఞానమయాత్మ,ఆత్మా=ఆత్మయైయున్నాడు. తస్మాద్వా = దానివలన (కలిగిన) ఏతస్మాత్ విజ్ఞానమయాత్ = ఈవిజ్ఞానమయాత్మకంటె, అన్యః = ఇతరుడగు, ఆనందమయః=

ఆనందమయుడు, అంతరఆత్మా = అభ్యంతరఆత్మ, తేన = ఆఆనందమయునిచే, ఏషః = ఈవిజ్ఞానమయుడు, పూర్ణః=నిండి యున్నవాడు, సః = అట్లుచెప్పబడిన, ఏషః = ఈవిజ్ఞానమయుడు, పురుషవిధఏవ = పురుషాకారము కలవాడే, తస్య = ఆవిజ్ఞానమయునియొక్క, పురుషవిధతాం అను = పురుషవిధత్వము ననుసరించి, అయః=ఈఆనందమయుడు, పురుషవిధః= పురుషవిధము కలవాడగుచున్నాడు. తస్య = ఆఆనందమయునకు ప్రియంఏవశిరః = ప్రియమేశిరస్సు, మోదః = మోదము, దక్షిణఃపక్షః = కుడిభుజము, ప్రమోదః = ప్రమోదము, ఉత్తరఃపక్షః = ఎడమభుజము. ఆనందఃఆత్మా=ఆనందముఆత్మ బ్రహ్మ = బ్రహ్మము, పుచ్ఛం ప్రతిష్ఠా = ప్రతిష్ఠావహామగు పుచ్ఛము, తత్ అపి = ఆవిషయమునుగూర్చి, ఏషః = ఇది, శ్లోకః = మంత్రము, భవతి = అగుచున్నది.

పూర్వము చెప్పబడిన మనోమయాత్మునియందు గలిగిన యీవిజ్ఞానమయుడు పురుషాకారముగలవాడు. అట్లుకలిగిన యీవిజ్ఞానమయునికంటె నన్యుడును, దానియంతరమునగలవాడును అగు ఆనందమయుడు కలడు. ఆనందమయునిచే విజ్ఞానమయుడు పూర్ణుడైయున్నాడు. పూర్ణుడైన యితడు పురుషాకారము గలవాడే యనబడును. అతని పురుషవిధత్వము ననుసరించి యీయానందమయుడును పురుషాకారము గలవాడగుచున్నాడు. అన పూర్వమువలె ఒకదానియందొకటి చెప్ప

బడుట నీవిజ్ఞానమయమును ప్రకృతిపదార్థమేనని చెప్పబడెను. దానిననుసరించి పురుషాకారము నొందిన యీయానందమయుడును ప్రకృతిపదార్థమని తెలియచేయబడెను. అనగా ఆత్మచిత్తముతో కూడిన కారణ శరీర మీయానందమయకోశమని చెప్పబడును. పురేశయన ఇతి-పురుషః అట్లగుట చిత్తమునందు విశ్రమించిన యీతడీ పరంపర యందంతటను విశ్రమించినట్లగును. అందుచే నీకోశములు ఆత్మచే విశ్రమింపబడినవి యగుట పురుషాకారమున వర్ణింపబడినవి. అందిదియ చివరికోశము. ఈకోశముననుండువా డాత్మ. ఆత్మబంధమున నున్నంతకాలము సచ్చిన్మాత్రుడనియు నీశ్వరుని బొందిననే యానందము నొందజాలుననియు జెప్పుచుండ దీని కానందమయకోశమను పేరెట్లువచ్చెనన? ఈకోశస్థుడగు నాత్మ మానసాదులజయించి యీశ్వరు నెరుగుపట్ల మాత్రమే ప్రకాశించును. మరి ఎప్పట్లను ఈకోశమున్నదియనియైన చెప్పనలవికాకుండును. ఈశ్వరోపాశనమున స్వయంప్రకాశుడగు నాత్మ కానందము గలుగగలదు. కాన నాఒకవిషయమున మాత్రమె వినియోగమొందు నీకోశమున కానామము చెప్పబడినది.

ఆ ఆనందమయమునకు ప్రియము శిరస్సు. మోదప్రమోదములు దక్షిణోత్తరపక్షములు. ఆనందమాత్మ. బ్రహ్మము ఆధారముగ గలదియగుచున్నది.

ఈ కోశములందలి గుణము తెరుంగగలిగినవాడు సాత్వికుడై జ్ఞానియై ఆనందస్వరూప బ్రహ్మముంజేరి యానందియగును. కాన నట్లువర్ణింపఁబడినది. సత్వగుణ విశేషమైనది ప్రియము. అది ముఖ్యముగా నాజీవితమున కలిగియుండును. దానింగూడ నభిమానించక యీశ్వరు నారాధించుపట్ల కలుగునట్టి సంతుష్టి మోదమనంబడును. అది విస్తారరూపమున ప్రమోదమనంబడును. ఈశ్వరునియందలి యానందమెరిగి యానందించుట ఆత్మగా పోల్చబడినది. ఈమోద ప్రమోదానందములు కలుగుటకు హేతువు బ్రహ్మమగుటవలన బ్రహ్మ మాధారమని చెప్పబడినది.



# బ్రహ్మవల్లీ-షష్ఠానువాకము

అసన్నేవ సభవతి । అసద్బ్రహ్మేతి వేదచేత్ । అస్తి బ్రహ్మేతిచేద్వేద । సంతమేనంతతో విదురితి ॥

బ్రహ్మ=బ్రహ్మమును, అసత్ ఇతి=అసత్తని, వేదచేత్ = భావించినచో, సః = వాడు, అసన్ ఏవ = అసత్తే, భవతి = అగుచున్నాడు. బ్రహ్మ = బ్రహ్మము, అస్తిఇతి = కలదని, వేద చేత్ = భావించినచో, ఏనం = వీనిని, తతః = అందువలన, సంతంఇతి = సత్పురుషుడని, విదుః = తెలియుచున్నారు. ఇతి యనునది మంత్రసమాప్తి. బ్రహ్మము నసత్తనితలచినచో నాత డసత్తగుచున్నాడు. అనగా అసత్తన తెలియబడనిదియనియు, లేనిదియనియు, ప్రకృతిపదార్థమనియు, అయోగ్యవిషయమ నియుం జెప్పుదురు. తెలియబడనిదియను నర్థమీశ్వరునియందు చెప్పబడును. కాని యీ యర్థమున నీఋషి యీశబ్దమును వాడియుండలేదను కొనవచ్చును. అస్తిబ్రహ్మేతిచేద్వేద యను టంబట్టి అట్లుచెప్పబడవలెను. లేడనునర్థమున కొందరు లేడను వారునాస్తికులు గలరు. వారును లేనివారే యగుదురు. ఏలన? ముక్త్యానంద మీశ్వరుని యందొందదగినదగుటవలనను, ఈశ్వ రోపాసనవలన మాత్రము చిత్తైకాగ్రతకలిగి లోకవిషయము లం దగులువడక నివృత్తి మార్గావలంబులు కాగలుగుటవల

నను, ఈశ్వరుడే లేడనువారు మోక్షమందనలవిగాదు. దాని వలన బంధదుఃఖమును విడువజాలనివాడై నైజముగ జననమరణాదులు లేకున్నను ఆత్మ దేహాదిసంబంధమున జననమరణాది క్లేశముల నొందుచుండును. అందుచే తానును లేనివాడే యన బడును.

ఈశ్వరుని జడపదార్థమనిభావించి సూర్యచంద్ర నక్షత్రాదులనో, పర్వత నదీ నద వృక్షాదులనో, సర్పాదిక్రూరసత్వములనో ధీరజ్ఞానాదియుక్తులగు మనుజులనో, యారాధించుచు వారియందుగూడ ననేకవ్యక్తుల ననేకనామముల మతభేదములచే ప్రతిమారాధనము జేయుచు పరస్పరనిందలతోకూడి యొకరిదైవము నింకొకరునిరసించుచు నప్రమేయునిగ నీశ్వరుం దెలియజాలక, ప్రకృత్యారాధన మొనర్తురు. దానివలన వారొందదగినది ప్రకృతిసంబంధమే. కాన బంధమును బాయజాలక జడరూపులే యగుచున్నారు.

అయోగ్యవిషయమును నర్థమున వామాచారాది నీచవిధానారాధనమున నీచయోని సంజాతులు కాగలరు. ఇట్లే యర్థమునుగైకొనిన నాయర్థమునసే అసత్తనుకొనువాడసత్తగుననుట సార్థకమగుచున్నది.

బ్రహ్మమును కలడని తలంచునేని దానివలన నీతని సత్పురుషునిగా దెలియుచున్నారని చెప్పబడెను. అనగా

పరబ్రహ్మమును స్వచ్ఛనిర్మల నిర్వికారనిత్యానంతానంద, అపరిణామ, అఖండ, అలేపక, సర్వగత, శుద్ధబుద్ధ

ముక్తస్వభావాది విశేషణయుక్తునిగ నెరిగి యారాధించునేని యట్టివాడు మోక్షార్హుడని తలంతురు.

తస్యైష ఏవ శారీర ఆత్మా । యః పూర్వస్య ।

పూర్వస్య=పూర్వము చెప్పబడిన, తస్య = ఆవిజ్ఞానమయునకు, శారీరః=శరీరమునందు కలిగిన, యః = ఎవడు గలడో (సః=వాడు) ఏషః ఏవ=ఈ ఆనందమయుడే ఆత్మా= ఆత్మ యగుచున్నాడు. విజ్ఞానమయాంతర్గతుడగు నానందమయునితో కోశవివరణము సమాప్తి యగుచున్నది.

అథాతోనుప్రశ్నాః । ఉతావిద్వానముం లోకం ప్రేత్య । కశ్చన గచ్ఛతీః । ఆహో విద్వానముం లోకం ప్రేత్య కశ్చిత్ సమశ్నుతా ఉ ।

అథ=పిమ్మట, అతః=దీనివలన అను = అనుసరింపబడిన ప్రశ్నాః=ప్రశ్నములు చేయబడుచున్నవి, అవిద్వాన్ = అవిద్వాంసుడు, ప్రేత్య=మరణించి, అముం లోకం=ఈ పరమాత్మను, కశ్చన=ఒకడైన, గచ్ఛతీ ఉత=పొందునా; లేక పొందడా, విద్వాన్=విద్వాంసుడు, కశ్చిత్=ఒకడును, ప్రేత్య = మరణించి, అము లోకం=ఈ పరమాత్మను, ఆహోసమశ్నుతా ఉ=పొందునా? లేక పొందడా?

పై జెప్పబడినవిషయములవలన నీప్రశ్నములు కలుగునని యనుప్రశ్నము లనబడెను. అవి బహువచనమున రెండు

మాత్రము చెప్పబడినవి. ఆనందమయకోశ మీశ్వరోపాసన మొనర్చువారికిమాత్రము తెలియనగును. ఈశ్వరు నెరుగని వారి కదియులేనట్లు చెప్పబడును. ఆత్మ గుహాయందున్న నీశ్వరు నెరుంగనివారును, ఎరిగినవారును అగు భక్తులు కలిగి యుందురు. వారినిగూర్చి యీ ప్రశ్నలు కలుగవచ్చునని యభిప్రాయము.

## ప్రశ్నలు.

అవిద్వాంసుడు మరణించి యీ పరమేశుని యొకడైనను బొందునా? పొందడా?

విద్వాంసుడు మరణించి యీ యీశుని యొకడైన పొందునా? పొందడా? అను ప్రశ్నలకు ఈదిగువ నీశ్వరుడీసృష్టియొనర్చుటవలన తెలియబడుచున్నాడనియు, ఆతడిట్టి శక్తులు కలవాడనియు వానిని మానవులు తెలియుట కష్టతరమనియు వ్యతిరేకలక్షణముల నభివర్ణించెను. పిమ్మట యను వాకమున ప్రకృతియందీరచన మొనర్పబడగా అది జీవుల కొరకనియు, జీవులయందలి దయవలన నీశు డొనర్చుచు వారి కానందమును గలుగజేయువాడగుట రసస్వరూపుడనియు నీశ్వరుని పొందినవారు మాత్రమె ఆనందము నొందజాలుదురనియుంజెప్పి "యదాహ్యేవైష ఏతస్మిన్నదృశ్యే నాత్మ్యే నిలయనేభయం ప్రతిష్ఠాం విందతే । అధసోభయం గతో భవతి" యని యొకప్రశ్నమునకు సమాధానముగను "యదా

హ్యేవైషఏతస్మిన్నుదరమంతరం కురుతే। అథతస్య భయం భవతి'' అని యొకప్రశ్నమునకును, "తత్త్వేవ భయం విదుషో మన్వానస్య'' యని విద్వాంసులయం దధికారభేదమును గూర్చియు నుత్తరము చెప్పెనని చెప్పుకొనవలెను. అనగా నీశ్వరు నెఱుంగనివా రెవ్వరును ఆతని పొందజాలరు. మాటమాత్రమున కెరిగినవారు ఆతని నుపాసింపక యాతని పొందజాలరు. ఈశుని ఉపాసించుటవలన అనుభవమున దెలియగాంచిన యా యతిలోకప్రతిభాశాలి యగు నాతడుమాత్ర మొందునని చెప్పబడినది. మందమధ్యమ ఉత్తమాధికారభేదము వర్ణింపబడె ననవచ్చును. ఆ మూడువిషయము లట్లుగా దోచును.

మందాధికారులు అనాత్మయం దాత్మభావనముచేసినను, ఆత్మ ననాత్మగా భావించినను, అ సద్విధోపాసన మనబడును. వారింగూర్చి "అథతస్య భయంభవతి'' అని సమాధానము. మధ్యమాధికారులు పరమేశ్వరతత్త్వమును మాటలయందు దెలసి యుపాసింపగోరి పాండిత్యాభిమానమున్నగు దోషముల పరమేశ్వరుని తెలియజాలనివాడును కాక, మాటమాత్రమున దెలిసినను యుపాసింపగోరనివాడును అగువానికి 'తత్త్వేవభయం విదుషోమన్వానస్య'' యనునది ఫలము.

ఉత్తమాధికారి స్వాశ్రమోచితవిధ సత్కర్మానుచరణమును, ఫలాశావిరహితచిత్తమును యథార్థ మెరుంగునట్టి

జ్ఞానమును అచంచలభక్తియుక్తమగు నుపాసనమునుం గలిగిన మీాద ననుభవజ్ఞానమున నానందియగు నాతనికి "అథసోభయంగతో భవతి" యనుఫలము చెప్పబడెననవచ్చును.

సోకామయత । బహుస్యాం ప్రజాయేయేతి । సతపోతప్య
త । సతపస్తప్త్వా । ఇదగ్ం సర్వమసృజత । యదిదంకించ ।
తత్సృష్ట్వా । తదేవానుప్రావిశత్ । తదనుప్రవిశ్య । సచ్చత్య
చ్చాభవత్ । నిరుక్తంచానిరుక్తంచ ॥ నిలయనంచానిలయనం
చ । విజ్ఞానంచావిజ్ఞానంచ సత్యంచానృతంచ సత్యమభవత్ ॥
యదిదంకించ । తత్సత్యమిత్యాచక్షతే । తదప్యేషశ్లోకోభవతి

సః=ఆ బ్రహ్మము, బహు=అనేకముగ ప్రజాయేయ=సృజింపవలయునట్లుగ, స్యాం ఇతి=కావలయునని, అకామయత=కోర్కెను సంకల్పించెను. సః=ఆ బ్రహ్మము తపః=తపమును అతప్యత=చేసెను. సః=అతడు, తపఃతప్త్వా=తపమొనర్చి ఇదంసర్వం=ఈ సర్వజగత్తును, అసృజత=సృజించెను. యత్=ఏది, ఇదంకించ=ఈ రచింపబడినది గలదో, తత్ = దానిని, సృష్ట్వా=సృజించి, తత్ ఏవ=ఆ రచించినదానినే, అను=అనుసరించి ప్రావిశత్=ప్రవేశించెను. తత్=దానిని, అను= అనుసరించి ప్రవిశ్య=ప్రవేశించి సత్ చ = నిత్యస్వరూపుడగను, త్యత్ చ=అవ్యక్తరూపముగను, అభవత్=ఆయెను, నిరుక్తంచ=

చెప్పబడగలవాడుగను, అనిరుక్తంచ = చెప్పజాలని యట్టివాడు గను, నిలయనంచ = సర్వమునందు గలవాడుగను, అనిలయ నంచ = ఆశ్రియరహితుడుగను, విజ్ఞానంచ = అత్యంతజ్ఞానిగను అవిజ్ఞానంచ = తెలియబడజాలని యట్టివాడుగను, సత్యంచ = సత్యస్వరూపుడుగను, అనృతంచ=కలుగుటయె కల్లయట్లుదోచు వాడును, సత్యం = ప్రకటీకృతసత్యస్వరూపుడుగను, అభవత్ = ఆయెను. యత్ = ఏ, ఇదంకించ = ఈచెప్పబడిన దంతయునగు బ్రిహ్మముకలదో, తత్ = అది, సత్యంఇతి = సత్యవిషయమని ఆచక్షతే = పలుకుచున్నారు, తత్ అపి=ఆవిషయమునుగూర్చి, ఏషఃశ్లోకఃభవతి = ఇది మంత్రిమగుచున్నది. (ఈవ్రికృతిని) అనేకవిధములుగ రచింపవలెననెడికోర్కి యాపరమేశుని యందు కలిగినది. దానికై యాతడుతపముంజేసెను. అతడుతపముంజేసి యీసర్వమును సృజించెను. ఏది యీజగద్రూపమునగలదో దానినంతను సృజించి, దానినేఅనుసరించి ప్రివేశించెను. దాని ననుసరించి ప్రవేశించి నిత్యుడుగను అవ్యక్తపదార్థముగను ఆయెను. అన

ఈశ్వరుడు కలడని ఎట్లుచెప్పవలయునో నాతడెట్టివాడో సంగ్రిహముగ నిందువివరించెను.

సర్వకర్తయును, సర్వవిదుడును, సర్వవ్యాపకుడును, శాసకుడును అగునీశ్వరుడు దీనినిరచింపగోరెనన. ఆతనికికోర్కె యేల? అనుప్రశ్న ము కలుగుచున్నది.

అతడు దేహధారణము చేయనివాడు. కాన దేహసంబంధముండదు. బంధములేని యనంతజ్ఞానియగుట రాగద్వేషాది దోషము లాతనియందు చెప్పబడజాలవు. అత డింకొకరి శాసనము గలవాడు కాజాలడు. నైజమన సృష్టిస్థితి ప్రలయములను భేదావస్థలనెరిగి వానింజేయునట్టి యనంతజ్ఞానము తెలియబడుచున్నందున నైజమనరాదు. దీనివలనపొందనగు మేలొండు లేదు. కాన గుణదోషములును, లేక, స్వలాభమునులేక, విధియునులేక చేయునట్టిది జీవులయందలి కోర్కెవంటిది కాజాలదు. సత్సంకల్ప మాత్రమేనని చెప్పబడవలెను. అట్టిసంకల్పము మాత్రమాతని కేల? యన.

ప్రకృతి పరమాణుస్థితి యందుండుటయును, ప్రకృతి పరమాణువులసంఖ్యతో సరిపోల్పజాలు సంఖ్యగల జీవులుకూడ నట్లుండుటయుం జూచి యీకోర్కె కలుగుచున్నదనవలెను. జీవు లల్పజ్ఞులగుట ప్రకృతినిబొంద నిశ్చయింతురు. అట్లుపొంది భోగప్రధానబుద్ధులు ప్రకృతిబంధమునబడియుందురు. వైరాగ్య విజ్ఞాన ఈశ్వరోపాసనము లలవడినవారు ముక్తులగుదురు. అందుచే నీరచన జీవుల భోగాపవర్గముల కగుచున్నది. కానదయామయుడగు నాపరమేశుడు జీవులకొరకు సృష్టిసంకల్పముం జేసెననవలెను. ప్రకృతిరచనము నందీతని కర్తృత్వమెట్లుచెప్పబడునన; జీవులల్పజ్ఞులును, ప్రకృతిజడమును, అగుట వారియందీ శక్తి కలదనరాదు.

నైజమనిన నక్రమవిధానమున సృష్టిస్థితిప్రలయములను భేదావస్థలు కలుగుటవలన స్వభావమనియు స్వయంకర్తృకమనియు చెప్పరాదు.

ఈశ్వరుడిట్లు మాయావరిచ్ఛిన్నుడై యిట్లుదోచునేగాని నిజముకాదనిన.

ఈశ్వరునికంటె మాయగొప్పదియై యాతనినాక్రమించి యఖండుని ఖండునిగను అనంతుని బరిచ్ఛిన్నునిగను నిత్యముక్తుని బద్ధునిగను జేయుచున్నదనవలెను. ఇక నీశుడు తరింపలేని సంసారియగును. ఇది యనాదినుండి నేటికిని దోచుచున్నది. దానంజేసి యికముందుగూడ నిట్లేయుండగలదని తెలియబడుచున్నది. కాన నసత్యమనుటయును వ్యర్థము.

భ్రాంతియనన భ్రాంతిగలుగుట కన్యపదార్థ ముండవలెను. ఈశ్వరునికే భ్రాంతికలిగినదన దానిం జెప్పువాడుండరాదు. ఆతడు తరింపజాలడు. భ్రాంతికి హేతువు దోపజాలదు. ఈశుడనంతజ్ఞాని యనబడజాలడు. దేనివలన నాతడీభ్రాంతి నొందెనన సమాధానముండదు. భ్రాంతి జ్ఞానవృత్తియై ఎరిగినపదార్థములను తారుమారుగ దలంచునట్టిది యగుట దీనినిభ్రాంతి యనుటయె భ్రాంతియగుచున్నది.

సృష్టికి కారణమే లేదనిన కారణములేని కార్యముకలదనుట అహైతుకము. దానింజెప్పుట యవివేకము. అట్లుచెప్పుటకు ప్రమాణమేర్పడదు. దృష్టాంతముండదు. యుక్తిచెప్పబడదు. అనుభవ మసలే యుండదు. కాననదివ్యర్థము.

శూన్యమే సృష్టి హేతువనినను పై కారణములచే నదియు ఉన్మత్తాలాపములవంటి దనవచ్చును.

క్షణికమనినను క్షణములో మార్పొందునట్టివాడు దీని నెరిగి క్షణికమనుటెట్లు? కానవానికిని ప్రమాణదృష్టాంతములు కలుగ జాలవు.

విజ్ఞానమాత్రమన పదార్థములేని నానాత్వకల్పనము విజ్ఞానమునందెట్లు వచ్చును. పదార్థములేని జ్ఞానమెటనుండి రాగలదు. విజ్ఞానము పదార్థమగుటెట్లు? కాన విజ్ఞానమాత్ర మనరాదు.

ఈశ్వరుని యిచ్ఛవలన నిట్లు కల్పించుచున్నాడనిన అనంతజ్ఞానియగు నాతడిట్టి యవివేకకల్పనము జేయుచున్నా డనుట నిరాధారవిషయము. కాక కల్పితజీవులనిత్యులగుట బంధమోక్షములు గలవనరాదు. కల్పితప్రకృతి యనాద్యనంత మనరాదు. అట్లు కల్పించుచు మాయించుచునున్నాడనుట కూడ యుక్తిప్రమాణ విరోధమనబడును.

ఒకజాతినుండి మరియొకజాతి గలుగుచు ఒకదానినుండి వేరొకటి కల్గుచుండునన అదియు నసత్యవిషయ మనకతప్పదు. నేటికిని కలజాతులయం దాజాతియె గల్గుచున్నది. కారణము ననుసరించిన కార్యమే కలుగుచుండుట ప్రత్యక్షవిషయము. ఒకజాతి జీవులతో నింకొకజాతి సంయోగముకలిగినచో వేరొక జాతి కలుగవచ్చునన, మొదల రేతోరక్తములు సంయోగింప బడగల సమానధర్మములు గలజాతివై యుండవలెను. పిమ్మట

కలసిన నారెంటియందలి ధర్మములునుకలసి వేరొకజాతివలె దోచవచ్చునేమో? కాని జాతియందన్యజాతి కలుగజాలదు. కాన నత్యంతమగు నియమముతో దోచుచున్న దీసృష్టియన వలెను. కాన దీనికి నియంతకలిగియుండవలెననియు నాతడనంత జ్ఞానియై యుండవలెననియు చెప్పబడవలెను.

విద్యుచ్ఛక్తివలన పరమాణుసంయోగము కలిగి యీ రూప మేర్పడుచున్నదన- అది యసమంజసము. విద్యుత్తు ప్రత్యేకపదార్థముకాదు. పదార్థములయందలి గుణమన వచ్చును. కాక దానికిని జ్ఞానమనుగుణము దోపదు. కావ నియమబద్ధమగు సృష్టి దానివలన కాబడజాలదు. కాక దాని వలన చేతనసృష్టి కాబడుట యసంభవము. అట్లు నియమమే లేని సంయోగవియోగములు కలదియైన ప్రత్యేకభూతములును వాని ప్రత్యేకగుణములను కలిగి యాభూతములుకల యంత కాల మట్లేయుండి వానివలన జీవభూతసృష్టి యొనర్పబడుచు ననేకమండలములు గలిగి అవి పరస్పర సమాకర్షణమున గతి కలవియై తనకు జ్ఞానము లేకయున్నను నియమబద్ధమై దోచుచున్న దీసృష్టి. కాన దీని నంతను నిండి యనంతజ్ఞాన వంతమగు బదార్థ మొండుగలదనియు. దానివలన నిట్లు కా బడుచున్నదనియు, చెప్పకయ చెప్పుచున్నది. అందుచే నీశుడు కలడనియు, కల ప్రకృతి నిట్లు రచించుచున్నాడనియు చెప్ప వలెను. అట్టి యనంతజ్ఞానశక్తులవలన కాబడదగిన దీసృష్టియగు టవలన ఈశ్వరు డట్లు సంకల్పించెను. దానింగూర్చితపించెను. అనగా యోచించెను. అట్లు యోచించి దీనినంతను రచించెను. అని చెప్పబడెను.

అట్లు రచించిన దీని ననుసరించి ప్రవేశించెనన-

అనంతుడగు నీశునియందు రాగశోకలు చెప్పబడవు. మరేమన సర్వవ్యాపకుడగు తాను రచించి దానియందే గలడు. కాని రచింపబడినదానిని పాలించుచున్నాడని యభిప్రాయము. అట్లు ప్రవేశించినయాతడు దీని రచనాదులవలన నిట్టివాడని తెలియబడుచు మానవుల కింద్రియాదులవలన తెలియబడ రాని వాడగుటవలన నీక్రిందిరీతిని వర్ణింపబడెను. "సచ్చత్య చ్చాభవత్ - సత్ =నిత్యపదార్థము. అనగా ఎల్లపుడును కలిగి ఎన్నడును మార్పొందక యొకేరీతి నుండునట్టిది. త్యత్ = ఇంద్రియాదులచే నెరుగరాని సూక్ష్మత్వానంతత్వాదులు గలది యని చెప్పబడును. సృష్ట్యనంతరము జీవులచే నిట్లు చెప్ప బడును. కాన నట్లయ్యెనని చెప్పబడినది.

"నిరుక్తంచ అనిరుక్తంచ" ఈ సృష్టినిగాంచిన నిట్టి వాడు కలడని చెప్పబడదగినవాడు. స్వర్ణాలంకారమును గాం చిన దానికర్తయొక్క నేర్పును బుద్ధివిశేషమును అందులకైన పనిముట్లను ఊహింపగలుగుచున్నారు. ఇది యొకపుడైన ప్రత్య క్షమున నెరుంగజాలుచున్నారు. కాన సులభముగ తెలియ గలరు. విశ్వమునంతనుంగాంచి దాని యందలి రచనావిశేష మున కర్తయగు వానియందలి జ్ఞానశక్తు లిట్టివని స్పష్టముగ చెప్ప నలవియగుట నిరుక్తమని చెప్పబడినది. జీవులాపర బ్రహ్మమును తమయింద్రియాదుల నెట్లునువెవరును ఎన్నడును తెలియజాలరు. కాన అనిరుక్తమ్మని చెప్పబడినది.

"నిలయనంచ అనిలయనంచ—" సర్వపదార్థములయం దును నిండియున్నవాడగుట నిలయనుడని చెప్పబడును. అట్లు నిండియున్నను దేనియాధారమైన బొందక సర్వమునకును తా నాధారమగునట్టివాడగుట ననిలయనుడని చెప్పబడినది.

"విజ్ఞానంచ అవిజ్ఞానంచ—" అనంతజ్ఞానియగుట విజ్ఞాన స్వరూపుడనియును, జీవులను బోలిన సాధనయుక్తమైన అల్ప జ్ఞానము లేనివాడగుట నవిజ్ఞానస్వరూపుడనియును, చెప్ప బడును.

"సత్యంచ అనృతంచ సత్యం అభవత్"=నిత్యుడై యె న్నడెట్టిమార్పును బొందనివాడగుట సత్యస్వరూపుడనియును స్థూలసూక్ష్మభూతసంపర్కము లేనివాడగుట నాతడు కలడను టతో జీవులకు కల్లవలె దోచువాడునగుట అనృతస్వరూపుడని యును అట్లనుమానింప నావశ్యకము లేకయే ఉపాసకులచే స్పష్టముగ దెలియబడుచున్నవాడగుట మరల స్పష్టముగ సత్య స్వరూపుడే అగుచున్నాడనియును జెప్పబడెను.

"యత్ ఇదంకించ"- పైవిశేషములం జెప్పబడు నే బ్రహ్మము కలదో-

"తత్ సత్యం ఇతి ఆ చక్షతే" దానిని సత్యస్వరూప మని చెప్పుచున్నారు, అనగా నెట్టిసంశయమును చేయనక్కర లేని సత్యస్వరూపమనియందరును ఒప్పుకొనుచున్నారని యభి ప్రాయము. ఆవిషయమునుగూర్చి యిది మంత్రమగుచున్నది.

# బ్రహ్మవల్లీ - సప్తమానువాకము

అసద్వా ఇదమగ్ర ఆసీత్ - తతో వై సదజాయత । తదాత్మా నగ్ం స్వయమకురుత । తస్మాత్తత్సుకృతముచ్యత ఇతి । యద్వై తత్సుకృతం । రసో వై సః । రసగ్ం హ్యేవాయం లబ్ధ్వాఽఽనందీ భవతి । కో హ్యేవాన్యాత్కః ప్రాణ్యాత్ । యదేష ఆకాశ ఆనందో న స్యాత్ । ఏష హ్యేవాఽఽనందయాతి । యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యే నాత్మ్యే నిరుక్తే నిలయనే భయం ప్రతిష్ఠాం విందతే । అథ సో భయంగతో భవతి । యదా హ్యేవైష ఏతస్మిన్నుదరమంతరం కురుతే । అథ తస్య భయం భవతి । తత్త్వేవ భయం విదుషో మన్వానస్య । తదప్యేష శ్లోకో భవతి ।

ఇదం=ఈ ప్రపంచము అగ్రే=సృష్టిపూర్వము అసత్ వై=అవ్యక్త ప్రకృతిగ, ఆసీత్=అయి యుండెను తత వై= దానివలననే సత్=రూపవంతమైన జగత్తు అజాయత=పుట్టెను. తత్=ఆ జగత్తును, ఆత్మానం = ఆత్మను గూర్చి (జీవాత్మల కొరకు) స్వయం అకురుత=ఆ బ్రహ్మము స్వయముగ చేసెను, తస్మాత్=అందువలన, తత్=అది, సుకృతం ఇతి=సుకృతమని

ఉచ్యతే=చెప్పబడుచున్నది. సుకృతం=సుకృతమొనర్చిన తత్=ఆ బ్రహ్మము యత్ వై=ఏదికలదో, సః=అది రసః వై=ఆనందరస స్వరూపమెగదా! అయం=ఈ దేహి, రసం ఏవ=లబ్ధ్వా ఆనందరసస్వరూపమును పొందియే. ఆనందీభవతి హి=ఆనందము గలవాడగుచున్నాడుగదా. యత్ ఏష [illegible] ఆనంద[illegible] ఆనందమయుడు ఆకాశే=హృదయాకాశమున నస్యాత్=లేనిచో, కః హి ఏవ [illegible] అన్యాత్ అపానచేష్టను చేయును? కః=ఎవడు, ప్రాణ్యాత్=ప్రాణచేష్టను చేయును? (జీవముకలవా డగును?) ఏషః ఏవ=ఈ ఆనందమయుడే ఆనందయాతి హి=(జీవ లోకమును) సుఖింపజేయుచున్నాడుగదా! యదా హి ఏవ [illegible] అదృశ్యే=కనబడనియట్టియు, అనాత్మ్యే=[illegible] నట్టియు, అనిరుక్తే=చెప్పబడజాలని యట్టియు, అనిలయనే= ఆధారరహితుడగునట్టియు, ఏతస్మిన్=ఈ ఆనందమయ బ్రహ్మము నందు, అభయం=భయరహితమైన, ప్రతిష్ఠాం=స్థితిని, విందతే=పొందుచున్నాడో, సః=వాడు, అథ=పిమ్మట, అభయం= అభయమును, గతః భవతి=పొందినవాడగుచున్నాడు. యదా= ఎప్పుడు, ఏషః=ఈభక్తుడు, ఏతస్మిన్=ఈ పరబ్రహ్మమునందు, ఉదరం=ఒకదానియందుదానిగను, అంతరం=భేదస్యమునను, కురుతే హి=చేయుచున్నాడో(తలచుచున్నాడో) తస్య=వానికి, అథ= పిమ్మట భయం భవతి=భయముకలుగుచున్నది. [illegible] [illegible] చింతనముచేయుని [illegible] తత్ తు ఏవ భయం=అదే భయము, [illegible]

[illegible]

ఆవిషయమునుగూర్చి ఏషః=ఇది శ్లోకః=మంత్రము, భవతి=అగుచున్నది.

ఈ దృశ్యప్రపంచము సృష్టిపూర్వము అవ్యక్తప్రకృతిమై యుండెను. దానివలన నామరూపాదులుగల జగమంతయు పుట్టెను.

అనగా సృష్టికి ఉపాదానకారణమగు ప్రకృతికలదనియు అదియే జగము పుట్టుటకు కారణమని స్పష్టపరుపబడినది. ఇందు అసచ్ఛబ్దము వాడినందునకూడ ప్రకృతినే గ్రహింపవలసియున్నది. దీనియందు "అజాయత" యనుశబ్దము వాడబడినది. ముందు "అకురుత" యని చెప్పబడెను. అట్లు స్పష్టమగు క్రియాపదములు వాడబడినవి.

ఆ జగత్తును జీవాత్మలనుగురించి యా పరమేశుడు స్వయముగ కేసెనని చెప్పబడినది. అనగా-

జగద్రచనము జీవుల భోగాపవర్గములకై దయామయుడగు నీశు డొనర్చెనని యభిప్రాయము. ఇందు ఆత్మానమ్మని జాతి పరత్వ మగుట నేకవచనము చెప్పబడినది. ఈశ్వరుడు స్వయముగ నొనర్చెనన సృష్టిపూర్వము తానొకడేజ్ఞానశక్తులు కలవాడు. జీవు లజ్ఞానావృతులై యుందురు. వారిజ్ఞానము సాధనసాధ్యము. ఈశ్వరుడు సాధనము లక్కరలేని జ్ఞానశక్తులుకలవాడు. అదియుంగాక జీవసృష్ట్యనంతరము జీవులకు కమపరిమితియందలి కర్తృత్వమును దానివలన పరంపరాసృష్టిక్రమ

మును కలుగుచున్నదగుట నా డా యీశ్వరుడు దీనిని స్వయముగ రచించెనని చెప్పబడినది.

అందువలన నది సుకృతమని చెప్పబడినది. అన పుణ్యకర్మయని చెప్పబడినది. సుకృతం=పుణ్యకర్మయనియు అనంతమగు కర్మయనియుం జెప్పవచ్చును. జీవులయందలి దయచే నిట్లు చేసినవాడగుట పుణ్యకర్మయనియు నతివిశాలమగు భూతోత్పత్తి కలదియగుట ననంతకర్మమనియు చెప్పవచ్చును.

సుకృతముగల ఆబ్రహ్మమేదికలదో అది రసస్వరూపమె గదా- అనగా-

దయామయు డీశుడగుట నీజగద్రచన మొనరించెనని నిర్ణయింపబడుచున్నది. అది జీవులచే నొందదగిన యానందరసమని చెప్పబడెను. రసమన సారమనుయర్థము ఇప్పట్ల చెప్పుట వ్యర్థము. అట్లని ముందు వాక్యమున తెలియనగును.

ఈ దేహి ఆనందరసస్వరూపబ్రహ్మమును పొందియే ఆనందముగలవా డగుచున్నాడు గదా! యనుటలో-

జీవాత్మ యీశ్వరు నెరిగినవాడుమాత్రి మాయీశ్వర సాహచర్యమున నానందియగుననియు అందుచే జీవుడు స్వయముగ నానందము లేనివాడనియు నీశ్వరుంగూడక మరెట్లును ఆనందమును బొందజాలడనియు నభిప్రాయము. లేక జీవుల భోగమునకై ప్రకృతిని రచించినవా డీశుడగుట భోగములం

దలి సుఖమునకును నీశుడేకారణము. అపవర్గమున నాసంబంధమున కాతడే కారణము. కానసర్వజీవుల సుఖమున కాతడే కారణమనినిశ్చయమైన జెప్పవచ్చును.

ఏ యీ ఆనందమయుడు హృదయాకాశమున లేనిచో ఎవడపానప్రాణకర్మలను చేయజాలును? అనగా.

జీవులకు కావలసిన ఉపకరణములం గల్పించి వానిని తానే రక్షించుచున్నాడు. కావున జీవులకు జీవన మేర్పడుచున్నదని యభిప్రాయము.

ఈ ఆనందమయుడే జీవలోకమును సుఖింపజేయుచున్నాడుకదా! అన

సర్వవిధముల నా యీశ్వరునివలననే జీవులు సుఖమొందగలుగుచున్నారని నిశ్చయపరుపబడుచున్నది. (దేహి) ఎప్పుడైతే కనబడనియట్టియు, శరీరరహితుడగునట్టియు, చెప్పబడరానియట్టియు, ఆధారరహితుడగునట్టియు ఈఆనందమయ పరబ్రహ్మమునందలి యభయస్థితిని పొందుచున్నాడో వాడు పిమ్మట అభయమును పొందినవాడగుచున్నాడు.

అనగా సూక్ష్మ అజన్మ అప్రమేయ ఆధారరహితాది విశేషణయుక్తుడగు నాపరబ్రహ్మము నుపాసనవలన దెలిసి నిత్యముక్తుడగు నాతనియానంద మెరిగి పొందుచున్నవాడెవ్వానేని దేహము విడచినపిమ్మట నాతడు బంధభయములేని మహాత్మానందము నొందునని యభిప్రాయము. ఇది విద్వాంసులయందలి యుత్తమాధికారియొక్క ఫలము.

ఎవుడీ భక్తుడీ పరమేశ్వరునియందు పరిచ్ఛిన్నత్వ నానాత్వ కల్పనము జేయుచున్నాడో వానికిపిమ్మట భయము కలుగుచున్నది. అనగా పరమేశ్వరు నెరుగజాలక తనతో సాటి యగు రూపకల్పన మొనర్చి సంసారిత్వాదిదోషము లంటగట్టి వాని నుపాసించునో ఆతడు మృత్యుసంయుతసంసారమునబడి బాధభయము గలవాడని చెప్పబడును. ఇది మందాధికారి యొక్క ఫలము.

బ్రహ్మచింతనము చేయనిపండితునకునూ అదేభయము కలుగుచున్నది. అనగా-

వేదాది సచ్ఛాస్త్రములం జదివినవాడయ్యునూ పాండిత్యాద్యభిమానము కలవాడై యీశ్వరచింతన మొనర్పని విద్వాంసుడు కూడ చదివినది వ్యర్థము కాగా మందాధికారిపొందిన ఫలమగు మృత్యుసంయుత సంసారభయమునే పొందునని యభిప్రాయము. ఇది మధ్యమాధికారి విషయము.

ఇట్లు జీవేశ్వర ప్రకృతులపరిత్యేకత్వమును వానికిగల పరస్పర సంబంధమును ఇందు చెప్పబడెను.

# బ్రహ్మవల్లీ-అష్టమానువాకము.

భీషాస్మాద్వాతః పవతే । భీషోదేతిసూర్యః । భీషాస్మాదగ్నిశ్చేంద్రశ్చ । మృత్యుర్ధావతిపంచమ ఇతి ॥

అస్మాత్ = ఈపరమేశ్వరునివలన భీషా=భయముచే వాతః=గాలి, పవతే=వీచుచున్నది. సూర్యః = సూర్యుడు, భీషా=భయముచేత, ఉదేతి=ఉదయించుచున్నాడు. అగ్నిశ్చ= అగ్నియును, ఇంద్రశ్చ=ఇంద్రుడును, అస్మాత్=ఈ బ్రహ్మము వలన, భీషా=భయముచేత, (స్వకార్యప్రవర్తకులగుచున్నారు) పంచమః మృత్యుః=అయిదవవాడగు మృత్యువు, (ఈ బ్రహ్మము వలన భయముచేతనే) ధావతి=(స్వకార్యమున) బర్వెత్తు చున్నాడు.

ఈ బ్రహ్మమువలన భయముచే గాలి వీచుచున్నది. సూర్యు డుదయించుచున్నాడు. అగ్ని వేడిమి వెల్తురులనిచ్చు చున్నాడు. ఇంద్రుడు వర్షింపజేయుచున్నాడు. అయిదవవాడగు మృత్యువు జీవులకు దేహవియోగముకల్పించుచున్నది.అనగా- అన్ని మండలముల యందుగలిగి వానికి బలకరమై సర్వ జీవుల కాధారమై పారిశుధ్యహేతువై అగ్న్యాదులకు బ్రభవ కారణమగుచున్న గాలి పరమేశ్వరు శాసనమున వీచు చున్నది.

అనేక మండలములతో కూడిన ఒకపరిధిని ప్రకాశింపచేయుచు, వానిగతికి తానాధారమగుచు ఆమండలముల నన్నిటంగల జీవులకు తానుజ్జీవనకరుడగుచు, దీనర్చు సూర్యు డాతని శాసనముననే బ్రిపర్తించుచున్నాడు.

వేడిమివెల్తురును గలిగించు నగ్ని యాతని భయము చేతనే స్వకార్యనిర్వహణ మొనర్చును.

మేఘములకు కారణమగు నింద్రుడు ఆతనిభయమున వర్షింపజేయుచున్నాడు.

అయిదవ వాడగు మృత్యువు జీవుల నంతమొందించు చున్నదన దేహమున కల్గు నాల్గవస్థలకును నాల్గాశ్రమముల కును వేరె ఉపసంహారరూపమగు మృత్యువైదవది యనుకొన వలెను. అది జన్మించినంతనె ఆశ్రయించునట్టి దీమృత్యువు. జన్మమే మృత్యుకారణ మనబడును. ఇది కాలమనుపేరిట నా పరమేశ్వరశక్తియే యనవచ్చును. ఇక నకాలమృత్యువను నది అంటురోగములు క్రూరమృగముల బారిపడుట, హంతకులు శత్రువులు అగువారికిం జిక్కుట, జలాది భూతోద్రేకము మున్నగునవి. ఇట్లు కలిగిన మహాభూతములు సైత మా పర మేశ్వరు శాసనమున బ్రవర్తిల్లుచున్నవని చెప్పబడెను. షష్ఠా ధ్యాయమున నీశ్వరుడున్నాడని చెప్పుటెట్లు? ఎట్టివాడో చెప్ప బడెను. సప్తమాధ్యాయమున జీవేశ్వరప్రకృతుల వేర్వేరుపదా ర్థములనియు, సృష్టిరచనమునకును జీవుల భోగాపవర్గములకును ఈశ్వరుడు కారణమనియును, భక్తులయందలి భేదములనుబట్టి

వారివారి యోగ్యతలననుసరించి యీ యాత్ముడు ఫలమొసంగువాడని యుం జెప్పబడెను. అష్టమానువాకమున నాయీ యాత్ముని బ్రహ్మానందమునకు సర్వానందములు బిందువర్తిల్లుచున్నదని చెప్పబడెను. ఇకస్తి యనువాకమున మోక్షానందమిట్టిదని విమర్శింపబడును.

ఉ. సైషానందస్య మీమాంసా భవతి। యువా స్యాత్సాధు యువాధ్యాయకః। ఆశిష్ఠో దృఢిష్ఠో బలిష్ఠః। తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణా స్యాత్। స ఏకో మానుష ఆనందః॥

టీ. సాశి (పరమేశ్వరుని పొందినవానియొక్క) ఆనందస్య = ఆనందముయొక్క మీమాంసా = విమర్శ, ఏషా = ఇది, భవతి = అగుచున్నది. యువా = యువకుడును సాధుయువా = సాధుస్వభావముగల యువకుడును అధ్యాయకః = చదువుకొనినవాడును, ఆశిష్ఠః = మంచి ఆశయములు కలవాడును, దృఢిష్ఠః = మనోదార్ఢ్యము కలవాడును, బలిష్ఠః = శరీరబలము కలవాడును, స్యాత్ = అగుచున్నాడో, తస్య = వానికి. ఇయం పృథివీ = ఈ భూమి సర్వా = అంతయును విత్తేన = ధనముతో పూర్ణా = పూర్ణమైనది, స్యాత్ = అగుచున్నదో, సః = అది ఆనందః = ఆనందము ఏకః = ఒకటియగు మానుషః = మనుష్యసంబంధమైనది అగుచున్నది.

తా. ఆ పరమాత్మానందముయొక్క మీమాంస ఈ చెప్పబడ్డ వదియగుచున్నది. యువకుడును సాధుయువకుడును, మంచి యాశయములు కలవాడును, మనోదార్ఢ్యమును దేహదార్ఢ్యమును కలవాడును, అగుచున్నవాడో, వానికి యీ భూమి యంతయు

యును ధనముతో నిండినది యగుచున్నదో, అట్టిదియగు ఆ ఆనంద మొకటియగు మానుషానంద మనబడుచున్నది. అనగా- అవస్థలలో యౌవనము సర్వభోగోపయుక్తమై యుండును. అందు సాధుత్వముకలిగెనేని మిక్కిలిసుఖము కలుగును. లోకమున రాజసతామసముల నవలంభించినవారికంటె సాత్విక మవలంభించినవారు సుఖింతురు. అందుచే సాధుయువకుడు కావలెనని చెప్పబడెను. అందు మంచియుద్దేశములు కలవాడును, మనోబల దేహబలములుకలవాడును, సర్వసంపదలతో కూడిన మహీమండలాధిపత్యము కలిగినను, ఇదియొక మనుష్యానందమని చెప్పబడినది. మానవులయందు కోరతగిన వన్నియుం గలిగిన నిదియొక యానందమనెను. ఇటుపైని నూరురెట్లధిక మగునట్టి యానందములు 11 తరగతులుగ వర్ణింపబడును. అధికము చెప్పుట నల్పము నిందించబడుచు రాగ పూర్వపూర్వము లన్నియు నిషేధింపబడెననవచ్చును. అందీమనుష్యానందము మొదలనే నిరసింపబడుచున్నది. ఏలన? ఇదియశాశ్వతమై యశాశ్వతమగు దేహమునకు సంబంధించినదియగుట నట్లు చెప్పబడెను.

మహాకవులు మహాపండితులు మహాత్ములు మహారాజులు మహావీరులు ఈగుణవిశేషములచే చెప్పబడనివారును సర్వజీవులునుగూడ నాయా యాయుఃపరిమితికి మించకుండ నంతమొంది తీరవలెనుగదా! మనుజుని యాయుఃపరిమితి నూరువత్సరములందురు. అదియును నిండకుండగనే మరణింపవచ్చును. అనాద్య

నంతమగు కాలమున నీనూరుసంవత్సరము లోకలెక్కయా? మరణించినతోడనే యీసంపదల సంబంధమును బంధుమిత్రాదుల సంబంధమును సర్వమును సమసిపోవును. మరలనెన్నడును వానిసంబంధము గలుగబోదు. అదియటుండ తానుండగనే సంపదలును బోవచ్చును. మిత్రులు శత్రులుకావచ్చును. అదియటుండ తానును సంపదలును కలిగియున్నను రోగాదులు మొదలగు నంతరాయములవలన ననుభవయోగ్యములు గాక పోవచ్చును. అనుభవక్షీణములగు కొన్నిటిని మరల పొందజాలకపోవచ్చును. యౌవనము వార్ధకముచే మ్రింగబడి యెన్ని సంపదలున్నను, సంతాపము కలిగించును. పరివారము పరిసంఘులై బాధనొసంగవచ్చును. సంపదలభద్రతకై దైన్యమొందవలసివచ్చును. ఇట్లనేకవిధముల బాధాప్రదమగును. గాన నీలోకసంపదలయందలి యానందము మొదలనే నిషేధింపబడినది.

తేయేశతంమానుషాఆనందాః । సఏకోమనుష్య గంధర్వాణా మానందః । శ్రోత్రియస్య చాకామహతస్య।

తే = ఆ, శతం = నూరగు, మానుషాఆనందాః=మనుష్యానందములు, యే=ఏవియో, సః=ఆయానందము, మనుష్య గంధర్వాణాం = మనుష్య గంధర్వులయొక్క, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందము (అగుచున్నది) అకామహతస్య= కామముచే గొట్టబడని, శ్రోత్రియస్య చ = మరియుశ్రోత్రియుడగువానికిని

శ్రోత్రియత్వమును అకామహతత్వమును గలవానికి ఆమనుజసంబంధియగు నానందములు నూరగునవెవ్వియో ఆయానందము మనుష్యగంధర్వులయొక్క ఒకటియగు ఆనందమగునని చెప్పబడినది. అనగా-

పైజెప్పిన మానుషానందమట్లు నిషేధింపబడగా శ్రోత్రియత్వాకామహతత్వములవలన భక్తునకు నూరుమడుంగు లధికమగు నానందము కల్గుచున్నదని చెప్పబడును. ఇట్లే శతగుణాధిక్యమున మోక్షానందమువరకును చెప్పబడును. ఇట్లేల చెప్పవలెనన-

కామము జయింపబడరానిది. ఈశ్వరుడు తెలియరాని యట్టివాడు. అందుచే కామము శతగుణమున తగ్గుచురాగా జ్ఞానము నూరురెట్లధికమగుచు వచ్చునని దీనియభిప్రాయము. ఇన్నిసార్లు ఇన్నినూరులచే నని చెప్పుట కొలతకాదు. ఆయా యవస్థలవర్ణించుటయును కామమింతతీరరానిదియని చెప్పుటయు సర్వైవట్ల నీశ్వరునెరుగగోరిసంశయగ్రస్తుడగుచుండ శ్రోత్రియత్వమున దానిని నివారించుచుండవలెననియు నిట్లుచెప్పబడినది. శ్రోత్రియత్వమన వేదాదిసచ్ఛాస్త్రముల యర్థమును వినుటవలన దెలియజాలుట దానివలని జ్ఞానమున నుపాసకునకు గలుగు సంశయముల నివారణకై మరలమరల దానిని సంశయవిచ్ఛేదకమగునట్లు అనుభవజ్ఞులగు గురువులవలన దెలియుచుండవలెను. ఉదా॥ సర్వాంతర్యామిని ధ్యానింపవలయుననిన సర్వపదార్థముల లోపల నిండియుండువాడని యాలోచించి సర్వపదార్థములను

తనకు తెలసినంతవరకు దారణచేసి వానిసివిడచి అంతర్యామిని మెరుకలేనివిధమున ధ్యానింపబోగా అన్నిటి లోపలయునిన వెలినిలేడా? యనుసంశయము దోపనచ్చును. అట్లు లేడనిన అఖండత్వానంతత్వములు చెప్పఁబడుట వ్యర్థమగును. అట్లైన సర్వాంతర్యామి యనుటేల? యనుసంశయము దోపవచ్చును. అంతర్యామిత్వమున పరిచ్ఛిన్నత్వ మేర్పడు చున్న దేయన సూక్ష్మత్వమునుగూర్చి యాశబ్ద మట్లుచెప్పబడెనేకాని లోపల గలిగి వెలిని లేడనికాదు. తత్త్వాయః పిండమున లోపల, వెలుపల, అగ్ని సూక్ష్మత్వము గలదియగుట వ్యాపింపగలిగినట్లు, పాలయందలి తెలుపు వానియందంతట గలయట్లు, సముద్రము నందలియుప్పు దానియందంతట నిండియున్నట్లు సూక్ష్మత్వమున వ్యాపకత్వానంతత్వాదులు కలిగియుండవచ్చునని గురువు వలన మరలమరలవిని సంశయనివృత్తి చేయబడుచుండవలెను. ఇంతియగాక మరల పరామర్శింపకయున్న విద్య మరువవచ్చును. అభ్యాసము లేకున్న సత్యమెరుంగజాలకపోవచ్చును. దానివలన విసుగు దోచవచ్చును. ఇతరవ్యవహారములయందలి రుచివలన దీని నప్రిధానముగ జూడవచ్చును. అస్వస్థతవలన, అశక్తివలన, అననుభవనువలన, అనావశ్యకమగుటవలన, అకామహతుడు గాకపోవుటవలన, శ్రోత్రియత్వముచెడి విద్యలభ్యసింపబడెనో? లేదో? యనునట్లు దోచవచ్చును. దానంజేసి శ్రోత్రియత్వము ముక్త్యానంద మెరుగువరకును ముఖ్యసాధనములగు నీరెంటిలో నొకటిగా చెప్పబడినది.

ఇక కామము ఆత్మకు దేహేంద్రియాద్యభిమానమున కలుగు నట్టిది. దేహసంబంధ మున్నంతకాల మది పోయినదనుటెట్లు? ఆత్మ మనసునుగూడి దానివలన నింద్రియములంగూడి త్వగింద్రియవ్యాప్తమగు నాపాదమస్తము దానై ఫలాని కుటుంబమునకు జెందినవాడననియు, ఫలాని నామముగలవాడననియు, అట్లు పిలచిన తాను మరుమాటలాడుచు లోకవిషయముల నన్నిటిం గోరుచు వానివలన సుఖదుఃఖములను తానై పొందుచుండును. అట్టి యీ దేహసంబంధమున దేహమున్నంతవరకు దానిని విడువనలవియగునా? ఇది గాక మరల దేహమునకూడ నిట్టి యిట్టిసుఖములు గావలెనని కోరుచుండునే అట్లు ఎడతెగని దీకామము. దేహ మన్నాదులవలన వృద్ధి నొందునదియు, కాక జీవింపదగినదియు నగుచుండ నాయన్నములేకున్న నశించునట్టిదిగూడ యగుచుండ నట్లే యింద్రియ విషయములం బొందకున్న దుఃఖము గలుగుచుండ కామమును విడుచుటయెట్లు? ఇక లోకవిషయము లన్నియును సంయోగవియోగములు గలవియును నశ్వరములును అనుభవక్షయము లగుటవలనగూడ కామము వీడజాలదు. అదిగాక పొందినవస్తువులట్లే కొన్ని యున్నవన్న మరికొన్నిటింగోరుచుండును. అవి కలిగెనన్న వేరొక కొన్నిటిం గోరుచుండును. ఇట్లెన్నియున్నను సంతుష్టి కలుగదు సరిగదా ధర్మశృంఖలముల తెగగొట్టియో, సడలించియో యైన కామము వెంటనాత్మ బర్వెడుచుండును. ఒకవేళ యీశ్వరారాధన మొనర్పబూనిన

నదియు కోర్కెల నొందుటకే యగుచున్నది. దాన దమ శమాదులన్నియును బాధానివారణమునకైన కోర్కెయే యగుచున్నది. ఇక నాయుపాసనావిధానము మేలగునో? కాదో? యను సంశయమున నీశ్వరుడనుగ్రహింపనున్నాడో? లేదో? యనెడి సంశయరూపమున సత్యస్వరూపుని నెరిగి యానందింతునో? లేదో? యనెడి భయమున అచంచలమగు మోక్షావాప్తి పర్యంతమును - తెలజూపజాలునట్టి దీకామమగుట నిట్లు చెప్పబడె ననవచ్చును. అయిన నీకామము జయింపబడునెట్లన త్యాగమువలన రాగము పోగొట్టబడును. రాగము కలిగియున్నను, త్యాగము కలిగియున్నను, లోకవిషయములు అనిత్యములును, రాకపోకలు గలవియు నగుటంజేసి వియోగము తప్పక కలుగుచుండును. దానియందు రాగమున శోకము కలుగును. త్యాగమున సంతుష్టి కలుగును. లక్షరూప్యములు తానొకనికిచ్చిన వానింగూర్చి పరితాప ముదయింపదు. తన యిచ్ఛలేనిదే యొకకాసు జారిపడినచో 10 కాసుల విలువగల దీపవుఖర్చునైన నంగీకరించి వెదకి తీరును. తానిచ్ఛతో చేసిన వ్యయ మెంతటిదియైన విచారింపడు. అనైచ్ఛికముగా నైనచో విచారించును. ఇక ప్రేమవిషయమగు బంధుజనులలో నెవ్వరికేని కాలున ముల్లుగ్రుచ్చుకొనినదనిన విచారించును. మహాసంగ్రామమున తనకు సంబంధములేని కోట్లకొలది ప్రజలు అకాలమృత్యువు వాతబడుచున్నారనిన జాలినైన నొందకనవ్వుచు వారికి తగినశాస్తియైనదని యొకపక్షమువారిని నిందించుచు

గూడ బల్కుచుండును. అట్టిదియగుట మోహములేని త్యాగమున కామము జయింపబడును. కాని యింద్రియములు నిరంతరమును వేధించుచున్నందున జారుపాటులు విస్తారములై యుండును. దానంజేసి యీకామము జయింపబడవలసినదిగా శతగుణాధిక్యమున నిన్నిసార్లు చెప్పబడిన దనవచ్చును.

ఇట్లు అకామహతత్వశ్రోత్రియత్వములు కలిగి యీశ్వరారాధనతత్పరుడయ్యేనేని మనుష్యానంద మొకలెక్క చేయడు. ఎట్టి విపత్సమయంబులందైన నీశ్వరధ్యానమున మనసు శోకమునుండి మరలి సంతుష్టిం గాంచగలదు. అట్లగుటచేలోకభోగములకంటెనీశ్వరారాధనముసుఖతరమనియెంచబడినది. అట్లు ఈశ్వరుని పాటలం బద్యముల నుతించువారి గా నందమా మనుష్యానందముకంటె నూరుమడుంగు లధికముగ నుండునని మనుష్యగంధర్వానందము చెప్పబడినది.

లోకవిషయము లన్నిటిలో గానమాధుర్యమున కందరును వశులగుచుందురు. అయినను లోకవిషయమునచెప్పబడు నీశ్వరారాధనము మనసు నరికట్టజాలదు. కాన నీపరంపరాక్రమము నంతయు నీమహర్షి చెప్పియుండెను. ఇక నీగంధర్వదేవాది నామము లన్యలోకవిషయములని దలంచరాదు. అట్టిది కలుగజాలదని యీవరకే చెప్పబడియున్నది. కాక శ్రోత్రియత్వా కామహతత్వములు గలవానికని చెప్పబడుచున్నందున నట్టిసంశయమునకు తావే కలుగజాలదు.

తేయేశతం మనుష్యగంధర్వాణామానందాః । స ఏకో దేవగంధర్వాణా మానందః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే=అ, శతం = నూరగు, మనుష్యగంధర్వాణాం ఆనందాః=మనుష్య గంధర్వులయొక్క ఆనందములు, యే=ఏవియో సః = ఆయానందము, ఏకః = ఒకటియగు, దేవగంధర్వాణా మానందః=దేవ గంధర్వులయొక్క యానంద మగుచున్నది. శ్రోత్రియస్య=శ్రోత్రియునకు, చ అకామహతస్య = మరియు నకామహతునకు, శ్రోత్రియత్వాకామహతత్వములుగల భక్తునకు ఆమనుష్య గంధర్వానందములు శతగుణాధిక్యములు గలవి యెవ్వియో (వానికి సాటియగు) దేవగంధర్వుల యానంద మొక్కటియగుచున్నది. అనగా కవులై నటకులై పాటల పద్యముల నాయీశు నారాధించువారు దేవగంధర్వు లనబడుదురు. అట్టివారు భావవిస్తారము గలవారై యీశ్వరు నారాధించుచు భావమున గానమున హెచ్చగుసుఖమనుభవించువారుగాననూరు మడుంగు లధికసుఖము నొందుదురని చెప్పబడెను.

తేయేశతం దేవగంధర్వాణామానందాః । స ఏకః పితౄణాం చిరలోక లోకానా మానందః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే=అ, శతం=నూరగు, దేవగంధర్వాణా మానందాః= దేవగంధర్వులయొక్క ఆనందములు, యే =ఏవియో, సః=ఆయానందము, ఏకః = ఒకటియగు, పితౄణాంచిరలోకానాం =

చిరలోకలోకులగు పితరులయొక్క, ఆనందః=ఆనందము అగుచున్నది, శ్రోత్రియస్య=శ్రోత్రియునకు, చ అకామహతస్య=మరియు నకామహతుడగువానికి కామముచే కొట్టబడిన శ్రోత్రియుడగువానికి ఆనూరగు దేవగంధర్వుల యానందము లెవ్వియో ఆయానంద మొకటియగు చిరలోకలోకపితరుల యానందమగుచున్నది. అనగా చిరలోకలోకులన చిరాయుర్వంతులు పితరులన పండితులై యితరులకు విద్యాభ్యాసము చేయించువారు. అకాలమృత్యువులు గలుగకున్నచో సత్యంకల్ప సద్వ్యాపారములు కలవారై రేని చిరజీవులు కాగలరు. నైతిక ఆర్థిక పారమార్థిక పదార్థ విజ్ఞానాది విద్యలంన్నివి వాని నితరుల కుపదేశించుచు ఆవిద్యలవలన తెలియగలిగినంతవరకు మాటమాత్రమున నీశ్వరారాధన మొనర్చుచుండువారు వారికంటె నూరురెట్లధికమగు నానంద మొందెదరు. ఎట్టి విద్వాంసులైనను బరమేశ్వరు ననుభవమున దెలియజాలనిచో వారియందలి దేహాభిమానము నశింపజాలదు. ఇట్లు వినికి గలిగియు త్యాగము నభ్యసించుచునున్నందునను కొంతసుఖమనుభవించుచున్నను, అభిమానముకలదగుట నదియు నిషేధింపబడును.

తేయేశతం పితౄణాం చిరలోకానాం మానందాః । స ఏక ఆజానజానాం దేవానా మానందః। శ్రోత్రియస్య చాకామహతస్య ।

పితౄణాం చిరలోకలోకానాం = చిరలోకలోకులగు పితరులకు, తే=ఆ, ఆనందాః = ఆనందములు, శతం=నూరగునవి,

యే = ఏవిగలవో, సః = ఆయానంద సమూహము, అజాన జానాందేవానాం = అజానజులకు దేవతలకు, ఏకః=ఒకటియగు ఆనందః=ఆనందమగుచున్నది, శ్రోత్రియస్య=శ్రోత్రియత్వము గలవానికి, చ అకామహతస్య = మరియు నకామహతునకు

శ్రోత్రియత్వా కామహతత్వములు గలవానికి ఆనూరగు చిరలోకలోకులగు పితరులయానందము లెవ్వియో, ఆసమూహా నందము ఆజానజులగు దేవతలయొక్క ఒకటియగు నానంద మగుచున్నది. అనగా- వినికియు త్యాగశీలమును గలయాతనికి అనుట అన్నిటం గలదు. ఆజానజులు జ్ఞానముకలిగిన దానివలన నొప్పువారనుట పరమేశుడిట్టివాడు జీవప్రకృతులిట్టివి ఇట్లైన తరింతుమనెడి జ్ఞానముకలిగియు, నీశ్వరారాధనము కలిగియు దానిని యనుభవమున బొందుటకు దేహాద్యభిమాన మడ్డు పడుచు రాగా విజ్ఞానమును బొందజాలని యట్టివారు. అట్టి వారు పూర్వోక్తశతగుణాధిక్య సుఖానుభవముగలవారని చెప్ప బడెను.

తేయేశతమజానజానాం దేవానా మానందాః । స ఏకః కర్మదేవానాం దేవానా మానందః యేకర్మణా దేవానపియంతి శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే=అ, అజానజానాం దేవానాం = అజానజులగు దేవ తలకు, శతం = నూరగు, ఆనందాః = ఆనందములు, యే =

ఏవియో, సః = ఆనమూహానందము, యే=ఎవరు, కర్మణా = కర్మముచే, దేవాన్=దేవతలను, అపియంతి=కలయుచున్నారో (అట్టి) కర్మదేవానాం దేవానాం - కర్మదేవతలకు దేవతలకు, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందము అగుచున్నది శ్రోత్రియస్య చ అకామహతస్య = శ్రోత్రియత్వ కామహతత్వములు గలవానికి-

కర్మలచే దేవతలనిపించుకొనువారు, అనగా మొదల లేక మధ్య కలుగుటవలనగాని మాంసాహారాది అపరిశుద్ధాచారముల కలిగినవారియందుగాని కలిగి దేవత్వమున చెప్పబడు కర్మలొనర్చుటవలన దేవతలనంబడువారు. తాను స్వయముగ జేయు కర్మవలననే తాను తరించగలడు. ఒకరికర్మ మింకొకరిని బాధింపజాలదు. కర్మఫలములు మరల జన్మమున దైవ బొంకవలయుగదా! ఉత్తమకర్మాచరణము గలవారు సత్ఫలముల నొందనర్హులు. దేవతలనగా భగవద్గీత పదియారవయధ్యాయమందిట్లు చెప్పబడినది. అభయము, సత్వసంశుద్ధి, జ్ఞానయోగమున నుండుట, దానము, దమము, యజ్ఞము, స్వాధ్యాయము తపము, ఆర్జవము, అహింస, సత్యము, అక్రోధము, త్యాగము శాంతము, అపైశునము, భూతములయందు దయ, అలోలత్వము, మార్దవము, చెడ్డపనులయందు లజ్జ, అచాపలము తేజము, క్షమ, ధృతి, శౌచము, అద్రోహము, నాతిమానిత్వము, దైవసంపదలని చెప్పబడినది.

ఇట్టివి కలిగియు అకర్మలయందుగాని, కర్మఫలముల యందుగాని యభిమానము గలిగెనేని యాకర్మములు పునర్జన్మహేతువు లగును.

శ్రోత్రియత్వా కామహతత్వములుకలిగి యీశోపాసన మొనర్చుచుండు కర్మదేవులగు దేవతలయానందము పూర్వోక్తమగు నాజానజులగు దేవతల యానందముకంటె నూరుమడుంగు లధికమని వర్ణింపబడెను. సత్కర్మలవలన మనసున ధీరత్వమును లోకమున గౌరవమును పరమున సుఖమును గలుగగలవు. అందుచే సాత్వికప్రవృత్తి తత్కాలమున నిలాభదాయకము.

తేయేశతం కర్మదేవానాం దేవానా మానందాః ।
స ఏకో దేవానా మానందః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే = ఆ, కర్మదేవానాం = కర్మదేవతలగు దేవతలకు, శతం = నూరగు, ఆనందాః = ఆనందములు, యే = ఏవిగలవో సః = ఆసమూహానందము, దేవానాం = దేవతలకు, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందముగుచున్నది. అనగా-

కుటుంబ సంప్రదాయముల వలనగాని తాఁపొందిన విద్యలవలనగాని యావనావస్థయందే పైనిజెప్పిన దైవీసంపద గలవారు దేవతలనబడుదురు. అట్టివారు శ్రోత్రియత్వాకామహతత్వములవలన నీశ్వరోపాసకులైనవారి యానందము

పూర్వోక్తానందముకంటె నూరుమడుంగు లధికమైదోచును. ఇట్టివారాజన్మమున తరింపజాలకున్నను మరల జన్మమున నాతపఃఫలమగు జ్ఞానముకలిగి తరింపవచ్చును. ఇదియ బహు జన్మలవలన మోక్షప్రాప్తి యనంబడును ఇట్లెన్నియో విధములగాని బోగొట్టబడజాల దీదేహాభిమానమని యీమహర్షి యభిప్రాయ మనవచ్చును..

తేయేశతం దేవానామానందాః । స ఏక ఇంద్రస్యానందః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే=ఆ, దేవానాం=దేవతలకు, శతం = నూరగు, ఆనందాః = ఆనందములు, యే = ఏవియో, సః=ఆయానందము, ఇంద్రస్య - ఇంద్రునకు, ఏకః = ఒకటియగు, ఆనందః=ఆనందమగుచున్నది. దేవతలయందు శ్రేష్ఠుడింద్రుడనంబడును. శ్రోత్రియత్వాకామహతత్వములవలన పూర్వోక్త దేవానందముకంటె నూరుమడుంగు లధికమగునది యింద్రానందమని చెప్పబడెను.

తేయేశత మింద్రస్యానందాః । స ఏకో బృహస్పతేరానందః । శ్రోత్రియస్యచాకామహతస్య ।

తే=ఆ, ఇంద్రస్య = ఇంద్రునియొక్క, శతం = నూరగు ఆనందాః = ఆనందములు, యే = ఏవిగలవో, సః = ఆసమూహానందము, బృహస్పతేః = బృహస్పతికి, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందమగుచున్నది.

బృహస్పతి దేవతల గురువనెదరు. అనగా జ్ఞానమును, నీతియును సర్వశాస్త్రరహస్యములును చెప్పజాలిన యట్టివాడన బడును. శ్రోత్రియత్వా కామహతత్వములవలన యింద్రా నందముకంటె నూరురెట్లు ఆనందము కలవాడగును. కర్మ దేవతలు మొదలు జ్ఞానము కల్గిన నీశ్వరారాధన మొనర్చు వారనబడుదురు. అట్లయ్యును, అనుభవమున బరమేశ్వరా నందము పూర్తిగా పొందబడకుండుటను, ఎన్ని సత్కర్మలవలన నైనను, మోక్ష మొందజాలరని దీనిభావము.

తేయేశతం బృహస్పతే రానందాః। స ఏకః ప్రజాపతే రానందః । శ్రోత్రియస్యచాకామహతస్య ।

బృహస్పతే = బృహస్పతియొక్క, తేఆనందాః = ఆ ఆనందములు, శతం = నూరగునవో, యే = ఏవికలవో, సః = సమూహానందము, ప్రజాపతేః = ప్రజాపతికి, ఏకః = ఒకటి యగు, ఆనందః - ఆనందము అగుచున్నది. అనగా-

శ్రోత్రియత్వా కామహతత్వములవలన పరిశుద్ధాంత రంగుడై లోకమున జ్ఞానోపదేశ మొనర్చుచు ప్రజలచేనావరింప బడుచుండువాడు ప్రజాపతియనబడును. అట్టివానియానందము పూర్వోక్తానందముకంటె నూరురెట్లధికమై దనరారును.

తేయేశతం ప్రజాపతే రానందాః । స ఏకోబ్రహ్మణ ఆనందః । శ్రోత్రియస్య చా కామహతస్య ।

శ్రోత్రియస్య=శ్రోత్రియత్వముగల, చ అకామహత తస్య=మరియు నకామహతుఁడగువానికి, తే=ఆ, ప్రజాపతేః=ప్రజాపతియొక్క శతం=నూరగు, ఆనందాః=ఆనందములు, యే=ఏవియో, సః= సమూహానందము బ్రహ్మణః=బ్రహ్మమునకు, ఏకః=ఒకటియగు, ఆనందః=ఆనందము అగుచున్నది. అనగా.

శ్రోత్రియత్వ కామహత్వములవలన సంపూర్ణజయముగాంచినవాఁడగుటవలన బ్రహ్మానందమిట్టిదియని తెలిసియనుభవింపగలఁడు. అట్టిది పూర్వోక్తానందముకంటె నూరు మడుంగు లధికమనబడును, ఇదియె ముక్త్యానందమనబడును. ఈ యానంద మొందుట కష్టతరమని చెప్పుటకే యిన్ని యంతరవులు కల్పించి చెప్పఁబడెననవచ్చును. సర్వబాధావినిర్ముక్తమగు ముక్తావస్థయందలి యాశయు, ఇంత దెలిసి మరల ప్రమాదమున బడుదునా! యనుపూనికయు, క్షణమాత్రసుఖములకాశించి యనంతసుఖము ను బోవిడుతునా? యను ధీరత్వమును సంకల్పించినది పలుకుటయు, పలికినదాని నాచరించుటయు, ననుత్రికరణశుద్ధితో కూడినసత్యప్రతిజ్ఞయు, దేహాదుల నభిమానించుటవలనగదా అసంగుడగు నేను సర్వదోషములకును సర్వదుఃఖములకును గురియగుచున్నానను విరాగమును, ఎన్నివిధముల బ్రయత్నించినను, యాత్మయం దీశ్వరానందము నొందజాలకుండుటకే యింద్రియమానసాదులే కారణములగుచున్నవి. కాన వానిని జయింపవలెననెడి కార్యదీక్షయు కామాదుల జయింపజాలక మరల దానివశమున బడిన మిథ్యా

చారుడందురనియెడి లజ్జయు ఈశ్వరధ్యాన మలవడిన దాని యందు లోకవివిషయములస్మరించి పొందునట్టి యానందాభ్యా సమునలోకవిషయములందలి నిరసనమును రుచిచూచితినిగదా! దీనినెట్లు విడుతుననెడి యీశ్వరధ్యానమునందలి యభిరుచియు దేహేంద్రియాది మమకారమున పరిశుద్ధుడగు నాత్మ వంచింప బడుచున్నాడనెడి నిశ్చయజ్ఞానమున దోచు నిర్మమమును, మొదలగువానివలన గలుగు జ్ఞానవైరాగ్య యీశ్వరోపాసనల వలని యభ్యాసబలమున నా యీశ్వరానంద మిట్టిదియని దెలియగాలుచును. దేహాభిమానమున దోచుకామము సంపూర్ణ ముగ జయింపబడిననే సంపూర్ణమగు నాయానంద మనుభ వింపజాలును. ఇట్లు బ్రహ్మానందము ముముక్షువుల ఉపయో గార్థమైవర్ణింపబడినది.

సయశ్చాయం పురుషే । యశ్చాసావాదిత్యే । స ఏకః ।

యః=ఏ యానందము, అయంపురుషే=ఈ ముక్తపురు షునియందు (కలదో) సః=అదియును్న యః=చ- అసౌ ఏ= యానందము అదియును, ఆదిత్యే=ఈ చెప్పబడిన బ్రహ్మము నందును (కలదో) సః=ఆ యానందము ఏకః=ఒకటి యగు చున్నది.

ఏ యానంద మీ ముక్తపురుషునియందుగలదో అది యును, ఏయానంద మీబ్రహ్మమునందుగలదో అదియును. నగు ఆయానంద మొక్కటి యగుచున్నది- అనగా-

ఇచ్చట నాదిత్యశబ్ద మాపరబ్రహ్మమునే చెప్పును. ఏలన?

ఇది బరమేశ్వరుని చెప్పుపట్టగుట సూర్యుని సంబంధ మీాప్రకరణమున లేనిదియగుట, ఆదిత్యశబ్దము ఈశ్వరుని యందుగూడ చెప్పబడజాలినదియగుట, బరబ్రహ్మమునే చెప్ప వలెను. లేక సూర్యునియందుండు వాడందమన్న పరమేశ్వ రుడు సూర్యునియందుండి మరెచ్చటను లేడనుటకు వీలులేదు. కాననాయర్థమును సరిపడజాలదు. మొదటి యనువాకమున- "సోశ్నుతే సర్వాన్కామాన్సహ-బ్రహ్మణా విపశ్చితేతి-" యని చెప్పబడిన దానివివరణ మిట్లుగా చెప్పఁడిన దన వచ్చును. అందుచే ముక్తపురుషుడ్బ్రహ్మమునందలి యానంద మనుభవించుటయె సర్వకోర్కెల నొందుటయని చెప్పబడు చున్నది. ఇదియే ఆనందవివరణమని చెప్పబడును.

ఇట్లు పాఠకుల సుబోధనార్థమై 11 అంతరువులు వర్ణిం పబడెను. వీనిని వ్యర్థప్రవచనములని దలంపరాదు. జ్ఞాన మజ్ఞానముచే నావరింపబడియుండును. జ్ఞానముసుఖమును అజ్ఞా నముదుఃఖమునుఅని చెప్పబడవచ్చును. దానంజేసిసుఖముదుఃఖ ముచే నావరింపబడి యున్నదనవలెను. అందుచే నజ్ఞానము కృశిం చినచో దుఃఖమును కృశించును. దానిపరిమితిమెదీనికికలిగియుం డును, దేహసంబంధమె అజ్ఞానము; కాగా దేహి జ్ఞానమని యుం జెప్పబడవచ్చును. దానివలన దేహాభిమానమెంతవరకు

కృశించిన నంతవరకు జ్ఞానము వికసింపబడుచుండును. దానివలన నానంద మనుభవింపబడును. దేహికి దేహసంబంధమునకలిగిన పదునెన్మిదిశక్తులనుండి యభ్యాసమున బయటబడెడి వాడు మాత్రి మానంద మనుభవింపజాలును. ఎంత యభ్యసించిన వానికైనను దేహసంబంధము గలంతవరకు మరల మృతి యేర్పడగలదు, దానంజేసి యీ భేదములు కల్పింపబడెను. అందు మొదటిదియగు మానుష్యానందము దేహమాత్రాను భవార్హలోకవిషయసంజాతమగుట మొదల నిషేధింపబడెను. పిమ్మట నాల్గంతరములవరకును శబ్దమాత్రజ్ఞానమగుట నభ్యాస బలము ననంతరవు లేర్పరుపబడెను. పిమ్మట మరిమైదవస్థలు అభ్యాసుల తారతమ్యము లనవచ్చును. నిర్దుష్టమును అస్ఖలిత మును అగు ఉపాసనాశక్తి కలిగెనేని బ్రహ్మానంద మనుభ వింపబడును.

సయఏవంవిత్ ॥ అస్మాల్లోకాత్ప్రేత్య । ఏతమన్నమయమాత్మాన
ము పసంక్రామతి।ఏతం ప్రాణమయమాత్మానముపసంక్రామతి
ఏతంమనోమయమాత్మానముప సంక్రామతి । ఏతంవిజ్ఞాన
మయ మాత్మానముప సంక్రామతి ఏతమానందమయ
మాత్మానముప సంక్రామతి । తదప్యేషశ్లోకో భవతి ।

యః = ఎవడు ఏవం విత్ = ఈవిధమున తెలియుచున్నాడో సః = వాడు, అస్మాత్ లోకాత్ = ఈలోకము నుండి ప్రేత్య = మరణించి ఏతం = ఈ అన్నమయ మాత్మానం = అన్నమయాత్మను ఉపసంక్రామతి = పొందుచున్నాడు. ఏతంప్రాణమయమాత్మానం ఉపసంక్రామతి = ఈ ప్రాణమయాత్మను పొందుచున్నాడు. ఏతం మనోమయమాత్మానం ఉపసంక్రామతి = ఈ మనోమయాత్మను పొందుచున్నాడు. ఏతం విజ్ఞానమయం ఆత్మానం ఉపసంక్రామతి = ఈ విజ్ఞానమయాత్మను పొందుచున్నాడు. ఏతం ఆనందమయం ఆత్మానం ఉపసంక్రామతి=ఈ ఆనందమయాత్మను పొందుచున్నాడు. తత్ అపి = ఆవిషయమునుగూర్చి ఏషః=ఇది, శ్లోకః=మంత్రము భవతి = అగుచున్నది. ఎవడీవిధమున తెలియుచున్నాడో వాడీ లోకమును విడచి మరల నీయన్నమయాది పంచకోశములను బొందుచున్నాడని చెప్పబడెను. అనగా—

పైని జెప్పిన యానందమీమాంసనుగాని, ఉపనిషత్తునంతయునుంగాని దెలిసిన వాడని యనవచ్చును. ఇట్లు దెలసిన ఆచరణములేనివానికి మరల జన్మమే కలదని చెప్పబడినది. ఇచ్చట తెలసినవానికి యనిమాత్రమే చెప్పబడుటచే ఈశ్వరానుభవములేనివానికని మాత్రము చెప్పబడవలెను. అట్లీశ్వరానుభవము కలవానికి బ్రహ్మానందమే కలుగ గలదని చెప్పబడెను. అయినచో నీజ్ఞానమున ఫలము గలుగదా ? యన

కలదనియే చెప్పబడె ననవచ్చును. అట్టివాడీపంచకోశము లను పొందుసన విజ్ఞాన మయానంద మయకోశములు ముము క్షువునందుమాత్రమె ఉపయుక్తములును ప్రకటీకృతములును కాగలుగును. తదితర సర్వజీవులయందును అన్నమయ ప్రాణ మయమనోమయములు మాత్రమె కార్యోన్ముఖములై యుండ గలవు. విజ్ఞానానందములు వాని యనుచరులై ప్రకటింపబడక వానియందను జేరి వానివశమున వానియందలి సుఖదుఃఖముల నొందుచుండును. అందుచే పంచకోశములంబొందునని చెప్పు టలో నీ జ్ఞానఫలమూ మరుజన్మమున గలుగునన వచ్చును.

జ్ఞానమొక కర్మము కాదుకదా! దానివలన ఫలమెట్లు కలుగునన ? కర్మకు జ్ఞానసంకల్పములే ముఖ్యములు;అదియును రాగవిరాగముల వలన. కర్మఫలవంతమును, కర్మమకర్మమై అఫలదమును కాబడును. సంకల్పమొక విధమున గలుగ కర్మ తదన్య విధమైనను సంకల్ప ఫలమే యనుభవింపబడును. త్యాగ బుద్ధితో దానమొనర్చినా సంతోషి కాగలడు. పదుం గురులో. మెప్పుకై గాని పరులబలవంతమున నవశుడై కాని దానమొనర్చినా అదిమొదలు ఆయిచ్చినదానికై వగచుచుం డును. మనసున విచారము కలిగిన నెవ్వనితోడనైనంబలుకక యుండజాలడు. దానివలన కీర్తియునుంగలుగును. కానసత్కార్యా చరణమునగూడ దుష్ఫలమే కలుగుచున్నది. అందుచే పరు లను మోసముచేయ నిచ్ఛయించువాడాత్మను మోసమొనర్చి

నటులే కాబడును. దీనియందా ప్రతిగ్రహీత, ధనమును చేకొని సుఖింపగలడు. ఈతడిట్లు దుఃఖించుచుండును. అయిన చో సంకల్పమాత్రమున ఫలమొందునన్న దీక్షసత్రయాగము సంకల్పించి యొకరికై న పట్టిడన్నమిడకున్న దాని ఫలమత డొందునా? యన—

అదియును వంచనయేగదా! ఆ వంచనకర్తామగు ఫల మాతడొందగలడు. దాని కనువగు శరీకరములును పరిస్థితు లను కలిగినవాడట్లు సంకల్పించెనేని యదియుక్తమగు సంకల్ప మనంబడును. లేనినాడది పరులమోసగించుటకైన సంకల్ప మనంబడును. యుక్తమగు సంకల్పమున కలిగిన కర్మాచరణ మున తన యిచ్ఛలేకయే దోచు నంతరాయముల వలన నా కర్మమాగబడినను నా సత్కర్మ ఫలమా సత్సంకల్పమున బొందునని విజ్ఞాన ఘనులు పల్కియుండిరి. పరవంచనమే ప్రధానమగు సంకల్పమున దైవికమగు నుపపత్తులచే నాకార్య మెట్లో నిర్వహింపబడిన దనినను ఆ వంచన ఫలమే పొందును. గాని యీ కార్యమందలి ఫలమొందజాలడందురు. కాన జ్ఞానసంకల్పములే కర్మఫలమునకు ముఖ్యములు. కాన జ్ఞానియగు నాతడు దాని సుఫలమొందునేగాని భ్రష్టుడు కాజాలడు. అందుచే జ్ఞానియగు నాతడు మరల జన్మమున నందుల కర్తాములగు దేహాదులనట్టి సత్కుటుంబమునందు బడసి వేగముగ పూర్వజన్మసంస్కార బలమున, జ్ఞానముగల

వాడగును. పిమ్మట నాతడు బ్రహ్మానందమెరిగినేని యకర్మత్వ సిద్ధిగాంచి మోక్షమొందునని యీ ముందనువాకమున చెప్పబడెననవచ్చును. లేకున్న నాల్గవ యనువాకమున జెప్పిన విషయము మరల చెప్పుట యనావశ్యకమనబడును. అదిగాక యీ యనువాకములన్నిటియందును ఒకానొక విషయముం గూర్చిచెప్పి వేరొక విషయముంగూర్చి మరికొంతచెప్పబడును. ఆ చెప్పబడిన దానియనుబంధ విషయముతో మరల యనువాక మారంభింపబడును.

## బ్రహ్మవల్లీ నవమానువాకము.

యతో వాచో నివర్తన్తే । అప్రాప్య మనసా సహ । ఆనందం బ్రహ్మణో విద్వాన్ । న బిభేతి కుతశ్చనేతి । ఏతగ్ం హ వావ న తపతి । కిమహగ్ం సాధు నాకరవం । కిమహం పాపమకరవమితి స య ఏవం విద్వానేతే ఆత్మానగ్ం స్పృణుతే । య ఏవం వేద ఇత్యుపనిషత్ ।

సహనావవతు । సహనౌభునక్తు । సహవీర్యంకరవావ
హై । తేజస్వినావధీతమస్తుమావిద్విషావహై ।
ఓంశాంతి శ్శాంతి శ్శాంతిః ।

యతః = ఏ ఆనందమయ బ్రహ్మమునుండి వాచః = వాక్కులు,మనసాసహ = మనసుతోకూడ అప్రాప్య = పొందజాలక నివర్తంతే = మరలుచున్నవో (అట్టి) బ్రహ్మణః = బ్రహ్మముయొక్క ఆనందం = ఆనందమును, విద్వాన్ = ఎరిగినవాడు కుతశ్చన = దేనివలనను, నభేతి = భయపడడు. ఇతి మంత్రసమాప్తి అహం = నేను సాధు = మంచిపనులను, కింన అకరవం=ఏలచేయకపోతిని, అహం=నేను పాపం=పాపకర్మలను కింఅకరవం = ఏలచేసితిని? ఇతి = అనెడి (విచారము) ఏతం = ఈ బ్రహ్మానందమెరిగినవానిని నతపతివాహాస = తపింపజేయజాలదుగదా. యః = ఎవడు ఏతే = ఈ పుణ్యపాపములను ఏవం = ఈ విధముగా విద్వాన్ = తెలియుచున్నాడో సః = వాడు ఆత్మానం = పరమాత్మనుస్పృణుతే = స్పృశించుచున్నాడు (ఎరిగియానంది యగుచున్నాడు) యః = ఎవడు ఏతేఉభే = ఈరెండైనపుణ్యపాపములను ఏవం = ఈవిధముగా వేద = తెలియుచున్నాడో సః ఏషః = అట్టియితడు ఆత్మానం ఏవ = పరబ్రహ్మమునే స్పృణుతే = స్పృశించుచున్నాడు ఉపనిషత్ ఇతి = ఇది ఉపనిషత్తని సమాప్తి చెప్పబడుచున్నది.

సహనావవతనుశాంతి పాఠమునకు మొదట వాఖ్యాన మొనరింపబడినది. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః = ఆత్మిక భౌతిక దైవిక తాపముల శాంతి కోరబడినది.

ఏ ఆనందమయ బ్రిహ్మమునుండి మనసుతో కూడిన వాక్కులు పొందజాలక మరలుచున్నవో అట్టి బ్రహ్మము యొక్క ఆనంద మెరిగినవాడు దేనివలనను భయపడడు—అని చెప్పబడినది. అన—

ఇంద్రియమనసాదులను లోకవిషయములనుండి మరలించి ధ్యానమునకు సుఖములుగా నొనర్చి భావనోపచయమున పరిశుద్ధమగు బుద్ధితో కూడిన ఆత్మ, నిర్మలమును, నిర్వికార మును, దేశకాలాద్య బాధితమును, అనంతమును, 'సర్వబాధా విరహితమును, స్వచ్ఛందమును, శబ్దాదివిషయ రహితమును, నిర్వికల్పసమాధియుతమును, అభయమును, అచంచలమును, అనావృతమును, స్వయంప్రకాశమును, ఆధారవాంఛారహిత మును, అవేపకమును, శ్రేష్ఠమును, నిత్యమును, అగు బ్రహ్మా నందమును దెలియగలిగెనేని మరల మృత్యుభయముతో కూడిన సంసారమున బడడని చెప్పబడెను. ఇది నాల్గవ యను వాకమున కూడ చెప్పబడినది. ఇట్లెరిగిన బ్రిహ్మజ్ఞాని.

నేను మంచికర్మల నేల చేయకపోతిని ? పాపకర్మల నేల చేసితిని ? అనెడి విచారము ఈ బ్రిహ్మవేత్తను తపింపచేయ జాలదుకదా ! ఎవడు ఈ పుణ్యపాపముల నీవిధముగ తెలియు

చున్నాడో వాడు పరమేశ్వరుని తాకుచున్నవాడగుచున్నాడు. ఎవడు ఈ రెండైన పుణ్యాపాపములను ఈ విధముగ తెలియుచున్నాడో అట్టి యితడు పరమేశ్వరునే స్పృశించుచున్నాడు ఇదియె ఉపనిషత్తని చెప్పబడెను. అనగా.

దేహాత్మ సంబంధమున కర్మ తప్పనిదియై చేయబడుచుండును. నేను జ్ఞానినైతిని గదా !కర్మము లేల యొనర్పవలెనని మానినచో అదియు దేహాభిమానమునకలుగు నలసతయే యనబడును. తన దేహమున లోకమునకు కలుగు మేలు లేకుండబోవును. తాను సంఘమున జీవింప వలసిన వాడగుట బాధమాత్రము సంఘమున కొసంగజాలును. అందుచే యుక్తకర్మాచరణ ఫలమునందలి యభిమానము విడచినచో నది యకర్మ మనంబడును. అప్పుడదియును అతఃపూర్వమాచరింప బడిన కర్మములునుకూడ ఫలవంతములు కాజాలవు. దానివలన పరమేశ్వరునియందేయున్న యాత్మ యతనింగూడి యానందమొందగలుగును. అట్టిజ్ఞాని పరితాపనుందడు. మరెట్టివాడు పాపపుణ్యములంగూర్చి పరితపించుననన.

కొంచెము జ్ఞానముకలిగి యీశ్వరోపాసన మొనర్చుచు జాతిమతవర్ణాద్యభిమానమును బాయజాలక ప్రాపంచికవిషయములను మనసున విడచుటయెట్లను నమ్రతతో కర్మలంజేయుచు కర్మఫలభంగములయందును, మోక్షముయొక్క ఉత్కర్షను దలంచునపుడును, అట్లు దలచుచు మరల బలవంతమగునింద్రి

యములచే లాగబడి స్వాధీనమనస్కుఁడు గాఁజాలక, వ్యసనము లందగుల్కొఁనిన చిత్తవృత్తిగలవాడు, పురాణ వైరాగ్యము వంటి విరాగావస్థలయందట్లు పాపమేల చేసితిని ? పుణ్యమేల చేయకపోతిని ? యని పరితపించగలడు. పరితాపము రాగము వలననే కలుఁగఁగలదు. అప్పట్లకూడ నది విరాగ మనఁబడదు. తాత్కాలిక వైమనస్యమనంబడును. రాగసమ్మూర్ఛనము. సంకల్పించిన ఫలప్రాప్తికిది యంతరాయము కలిగెననుచింతయే యిట్టి పరితాప కారణము. ఏలన ? రాగమున సంకల్పించి నటుల ఫలమొందఁదగిన మోహము కలుగును. వ్యతిరేక ఫల మునసంతరాయకారణములయందు క్రోధమును, ప్రేమించిన వస్తునాశనమున దుఃఖమును, తద్వియోగమున బరితాపమును కలుగుచుండును. కాన పరితాపమొక రాగ లక్షణము. రాగమున నభయస్థితి నెట్టులొందగలడు ? అయినచో పాప పుణ్యకర్మవేనినైనను విరాగమున జ్ఞాని విడువవచ్చునా ? యన—దుస్సంకల్పమున చేయబడు కర్మము పాపమనబడును. అది పరులకు బాధాప్రదమై మనసునకు భయము, శంక, లజ్జ, అవమానము, పరితాపము, మొదలగు వానిని కలిగించును. అట్టిది రాగద్వేషాది దోషసమన్వితమగుట విజ్ఞాన వైరాగ్య ముల నెన్నఁడును కలుగనీయదు. అది సంపూర్ణమగు దేహాభి మానమున కలుగునట్టిది యగుట, దానినవశ్యము వీడవల యును. ఇక సత్సంకల్పమూలంజేయబడునట్టివి పుణ్యకర్మము లనంబడును. ఇవిలోకమునకును, తనకును మేలొనర్చునట్టివియై

మనసునధీరత్వమును, శాంతమును, సంతోషమును, మొదలగు వానిం గలుగజేయును. ఇట్టి కర్మలయం దభిమానముంచినను ఫలముకలుగ జేయును. అనగా మరల జన్మహేతువులగును. కాన వానియందలి ఫలము నాసింపకసత్కర్మలంజేయుచు నీశ్వరారాధనసర్వకామముల సమర్పించునేని వైరాగ్యమలవడగలదు. అట్టి వైరాగ్యజ్ఞానములలవడిన వానిచే దేహమున జేయబడునట్టికర్తవ్య కర్మల కర్మరూపము నొందజాలును. అట్టి వాడుపూర్వ పూర్వసమయములయందొనర్చిన పాపపుణ్యకర్మలంగూర్చిపరితపింపడు. కర్మసంపర్కము తనకు లేదను నిశ్చయ జ్ఞానమునవానింగూర్చి పరితపింపడు.

ఇట్లు కర్మలంగూర్చి పరితాపము నొందనియట్టి విద్వాంసుడు ఆత్మను స్పృశించునన పరమాత్మను అడ్డుకానియటుల జేరి వానితోడి యానంద మనుభవించునని యభిప్రాయము. అంతియగాని త్వగింద్రియ విషయమగు స్పర్శవంటిదికాదు. పరమేశ్వరునియందే సదా యీ యాత్మ కలిగియున్నను ప్రకృతి సంబంధమున నాతని నెన్నడుం దెలియజాలదు. కడకు కలడనియైననిశ్శంకముగ దలంపజాలదు. ఎవ్వని యింద్రియమానసాదులు వాని యాత్మ వశములగునో ఎవ్వని కర్మములు వైరాగ్యమున నఫలదములగునో ఎవని నిర్మలబుద్ధి నిరంతరీశ్వరోపాసనతత్పరత్వమున బరగునో, అట్టి వాడీశ్వరుని యడ్డులేని విధమున నరిగి యానందించుచున్నాడనవలెను. అదియె స్పృశించుట యనబడును. ఆత్మాదరముననిది పునరుక్తమని యెంచ

వలెను. నిగూఢమగు సత్యమును జెప్పునట్టిది యుపనిషత్తన బడును. ఇట్టిజ్ఞానమింద్రియాదిమానసులచే తెలియబడ రానిదియై యుండును. మహా తపస్సంపన్నులగు వారిచే మాత్రము తెలియబడగలదు. అట్టి తపస్సంపన్నులగు మహర్షులు దయామయులగుట లోకోపకారార్థమీ నిగూఢసత్యములం బ్రకటించి యుండిరి. సహనావవతు అనెడిశాంతి జెప్పబడినది. దానియర్థము మొదట చెప్పబడియున్నది.

ఓం శాంతిశ్శాంతి శ్శాంతిః



శ్రీనివాస ప్రెస్, రాజమండ్రి.